www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 17-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 342 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా.5:32 తదుపరి పాడ్యమి, నక్షత్రం: ధనిష్ఠ రా.9:16 తదుపరి శతభిషం, వర్జ్యం: తె. 4:28-6:04, దుర్ముహూర్తం: ఉ.9:02-9:48, రా.10:20-రా.11:08, అమృతఘడియలు: ఉ.10:39-12:17, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:44, సూర్యాస్తమయం: 6:13 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు	
న్యూజిలాండ్ X కెనడా (ఉ. 11 గం. నుంచి)	
ఐర్లాండ్ X జింబాబ్వే (మ.3 గం.)	
నేపాల్ X స్కాట్లాండ్ (రా.7 గం.)	


ఒమర్జాయ్ (4/15)

శతక్కొట్టిన నిస్సాంక



నిస్సాంక (52 బంతుల్లో 100 నాటౌట్)

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో ఆతిథ్య శ్రీలంక హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8లోకి ప్రవేశించింది. సోమవారం గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ పతుమ్ నిస్సాంక (52 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 100 నాటౌట్) ద్వారా తాజా టోర్నీలో తొలి శతకం నమోదైంది. ఈ గెలుపుతో లంక ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఆసీస్ మూడు మ్యాచ్‌ల్లో రెండు పాయింట్లతో తమ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఎందుకంటే జింబాబ్వే మరో మ్యాచ్ గెలిస్తే చాలు ఆసీస్ ఇంటిముఖం పడుతుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు హెడ్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 56)తో పాటు టోర్నీలో తొలి మ్యాచ్ ఆడిన కెప్టెన్ మార్ష్ (27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 54) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరి జోరుకు ఓ దశలో 8.2 ఓవర్లలోనే స్కోరు 104కు చేరింది. ఈ స్థితిలో జట్టు స్కోరు 220 ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత లంక బౌలర్లు కట్టడి చేయగా ఆసీస్ తడబడింది. ఇన్‌గ్లి‌స్ (27), మ్యాక్స్‌వెల్ (22) మాత్రమే ఫర్వాలేదనిపించారు. హేమంతకు మూడు, చమీరకు రెండు వికెట్లు దక్కాయి.

నిస్సాంక జోరు: భారీ ఛేదనలో శ్రీలంక 18 ఓవర్లలో 184/2 స్కోరుతో గెలిచింది. టీ20 వరల్డ్‌కప్‌ల్లో ఈ జట్టుకిదే అత్యధిక ఛేదన. నిస్సాంక, కుశాల్ మెండిస్ (51) ఆసీస్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 97 పరుగులు జత చేశారు. ఆ తర్వాత రత్నాయకే (28 నాటౌట్) అండతో మూడో వికెట్‌కు నిస్సాంక 34 బంతుల్లోనే 79 పరుగుల అజేయ భాగస్వామ్యం నమోదు చేసి మ్యాచ్‌ను ముగించాడు. స్టొయినిస్‌కు రెండు వికెట్లు దక్కగా.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిస్సాంక నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 181 ఆలౌట్. (హెడ్ 56, మార్ష్ 54, ఇన్‌గ్లిస్ 27; హేమంత 3/37, చమీర 2/36).

శ్రీలంక: 18 ఓవర్లలో 184/2 (నిస్సాంక 100 నాటౌట్, మెండిస్ 51; స్టొయినిస్ 2/46).

వన్‌సైడైతే కష్టమే!



కరాచీ: పాకిస్థాన్‌ను మన జట్టు మరోసారి చిత్తుగా ఓడించిందని భారత్ క్రికెట్ ఫ్యాన్స్ గర్వంగా చెబుతున్నారు. భారత్ కోణంలో ఆలోచిస్తే అది కరెక్టే. కానీ ఇలాంటి ఏకపక్ష మ్యాచ్‌లు ఆదాయం పరంగా ఐసీసీకి నష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు జట్లు నువ్వా.. నేనా అనేలా తలపడితేనే కదా మ్యాచ్‌లో మజా. కానీ కొన్నేళ్లుగా ఐసీసీ టోర్నీలలో తలపడుతున్న ప్రతిసారీ టీమిండియా అలవోకగా విజయం సాధిస్తోంది. ఇలాగయితే ప్రకటనలపై లక్షలాది రూపాయలు వెచ్చించేందుకు ఎవరు ముందుకొస్తారని పాకిస్థానీయులు ప్రశ్నిస్తున్నారు. 'పాకిస్థాన్-భారత్ మ్యాచ్‌లు పూర్తిగా ఏకపక్షమవుతున్నాయి. భవిష్యత్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే ఆ మ్యాచ్‌ల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది' అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ చైర్మన్ తాకిర్ జియా హెచ్చరించాడు. అదే జరిగితే ఐసీసీకి రెవెన్యూ గండి పడుతుందని అతడు పరోక్షంగా తెలిపాడు. 'ఏకపక్ష మ్యాచ్‌లను చూసేందుకు ఫ్యాన్స్ ఇష్టపడడంలేదు. ఇలా అయితే స్పాన్సర్లు, ప్రకటనదారులు ఎలా ముందుకొస్తారు' అని ఇక్కడ ఓ అడ్వర్టయిజింగ్ సంస్థను నడుపుతున్న పర్వేజ్ మీర్ కూడా అభిప్రాయపడ్డాడు. ఆదివారంనాటి మ్యాచ్‌లో పాకిస్థాన్ నాలుగు వికెట్లు కోల్పోగానే తన మల్టీప్లెక్స్‌లో మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానుల్లో చాలామంది వెళ్లిపోయారని నదీమ్ వాపోయాడు. భారత్-పాక్ ఏకపక్ష మ్యాచ్‌లపై మాజీలు షోయబ్ అక్తర్, సక్లెయిన్ ముస్తాక్ కూడా అసంతృప్తి ప్రకటించారు. 'మేం ఆడుతున్న రోజులనాటి ఉత్కంఠ ఏదీ? మేం కొన్ని మ్యాచ్‌లు ఓడిపోయి ఉండవచ్చు. అయితే అప్పట్లో మ్యాచ్‌లు పోటాపోటీగా సాగుతాయని ఊహించేవారు' అని షోయబ్ గుర్తు చేశాడు.

రేసులోనే అఫ్ఘాన్

- ఒమర్జాయ్ ఆల్‌రౌండ్‌షో
- యూఏఈపై విజయం

సూపర్-8లో సఫారీలు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘాన్ ఎట్టకేలకు బోణీ చేసింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (4/15; 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 40 నాటౌట్) ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్నాడు. దీంతో సోమవారం యూఏఈతో జరిగిన ఆసక్తికరపోరులో అఫ్ఘాన్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. అటు ఈ ఫలితంతో గ్రూప్ 'డి' నుంచి దక్షిణాఫ్రికా సూపర్-8లో అడుగుపెట్టింది. ఇందులో కివీస్‌కు తప్ప మిగతా మూడు జట్లకు ఆరు పాయింట్లు వచ్చే అవకాశం లేదు. ఆఖరి మ్యాచ్‌లో కెనడా చేతిలో కివీస్ ఓడి.. అదే కెనడాను తాము చిత్తుగా ఓడిస్తే రన్‌రేట్ పరంగా అఫ్ఘాన్‌లు ముందుకెళ్లే చాన్సుంది. ఇక ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 160/9 స్కోరు సాధించింది. సొహైబ్ ఖాన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 68), షరాఫు (40) మాత్రమే రాణించారు. ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అలాగే టీ20 ఫార్మాట్‌లో 700 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రషీద్ నిలిచాడు. ఆ తర్వాత ఛేదనలో అఫ్ఘాన్ 19.2 ఓవర్లలో 162/5 స్కోరుతో గెలిచింది. జద్రాన్ (53), డార్విష్ (33) కీలక ఇన్నింగ్స్ ఆడారు. జునైద్, అర్ఫాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఒమర్జాయ్ నిలిచాడు.

పాయింట్ల పట్టిక

గ్రూప్-బి					
జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే
శ్రీలంక	3	3	0	6	2.462
జింబాబ్వే	2	2	0	4	1.984
ఆస్ట్రేలియా	3	1	2	2	0.414
ఐర్లాండ్	3	1	2	2	0.150
ఒమన్	3	0	3	0	-4.546
గ్రూప్-సి					
వెస్టిండీస్	3	3	0	6	1.820
ఇంగ్లండ్	4	3	1	6	0.201
స్కాట్లాండ్	3	1	2	2	0.359
ఇటలీ	3	1	2	2	-0.588
నేపాల్	3	0	3	0	-1.942
గ్రూప్-డి					
దక్షిణాఫ్రికా	3	3	0	6	1.477
న్యూజిలాండ్	3	2	1	4	0.701
అఫ్ఘానిస్థాన్	3	1	2	2	-0.215
యూఏఈ	3	1	2	2	-0.797
కెనడా	2	0	2	0	-1.526

ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడనవి; పా:పాయింట్లు; ర.రే: రన్‌రేట్



'శాప్' లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ

విజయవాడ-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా శాప్ లీగ్‌ను నిర్వహించనున్నట్టు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఎండీ భరణి తెలిపారు. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, శాప్ ఎండీతో కలిసి సోమవారం ఈ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈనెల 21న తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలతో ప్రారంభమయ్యే లీగ్ డిసెంబరు వరకు సాగుతుందని ఎండీ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని, ఇప్పటికే 20 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని ఆమె వివరించారు.

భారత్-పాక్ మ్యాచ్‌కు 45 కోట్ల వీక్షణలు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో హైలైట్ అనదగ్గ భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు వీక్షకుల నుంచి భారీ ఆదరణ లభించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌కు జియో హాట్‌స్టార్‌లో ఏకంగా 45.4 కోట్ల వీక్షణలు లభించాయి. ఈ మ్యాచ్ సందర్భంగా దేశవ్యాప్తంగా అభిమానులు తమ మొబైల్, స్మార్ట్ టీవీ ఇతర డివైజ్‌లకు అతుక్కుపోయారు. అయితే భారత్‌తో యూఎస్‌ఏ మ్యాచ్‌కు 26 కోట్లు, నమీబియా మ్యాచ్‌కు 24 కోట్ల వీక్షణలు మాత్రమే లభించాయి.

సూపర్-8కు ఇంగ్లండ్

పోరాడి ఓడిన ఇటలీ


విల్ జాక్స్ (53 నాటౌట్)

కోల్‌కతా: ఆడుతోంది తొలి ప్రపంచ కప్ అయినా..మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఇటలీ బెదరగొట్టింది. 203 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఇంగ్లండ్‌కు షాకిచ్చేలా కనిపించింది. కానీ కీలక సమయంలో వికెట్ తీసిన కర్రాన్ ఇంగ్లండ్‌కు ఊరట నిచ్చాడు. దీంతో ఇంగ్లండ్ సూపర్-8కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో మొదట ఇంగ్లండ్ 20 ఓవర్లలో 202/7 స్కోరు చేసింది. విల్ జాక్స్ (22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సలతో 53) ధనాధన్ హాఫ్ సెంచరీ సాధించాడు. బాంటన్ (30), సాల్ట్ (28) సత్తా చాటారు. కలుగమగే, స్టీవార్ట్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇటలీ 20 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. బెన్ మనెంటి (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సలతో 60), స్టీవార్ట్ (23 బంతుల్లో 45) ఇంగ్లండ్ బౌలర్లలో గుబులు పుట్టించారు. మనెంటి ఆడుతున్నంతసేపూ ఇటలీ రేస్‌లోనే నిలిచింది. అతడిని జాక్స్ అవుట్ చేశాక, స్టీవార్ట్ భారీ షాట్లతో ఇంగ్లండ్‌ను బెంబేలెత్తించాడు. కానీ స్టీవార్ట్ వికెట్ తీసిన కర్రాన్ ఇంగ్లండ్‌ను గెలుపు దిశగా మళ్లించాడు.

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 202/7 (విల్ జాక్స్ 53 నాటౌట్, బాంటమ్ 30, సాల్ట్ 28, కర్రాన్ 25, బెతెల్ 23, కలుగమగే 2/41, గ్రాంట్ స్టీవార్ట్ 2/51)

ఇటలీ: 20 ఓవర్లలో 178 ఆలౌట్ (బెన్ మనెంటి 60, గ్రాంట్ స్టీవార్ట్ 45, మోస్కా 43, ఓవర్టన్ 3/18, కర్రాన్ 3/22, ఆర్చర్ 2/35).

మంధానకు బీబీసీ అవార్డు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక బీబీసీ ఇండియన్ స్పోర్ట్స్ వుమెన్-2025 అవార్డుకు స్మృతీ మంధాన ఎంపికైంది. చెస్ ప్లేయర్ దివ్యా దేశ్‌ముఖ్ ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్, ప్రీతి పాల్ పారా స్పోర్ట్స్ వుమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను గెలుచుకున్నారు.

పడిక్కళ్ 'డబుల్'

కర్ణాటక తొలి ఇన్నింగ్స్ 689/6



ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్

లఖ్‌నవూ: కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కళ్ (232) ద్విశతకంతో, రవిచంద్రన్ స్మరణ్ (121 బ్యాటింగ్) సెంచరీతో కదం తొక్కడంతో ఉత్తరాఖండ్‌తో రంజీట్రోఫీ సెమీస్ తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ 355/2 స్కోరుతో సోమవారం ఆట కొనసాగించిన కర్ణాటక.. పడిక్కళ్, స్మరణ్ విజృంభణతో రెండో రోజు ఆఖరికి 689/6 స్కోరు సాధించింది. ఇక..పశ్చిమ బెంగాల్‌లోని కళ్యాణిలో జరుగుతున్న మరో సెమీఫైనల్లో రెండో రోజు ఆట చివరికి జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 198/5 స్కోరు చేసింది. అంతకుముందు 249/5 స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 328 పరుగులకు ఆలౌటైంది.

కుల్దీప్‌పై హార్దిక్ ఆగ్రహం



కొలంబో: స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌పై ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆదివారం పాక్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో షహీన్ క్యాచ్‌ను లాంగాన్‌లో బౌండరీ లైన్ దగ్గర కుల్దీప్ వదిలేయగా అది సిక్సర్‌గా వెళ్లింది. అంతకు ముందు బంతినే కీపర్ ఇషాన్ కూడా అందుకోలేకపోయాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన పాండ్యా ఇద్దరినీ చూస్తూ కోపంగా ఏదో మాట్లాడుతూ కనిపించాడు. ఇక మ్యాచ్ ముగిశాక జట్టు ఆటగాళ్లు కరచాలనం చేసుకున్న సమయంలోనూ కుల్దీప్‌తో హార్దిక్ సీరియస్‌గా మాట్లాడగా, కెప్టెన్ సూర్య సైతం అతడిపై సీరియస్ అయ్యాడు. అయితే కుల్దీప్ మాత్రం జవాబివ్వకుండా ముందుకు సాగాడు.

ఇంకా నగదే రారాజు

- దేశంలో రికార్డు స్థాయికి నగదు చలామణి
- జనవరి నాటికి రూ.40 లక్షల కోట్లు
- యూపీఐ చెల్లింపులదీ అదే హవా

ఎస్‌బీఐ రీసెర్చ్



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపులు ఎంతగా పెరిగినా దేశంలో ఇప్పటికీ నగదుదే హవా. ఎన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నా ప్రజలు ఇప్పటికీ నగదునే ఎక్కువగా నమ్ముకుంటున్నారు. దీంతో చలామణిలో ఉన్న నగదు (సీఐసీ) జనవరి నెలలో రికార్డు స్థాయిలో రూ.40 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11.1 శాతం ఎక్కువని ఎస్‌బీఐ రీసెర్చ్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. 2024 జనవరితో పోలిస్తే 2025 జనవరిలో నమోదైన వృద్ధి రేటు 5.3 శాతం మాత్రమే. ఇంక్రిమెంటల్ ప్రాతిపదికన చూస్తే సీఐసీ రూ.88,517 కోట్ల నుంచి రూ.2.76 లక్షల కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది దాదాపు 3.11 రెట్లు ఎక్కువ.

97.6 శాతం ప్రజల వద్దే: దేశంలో చలామణిలో ఉన్న నగదులో సింహభాగం బ్యాంకుల వద్ద లేదు. నోట్ల కట్టల రూపంలో ప్రజల వద్దే మూలుగుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి చలామణిలో ఉన్న నగదులో 97.6 శాతం (రూ.39 లక్షల కోట్లు) ప్రజల వద్దే ఉన్నట్టు ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11.1 శాతం ఎక్కువ. ఈ వృద్ధి రేటు ఇలానే కొనసాగితే మార్చితో ముగిసే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రజల వద్ద ఉన్న నగదు వృద్ధి రేటు కొవిడ్‌కు ముందు స్థాయిని మించిపోతుందని అంచనా. అప్పట్లో దాదాపు రూ.4.6 లక్షల కోట్ల అదనపు నగదు ప్రజల వద్ద చేరింది.

జీడీపీపరంగా చూస్తే: చలామణిలో ఉన్న నగదు మొత్తం పెరిగిపోతున్నా జీడీపీపరంగా చూస్తే మాత్రం తగ్గుతోంది. 2021 మార్చి నాటికి చలామణిలో ఉన్న నగదు శాతం జీడీపీలో 14.4 శాతం వరకు ఉండేది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇది 11 శాతానికి దిగివస్తుందని తెలిపింది. జీడీపీపరంగా చూస్తే ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసే నగదు శాతమూ తగ్గుతోంది. ఆర్థిక వ్యవస్థలో నగదు వాడకం తగ్గుముఖం పడుతోందనేందుకు ఇది స్పష్టమైన సంకేతమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.

డిజిటల్ చెల్లింపుల జోరు: దేశంలో నగదు చలామణితో పాటు డిజిటల్ చెల్లింపులు శరవేగంగా పెరుగుతున్నాయి. గత నెల (జనవరి) రికార్డు స్థాయిలో రూ.28.3 లక్షల కోట్ల యూపీఐ చెల్లింపులు నమోదయ్యాయని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. అప్పటికి దేశంలో చలామణిలో ఉన్న మొత్తం నగదులో ఇది దాదాపు 70 శాతానికి సమానం. దీంతో దేశంలో డిజిటల్ చెల్లింపులు, చలామణిలో ఉన్న నగదు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నట్టయింది. జీడీపీలో చోటు చేసుకుంటున్న అదనపు వృద్ధి రేటుకు ఇప్పుడు డిజిటల్ చెల్లింపులు ప్రధాన ఇంధనంగా మారాయి. డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలూ ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఈ ప్రోత్సాహకాలను నిలిపివేస్తే డిజిటల్ చెల్లింపుల వృద్ధి రేటుకూ బ్రేక్ పడుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ హెచ్చరించింది.

నగదు చలామణి ఎందుకంటే?

- వివిధ రాష్ట్రాల్లో నెలకు రూ.40 లక్షల కంటే ఎక్కువ విలువైన యూపీఐ లావాదేవీలు జరిపిన చిరు వ్యాపారులకు అందుతున్న జీఎస్‌టీ డిమాండ్ నోటీసులు
- ఈ నోటీసులతో భయపడిన చిరు వ్యాపారులు నగదు చెల్లింపులపై ఒత్తిడి చేయడం
- బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గడంతో నగదు దగ్గర పెట్టుకునేందుకు ప్రజలు ముఖ్యంగా గ్రామీణ మొగ్గు చూపడం
- పన్నుల కోతతో పట్టణ ప్రజల్లో వినియోగ ఖర్చులు పెరగడం
- ఆర్‌బీఐ ఆదేశాలతో బ్యాంకులు ఏటీఎంల్లో రూ.100, రూ.200 నోట్ల నిల్వలు పెంచడం
- వ్యక్తిగత చెల్లింపుల్లో 86 శాతం చెల్లింపుల మొత్తం రూ.500 మించకపోవడం

బిజినెస్

సనోఫీ హైదరాబాద్ జీసీసీ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌హెచ్‌ఐపీఎల్).. హైదరాబాద్‌లోని తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను మరింతగా విస్తరించింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ప్రస్తుతం హైటెక్‌సిటీలో ఉన్న క్యాంపస్‌లో అదనంగా 2.7 లక్షల చదరపు మీటర్ల వర్క్ స్పేస్‌ను చేర్చుకున్నట్లు సనోఫీ వెల్లడించింది. ఈ విస్తరణతో జీసీసీ ఉద్యోగుల సంఖ్య 2,600 నుంచి 4,500 పెరగనుందని తెలిపింది. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ విస్తరణతో ఆర్ అండ్ డీ, ఏఐ, డిజిటల్ ఇన్నోవేషన్‌లో భారత్ స్థానాన్ని హైదరాబాద్ జీసీసీ మరింత పటిష్ఠం చేయనుందని సనోఫీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మెడలైన్ రోచ్ అన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ సర్వీసుల్లో ఈ సెంటర్ కీలకంగా మారనుందని తెలిపారు. 2019లో సనోఫీ హైదరాబాద్‌లో మెడికల్ సర్వీసుల కోసం ఈ జీసీసీని ప్రారంభించింది. అనంతరం 2024లో ఈ జీసీసీని మరింతగా విస్తరించింది.

ఎఫ్‌టీ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ).. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్-2026లో అంతర్జాతీయంగా 12వ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది ఐఎస్‌బీ 27వ స్థానంలో ఉండగా ఈ ఏడాది ఏకంగా 15 స్థానాలు ఎగబాకటం విశేషం. కాగా ఐఎస్‌బీ.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) భారత్‌లో నంబర్ వన్ స్థానంలో ఉండగా ఆసియాలో రెండో స్థానంలో నిలిచింది.

స్థిరాస్తి మార్కెట్ దూకుడు

2030 నాటికి రూ.88 లక్షల కోట్లకు

న్యూఢిల్లీ: అప్పుడప్పుడు కొన్ని ఆటుపోట్లు ఉన్నా దేశంలో స్థిరాస్తి (రియల్టీ) మార్కెట్ స్థిరంగా అభివృద్ధి చెందుతోంది. 2030 నాటికి ఈ మార్కెట్ రూ.88 లక్షల కోట్ల స్థాయికి చేరుతుందని కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ-నరెడ్కో ఒక నివేదికలో తెలిపాయి. గత ఏడాది నమోదైన రూ.26.4 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు ఎక్కువ. 2047 నాటికి ఇది మరింత పెరిగి రూ.440.5 లక్షల కోట్ల నుంచి రూ.616.7 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని కేపీఎంజీ ఇండియా గ్లోబల్ విభాగం హెడ్ నీరజ్ బన్సాల్ చెప్పారు. 'ది రోల్ ఆఫ్ ది రియల్ ఎస్టేట్ ఇన్ వికసిత్ భారత్, 2047' పేరుతో ఈ సంస్థలు ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేశాయి. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో స్థిరాస్తి రంగం వెన్నెముకగా మారనుందని పేర్కొంది.

రుణ పత్రాల ద్వారా రూ.2,000 కోట్లు

నేటి నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం.. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వ్యాపార అభివృద్ధి కోసం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ.2,000 కోట్ల మొత్తాన్ని నాన్ కన్వర్టబుల్ రుణ పత్రాల (ఎన్‌సీడీ) ద్వారా సమీకరించబోతోంది. ఒక్కోటి రూ.1,000 ముఖ విలువ ఉన్న ఈ రుణ పత్రాల జారీ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ జోనల్ హెడ్ శ్రీకాంత్ చెప్పారు. రెండు, మూడు, ఐదేళ్ల కాలపరిమితితో జారీ చేస్తున్న ఈ రుణ పత్రాలపై ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 9 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. మదుపరులు ఈ వడ్డీని నెలనెలా, ఏడాదికి ఒకసారి లేదా రుణ పత్రాల కాల పరిమితి ముగిసిన తర్వాత అసలుతో కలిపి ఒకేసారి తీసుకోవచ్చని శ్రీకాంత్ చెప్పారు. రిటైల్ మదుపరులు కనీసం రూ.10,000 విలువైన పది బాండ్ల కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ ఇష్యూ వచ్చే నెల 4న ముగుస్తుంది.

2035 నాటికి రిటైల్ వ్యాపారం.. రూ.215 లక్షల కోట్లకు

- భవిష్యత్ భేష్
- ఏఐ వినియోగంతో మరింత దన్ను

బీసీజీ, ఆర్ఏఐ నివేదిక



ముంబై: దేశంలో రిటైల్ వ్యాపారం శరవేగంగా విస్తరిస్తోంది. 2025 నాటికి రూ.90 లక్షల కోట్ల నుంచి రూ.95 లక్షల కోట్ల మధ్య ఉన్న ఈ వ్యాపారం 2035 నాటికి రూ.210 లక్షల కోట్ల నుంచి రూ.215 లక్షల కోట్లకు చేరనుంది. భారత రిటైల్ వ్యాపారంపై బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ), రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం పేర్కొంది. ప్రపంచంలో మరే దేశంలోనూ వచ్చే పదేళ్లలో రిటైల్ వ్యాపార వృద్ధి రేటు ఈ స్థాయిలో ఉండదని తెలిపింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) ఎదగాలన్న ప్రభుత్వ సంకల్పం ఇందుకు దోహదం చేయనుందని పేర్కొంది. అయితే రిటైల్ వ్యాపార సంస్థల వృద్ధి క్రమశిక్షణతో కూడిన కార్యాచరణ, దృష్టి పెట్టాల్సిన అంశాలపై స్పష్టతలపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది.

'ఏఐ' ప్రేరక శక్తి: అన్ని రంగాల్లానే రిటైల్ వ్యాపార విస్తరణ కూడా ఏఐ అమలుపై ఆధారపడి ఉంటుందని బీసీజీ-ఆర్ఏఐ నివేదిక పేర్కొంది. వినియోగదారుల నిర్ణయాలను టెక్నాలజీ ముఖ్యంగా ఏఐ త్రీవంగా ప్రభావితం చేస్తున్న విషయాన్ని నివేదిక గుర్తు చేసింది. జెనరేటివ్ ఏఐ ప్రయోగాత్మక దశ నుంచి విస్తృత వాడక దశకు చేరిందని పేర్కొంది. అమెరికా పట్టణ వినియోగదారుల్లో ఇప్పటికే 42 శాతం మంది కొనుగోలు నిర్ణయాలను జెనరేటివ్ ఏఐ ప్రభావితం చేస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. మన దేశ పట్టణ వినియోగదారులు కూడా రోజురోజుకీ ఈ టెక్నాలజీకి అలవాటు పడతారని అంచనా వేసింది. రిటైల్ వ్యాపార రంగంలో సంస్థాగత మార్పులు, వినియోగదారులతో సంబంధాలు, నిర్వహణా విధానాలను మెరుగు పరచడంలో ఏఐ కీలక పాత్ర వహిస్తుందని నివేదిక తెలిపింది. దీంతో వాటి నిర్వహణా సామర్థ్యమూ 40 నుంచి 60 శాతం మెరుగు పడుతుందని అంచనా వేసింది.

జోరందుకున్న మార్కెట్

సెన్సెక్స్ 650 పాయింట్లు అప్
రూ.3.12 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై: విద్యుత్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ సూచీలు మూడు రోజుల నష్టాలకు తెర దించి సోమవారం ఒక శాతం పైగా దూసుకుపోయాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్థిరత్వం, అంతర్జాతీయ క్రూడాయిల్ ధరల నిలకడ ధోరణి కూడా మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. దీంతో సెన్సెక్స్ 650.39 పాయింట్లు లాభపడి 83,277.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 211.65 పాయింట్ల లాభంతో 25,682.75 వద్ద క్లోజయింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులో రూ.3,11,982.13 కోట్లు పెరిగి రూ.4,68,58,625.33 కోట్లకు (5.17 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.95% లాభపడగా స్మాల్‌క్యాప్ సూచీ 0.16% నష్టపోయింది. కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, ఆటో విభాగాల సూచీలు తప్ప రంగాల వారీ సూచీలన్నీ కూడా లాభాల్లోనే ముగిశాయి. పవర్‌గ్రిడ్ షేరు 4.45% లాభంతో మార్కెట్ జోరులో అగ్రగామిగా నిలిచింది.

ఎగుమతుల్లో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం జనవరిలో స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది జనవరితో పోల్చితే ఎగుమతులు 0.61% పెరిగి 3,656 కోట్ల డాలర్లకు (రూ.3.33 లక్షల కోట్లు) చేరాయి. దిగుమతులు 19.2% వృద్ధితో 7,124 కోట్ల డాలర్లుగా (రూ.6.48 లక్షల కోట్లు) నమోదయ్యాయి. వాణిజ్య లోటు 3,468 కోట్ల డాలర్లుగా (రూ.3.16 లక్షల కోట్లు) నిలిచింది. వస్తు, సేవల ఎగుమతులు జనవరిలో వృద్ధి పథంలోనే ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అన్నారు. ఈ ఏడాది ఎగుమతులు 86 వేల కోట్ల డాలర్ల (రూ.78.26 లక్షల కోట్లు) స్థాయిని దాటవచ్చని ఆయన అంచనా వేశారు. కాగా వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో ఎగుమతులు 2.22% పెరిగి 36,663 కోట్ల డాలర్లకు (రూ.33.37 లక్షల కోట్లు) చేరినట్టు ఆయన తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	98
కర్నూలు	115	నెల్లూరు	103
విశాఖపట్నం	115	అనంతపురం	103
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,56,440 ▼	1,43,400 ▼	2,80,000 ▼
విజయవాడ	1,59,000 ▼	1,49,000 ▲	2,55,000 ▲
విశాఖపట్నం	1,58,899 ▲	1,44,600 ▲	2,65,000 ▼
రాజమండ్రి	1,56,640 ▼	1,43,400 ▼	2,41,000 ▼
ప్రొద్దుటూరు	1,57,200 ▼	1,44,620 ▼	2,50,500 ▼
ముంబై	1,54,098 ▲	1,41,154 ▲	2,40,947 ▼

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 17-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

ఉన్నత పదవిలో ఉంటూ అసహ్యకరమైన వ్యాఖ్యలా?

నా వ్యక్తిగత జీవితాన్ని వివాద వస్తువుగా మార్చొద్దు!

తమిళ బీజేపీ అధ్యక్షుడిపై సినీ నటి త్రిష ఆగ్రహం

త్రిషను విడిచి దూరంగా ఉండాలి అంటూ..

టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై నయినార్ నాగేంద్ర విమర్శలు

9







సంజీవని ప్రాజెక్టును మెచ్చుకుంటున్న బిల్ గేట్స్

నైస్.. గుడ్.. గ్రేట్

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలపై బిల్ గేట్స్ ప్రశంసలు

చంద్రబాబుతో కలిసి ఆర్టీజీఎస్ సందర్శన

అమరావతి, సంజీవని, డేటా లేక్ తదితర ప్రాజెక్టులపై వివరించిన సీఎం

డిస్‌ప్లే వాల్ ద్వారా అధికారుల ప్రజెంటేషన్

ఆసక్తిగా పరిశీలించిన గేట్స్

ఆంధ్రప్రదేశ్‌లో టెక్ పాలన 'గ్రేట్'

వాట్సాప్‌తో పౌరసేవలు అభినందనీయం

అమరావతి నిర్మాణం 'గ్రేట్ వర్క్'

సంజీవని ప్రాజెక్టు 'నైస్' అంటూ కితాబు



బిల్ గేట్స్‌కు చంద్రబాబు, పవన్, లోకేశ్ సత్కారం

> టెక్నాలజీ ద్వారా అందిస్తున్న పాలన చాలా బాగుంది. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు సులభతరం చేయడం అభినందనీయం. టెక్ పాలన 'గ్రేట్'. ఆరోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్టు 'నైస్'. ఏఐ ఉపయోగించి వైద్య సేవలు అందిస్తున్న విధానం 'గ్రేట్'. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్, బ్లూ గ్రీన్ కాన్సెప్ట్, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం 'గ్రేట్ వర్క్'. - బిల్ గేట్స్

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, చేపడుతున్న కార్యక్రమాలు.. 'నైస్, గుడ్, గ్రేట్' అంటూ మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ప్రశంసించారు. ప్రత్యేకించి రాజధాని నిర్మాణ పనులు, సంజీవని ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం, డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అద్భుతమని అన్నారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్.. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ డిస్‌ప్లేలపై ప్రదర్శించిన ప్రజెంటేషన్లను ఆసక్తిగా తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా టెక్నాలజీ సాయంతో పౌర సేవలను వేగవంతంగా అందిస్తున్న తీరును గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. డేటా లేక్‌తో

మిగతా 11వ పేజీలో...



ఏఐ అగ్రిసేవలు భేష్

అద్భుతంగా చేస్తున్నారంటూ గేట్స్ ప్రశంస

ఉండవల్లి వద్ద వ్యవసాయ క్షేత్రం సందర్శన

సీఎంతో కలసి స్థానిక రైతులతో ముఖాముఖి

మహిళా రైతులు వండిన వంటలు రుచి

ఏఐ సాంకేతికతతో నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రంలో తెగులు సోకిన ఆకులను స్కాన్ చేసి ఆ వివరాలను బిల్‌గేట్స్‌కు చూపిస్తున్న మహిళా రైతు. పక్కన సీఎం చంద్రబాబు

ఐదేళ్లలో ఐటీ కంపెనీలు గాయబ్

ఐటీ ఉద్యోగాల్లో చాలావరకు అంతమైపోతాయి

మనిషి కన్నా మెరుగ్గా పనిచేసే ఏఐ టూల్స్ వస్తాయి


విద్య, వైద్యం, న్యాయ సహాయం చౌక అవుతాయి

ఆయా రంగాల వృత్తుల్లో సమూల మార్పులు తథ్యం

సేవలు కాదు పరిష్కార మార్గాలు అందించండి 9

సన్ మైక్రోసిస్టమ్స్ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా





ఏఐతో 'ఇబ్బందే'!

నిరుద్యోగ సమస్య తలెత్తుతుంది.. పనిలో 'హ్యూమన్ టచ్' పోతుంది: గేట్స్

11

హలో ఫ్రెండ్.. హౌ ఆర్ యూ?

బాబుకు బిల్ గేట్స్ ఆత్మీయ పలకరింపు

చంద్రబాబు విజనరీ.. ఆయన ఆలోచనలు విభిన్నం, వినూత్నం

తొలి సమావేశంలోనే ఈ విషయం గుర్తించా

బాబు సమకాలీనుల్లో సింగపూర్ ప్రధాని ఒక్కరే ఆయనలా భిన్నమైన, విజన్ ఉన్న నేత.. ముఖ్యమంత్రిపై గేట్స్ ప్రశంసల వర్షం

'గేట్స్' భాగస్వామ్యంతో.. రాష్ట్రానికి దశ-దిశ

ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా కృషి: సీఎం

ఆర్టీజీఎస్‌లో చంద్రబాబుతో బిల్ గేట్స్ భేటీ

పౌరసేవల్లో టెక్నాలజీ, విజన్‌పై వివరణ 11

ప్రభుత్వ కార్యాలయం కడుతున్నాం..

చందాలివ్వండి!

మదనపల్లెలో భారీగా వసూళ్ల పర్వం

25 వేలతో మొదలై 5 లక్షల వరకూ..

రూ.కోటికి పైగా వసూళ్లు! 12

టార్గెట్లు పెట్టి మరీ దండుకున్న వైనం

డబ్బులే కాదు నిర్మాణ సామగ్రి కూడా..

చిన్న వ్యాపారులపై మోయలేని భారం

రాష్ట్ర ప్రభుత్వానికి పలువురి ఫిర్యాదు

498ఏ కేసులో 'లుకవుట్' ఉత్తర్వులా?

పోలీసులు యాంత్రికంగా వ్యవహరిస్తున్నారు: హైకోర్టు 12

బంగాళాఖాతంలో అల్పపీడనం

12

జేఈఈలో తెలుగు సత్తా

ముగ్గురికి 100 పర్సంటైల్

ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒకరు

దేశవ్యాప్తంగా మరో 9 మందికి కూడా..



మోహిత్ (ఏపీ)

జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాలు విడుదల

రాజస్థాన్ నుంచి అత్యధికంగా ముగ్గురు టాపర్లు

99.99తో ఎస్సీల్లో టాపర్‌గా ఆంధ్రప్రదేశ్ విద్యార్థి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదలయ్యాయి. గత నెల 21-28 వరకు దేశవ్యాప్తంగా

మిగతా 10వ పేజీలో...



వివాన్ (తెలంగాణ)



మహిత్ (ఏపీ)

సర్వజన క్షేమానికి పరిష్కారాలు

టెక్ నిపుణులకు ప్రధాని మోదీ పిలుపు

ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో ప్రారంభం

స్టాల్ నిర్వాహకులతో ముఖాముఖి 9

ఫ్రాన్స్, బ్రెజిల్ అధ్యక్షులు వచ్చే అవకాశం



ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించి ఆవిష్కరణలను తిలకిస్తున్న మోదీ

సిక్కోలు ఇసుకలో.. అరుదైన సిరులు!

మన తీర ప్రాంతంలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్

స్మార్ట్ ఫోన్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు..

కంప్యూటర్లు, రాకెట్ ఇంజన్ల తయారీలో ఇవే కీలకం

ప్రపంచ గతిని మార్చే శక్తి తీరంలోని లోహాలకు

చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేలా భారత్ అడుగులు

సిక్కోలు ముఖచిత్రం మార్చేలా సీఎం చంద్రబాబు వ్యూహం

మూలపేట నుంచే 'ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్' ప్రారంభం

శ్రీకాకుళం కేంద్రంగా 'రేర్ ఎర్త్' వాల్యూ చైన్ పరిశ్రమలు



స్మార్ట్ ఫోన్ల నుంచి కంప్యూటర్ల వరకు.. ఎలక్ట్రిక్ వాహనాల నుంచి ఎల్ఈడీ లైట్ల వరకూ.. రక్షణ రంగ పరికరాల నుంచి రాకెట్ ఇంజన్ల వరకూ.. ఏది తయారు చేయాలన్నా భూమి పొరల్లో లభించే అరుదైన లోహాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) చాలా ముఖ్యం. 'సూపర్ లోహాలు'గా భావిస్తున్న ఈ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లేకుంటే స్మార్ట్ ఫోన్ పనిచేయదు.. ఎలక్ట్రిక్ కారు నడవదు. ఆధునిక సాంకేతికతలో ఎంతో కీలకంగా మారిన వీటి ఉత్పత్తి, రిఫైనింగ్‌లో చైనా అగ్రస్థానంలో ఉంది. భారత్‌లో సుమారు 6 శాతం నిల్వలు ఉన్నప్పటికీ.. ఉత్పత్తి మాత్రం చాలా తక్కువ. ఈ విషయంలో చైనా గుత్తాధిపత్యానికి గండికొట్టేలా.. భారత్ అడుగులు వేస్తోంది. ఈ అరుదైన ఖనిజ సంపదను వెలికి తీసేందుకు 'రేర్ ఎర్త్ కారిడార్'ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించగా.. దాన్ని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

(శ్రీకాకుళం - ఆంధ్రజ్యోతి)

మన కళ్ల ముందే సముద్రతీరంలో విస్తరించి ఉన్న ఇసుక తిన్నెలు.. భవిష్యత్తులో ప్రపంచ టెక్నాలజీ రంగాన్ని శాసించబోతున్నాయి. వెనుకబాటుకు కేరాఫ్ అడ్రస్ అయిన శ్రీకాకుళం జిల్లా.. రానున్న రోజుల్లో దేశ రక్షణ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు కీలక కేంద్రంగా మారనుంది. శ్రీకాకుళం సముద్ర తీరంలోని ఇసుకే దీనికి ప్రధాన కారణం..! ఇసుకే కదా.. అని తేలికగా తీసిపారేయాల్సిన పనిలేదు. ఈ ఇసుకలోనే సిరులు కురిపించే అరుదైన ఖనిజ సంపద దాగి ఉంది. అరుదైన భూ లోహాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్)గా

మిగతా 10వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఫ్రెంచ్ రణవిహంగాలు!

మరో నూటపద్నాలుగు రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేయాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం, ప్రస్తుత వాతావరణంలో సముచితమైనది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని కొనుగోళ్ళ మండలి (డీఏసీ) ఈ ప్రతిపాదనకు ఆమోదముద్రవేసిందంటే, పూర్వరంగం పూర్తిగా సిద్ధమైనట్టే. డీఏసీ ఆమోదం తెలిపిన మూడున్నర లక్షలకోట్ల విలువైన మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్ళలో రఫేల్ యుద్ధ విమానాలతో పాటు క్షిపణులు, చిన్నస్థాయి నిఘా విమానాలు, యాంటీ ట్యాంక్ మైన్ల మరమ్మతులు ఇత్యాది ప్రతిపాదనలు ఉన్నాయి. రఫేల్ కోసం ప్రత్యేకించి ఎంత ఖర్చుచేయబోతున్నారు? అన్నది ప్రభుత్వం చెప్పకపోవడంతో మూడులక్షలకోట్లనీ, కాదు, మూడున్నరలక్షలకోట్లనీ మీడియా లెక్కలు కడుతోంది. భారత్–ఫ్రాన్స్ మధ్య బాగా బలపడిన బంధానికి ఈ యుద్ధవిమానాల కొనుగోలు నిర్ణయం నిదర్శనం. 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ నేటి నుంచి జరపబోతున్న రెండురోజుల భారత పర్యటనలో వ్యవహారం ఖరారు కాబోతున్నదని అంటున్నారు.

భారత రక్షణరంగంకోసం ఇంతటి భారీ కొనుగోళ్ళు చేయడం ఇటీవలి కాలంలో జరగలేదు. 18 విమానాలు ఫ్రాన్స్‌లోనే తయారై నేరుగా భారత్ వచ్చివాలుతాయని, మిగతా 96 భారత్‌లోనే తయారవుతాయట. స్వదేశీ తయారీ ఇంతటి భారీగా ఉన్నది కనుక, మీడియా గతాన్ని కూడా ఓ మారు గుర్తుచేస్తోంది. 2016లో మోదీ సర్కారు ముప్పై ఆరు విమానాల కోసం ఒక కొత్త ఒప్పందాన్ని కుదర్చుకోవడం, అందులో తొలివిడతగా ఐదు రఫేల్ విమానాలు ఆరేళ్ళక్రితం అమృత్‌సర్‌లో వాలిన సందర్భంలో దేశరక్షణను మించిన ఘనమైన కర్తవ్యం వేరొకటి లేదని ప్రధాని సంస్కృతంలో ట్వీట్ చేయడం సహా అనేక పరిణామాలను మీడియా నెమరువేసుకుంటోంది. 1990ల్లోనే అత్యుత్తమమైన మీడియం మల్టీరోల్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఎంఆర్‌సీఏ)కోసం ప్రపంచవ్యాప్తంగా సాగిన అన్వేషణ నుంచి 126 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు కోసం కాంట్రాక్టు కుదరడం, మోదీ ప్రభుత్వం దానిని రద్దుచేసి, ముప్పై ఆరు విమానాలను నేరుగా దిగుమతిచేసుకోవడానికి సిద్ధపడటం వరకూ అనేకం గుర్తుకువస్తున్నాయి.

మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కింద కుదరబోయే కొత్త ఒప్పందాన్ని గతానికి కొనసాగింపుగానే అనేకమంది రక్షణరంగనిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పటి ఒప్పందాన్ని మధ్యలో తుంచి, ఇంతకాలానికి మళ్ళీ అటే మళ్ళడం కంటే, దానినే యథాతథంగా కొనసాగించి, చిన్నచిన్న అతుకులతో, చర్యలతో ముందుకు తీసుకుపోయివుంటే ఇప్పటికంటే ఎక్కువ విమానాలే ప్రస్తుతం మనదగ్గర సిద్ధంగా ఉండేవనివారి అభిప్రాయం. 126 విమానాలలో, పద్దెనిమిది ఎగిరివచ్చిన స్థితిలో, మిగతా 108 పూర్తి లైసెన్సుతో దేశీ తయారీ కనుక సాంకేతికతల బదలాయింపు, పరిశ్రమలకూ ఉపాధికీ ఊతం ఈపాటికే దక్కేవని వారి వాదన. ఎన్డీయే ప్రభుత్వం పాత ఒప్పందాన్ని రద్దుచేసి, కొత్తది కుదర్చుకున్నప్పుడు, ఒక్కోదానికీ 526కోట్లకు బదులు 1670కోట్లు చెల్లించారనీ, హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ స్థానంలోకి దివాలాతీసిన అనిల్ అంబానీని తెచ్చారని కాంగ్రెస్ నానాయాగీ చేసిన విషయం తెలిసిందే. అత్యాధునిక అస్త్రశస్త్రాలు పొట్టన నింపుకొని యుద్ధానికి సిద్ధంగా వాలబోతున్న విమానాలనే కొనుగోలు చేశాం కనుక ధర పెరిగిందని బీజేపీ ఆ ఆరోపణలను కొట్టివేసింది. భారీ అవినీతి జరిగిందంటూ 'చౌకీదార్ చోర్‌హై' అన్న నినాదాన్ని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాస్త్రంగానూ వాడింది. రాజీవ్‌గాంధీని రాజకీయంగా బోఫోర్స్ కుంభకోణం దెబ్బతీసినట్టుగా మోదీ తిరగరాసిన ఆ ఒప్పందాన్ని ప్రయోగించి ఆయన ప్రతిష్ఠ దిగజార్చవచ్చునని రాహుల్ అనుకొనివుంటారు. రఫేల్ సామర్థ్యాన్నీ, సమర్థతను ఎవరూ అనుమానించనక్కరలేదు, దాని కొనుగోలునూ ప్రశ్నించనక్కరలేదు. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో అది నిర్వహించిన పాత్ర, దానిని అప్రదిష్ఠపాల్జేసేందుకు పాకిస్థాన్, చైనాలు చేసిన కుట్రలు తెలిసినవే. పొరుగుదేశాలన్నీ పక్కలో బల్లెంలాగా తయారైన ఈ కీలకతరుణంలో ఇప్పటికే మన అమ్ముల పొదిలో చేరిన రఫేల్ విమానాలకు తోడుగా మరిన్ని సిద్ధంకాబోతున్నాయన్న వార్త కచ్చితంగా ధైర్యాన్ని ఇస్తుంది.

సర్దుకుపోవటమే మనకు శాపమా!?





■ రాహుల్ కుమార్

కష్టకాలం అందరికీ ఉంటుంది. ఇష్టకాలమే ఉండాలని అందరమూ కోరుకుంటాం. నిజజీవితంలో అది సాధ్యంకాదు. ఇష్టకాలంలో కంటే కష్టకాలంలోనే వ్యక్తికైనా దేశానికైనా భవిష్యత్తును కొత్తదారుల్లో నడిపే అవకాశాలు వస్తాయి. వాటిని అందిపుచ్చుకోవటంతోనే నాయకత్వ పటిమ వెల్లడవుతుంది. సమాజంలోని పైవర్గాల నిజ స్వభావమూ అర్థమవుతుంది.

మనం మోయలేని రీతిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు ఇటీవల ఎన్నడూ చూడని కష్టకాలాన్ని సృష్టించాయి. ఎక్కువ సంఖ్యలో శ్రామికులకు ఉపాధినిచ్చే అనేక రంగాలు అధిక సుంకాలతో సతమతమైపోయాయి. సుంకాల వ్యవహారాల్లో ఏర్పడిన విపత్కర పరిస్థితి ఎటు దారితీస్తోందోనన్న ఆందోళన అధికమైపోయింది. ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు, డిజిటల్ టెక్నాలజీలు, ఫార్మా, ఐటీరంగాలు, సైనికసహకారాలు, ఎగుమతులు మాత్రమేగాక ఇంకా అనేక విషయాల్లో అమెరికాపై ఆధారపడటం మూడున్నర దశాబ్దాల్లో మనకు విపరీతంగా పెరిగిపోయింది. మన దేశం అమెరికాకు డిజిటల్ కాలనీగా మారిపోతోందన్న వ్యాఖ్యలు ఈ మధ్య ఎక్కువవుతున్నాయి. ట్రంప్ యంత్రాంగం సృష్టించిన అనిశ్చితి, భారత్‌ను ఉద్దేశించి పలికిన చిన్నబుచ్చే మాటలు మనం అనుసరిస్తున్న విధానాలపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తాయి. ఈలోగా భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం తెరమీదకు వచ్చింది. పాత ప్రశ్నలు చల్లారకముందే కొత్త ప్రశ్నలు తలెత్తాయి. వీటికి జవాబులివ్వలేక ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎవరి దగ్గర నుంచి ఏది కొనాలి? దిగుమతులపై పన్నులెంత ఉండాలి? ఏ వస్తువులను దేశంలోకి అనుమతించాలి? అన్నవి ఒక దేశానికుండే స్వయంనిర్ణయాత్మక అధికారాలుగా, సార్వభౌమిక హక్కులుగా భావిస్తాం. వీటికి భంగం కలిగించే రీతిలో అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం ఉండబోతోందన్న విమర్శలను ఒకపట్టాన కొట్టేయలేని పరిస్థితే కనపడుతోంది. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్ అంగీకరించిన షరతులు ఇవేనంటూ ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్'లో ప్రకటించిన తర్వాత ఉపశమనంలేని ఉక్కపోత వాతావరణం నెలకొంది.

ఒప్పందంలోని ఇబ్బందికర షరతుల నుంచే ఈ ఉక్కపోత వస్తోందని స్పష్టమవుతున్నా అది తాత్కాలికమేననీ, త్వరలో అంతా సర్దుకుపోతుందనీ, జరిగిందంతా మంచేననీ సమాధానపడటానికే ఎక్కువ ఆస్కారం ఉంది. దీనికి మూలం పాలకపార్టీ ఎప్పటి నుంచో నమ్మే భావాల్లో కూడా ఉంది. అన్ని కీలక నిర్ణయాలనూ ప్రభావితం చేస్తోన్న 10శాతం పైస్థాయి తరగతి ప్రజల మనస్తత్వం కూడా దానికి కారణమవుతోంది.

> **అమెరికా ఒత్తిళ్లను ఎదుర్కొనే స్థితిలో భారత్ లేదా? అంటే పూర్తిగా లేదని చెప్పలేం. కానీ మన విధానాలన్నీ పైవర్గంలోని 10శాతం జనాన్ని దృష్టిలో పెట్టుకునే రూపొందుతున్నాయి. విపత్కర పరిస్థితుల్లో సైతం మిగతా ప్రజలను కూడగట్టి ఎదుర్కొనే స్థితిలో పైవర్గం లేదు.**

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అమెరికా అనుకూలతను ప్రదర్శించే రాజకీయపార్టీలు చాలా తక్కువగా ఉండేవి. వాటిల్లో ప్రధానమైంది జనసంఘ్ పార్టీ. ఈనాటి బీజేపీకి మాతృసంస్థ అయిన జనసంఘ్ అమెరికా అనుకూలతనే ఎక్కువగా ప్రదర్శించేది. ఆ దేశం అనుసరించే స్వేచ్ఛావాణిజ్య విధానాల్లాంటివే దేశంలో అమలుచేయాలని డిమాండు చేసేది. సామ్యవాద ఆదర్శాలనూ, విధానాలనూ విదేశీ సిద్ధాంతాలుగానూ, వాటితో దేశ సాంస్కృతిక జీవితానికి ప్రమాదం వస్తుందనీ ప్రకటించేది. రాజకీయ అవసరాల కోసం అమెరికా అనుకూలతను కొన్ని సందర్భాల్లో కొంత తగ్గించుకోటానికీ ప్రయత్నాలను చేసింది. సోషలిజానికీ, క్యాపిటలిజానికీ మధ్యేమార్గంగా ఉండే విధానాలనూ జనసంఘ్ నేతలు ప్రకటించారు. అవన్నీ పెద్ద ప్రభావాన్ని చూపలేదు. మందిర్–మండల్ రాజకీయాలతో వాటి ప్రభావాలు పూర్తిగా తగ్గిపోయాయి. సరిగ్గా అప్పుడే దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు మొదలయ్యాయి. జనసంఘ్, బీజేపీలు ఎప్పటి నుంచో కోరుకున్న విధానాలను పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది.

1990ల నుంచి అన్నివిధాలుగా అమెరికా వైపే మొగ్గినా ఇబ్బందులు తొలగిపోలేదు. భారత్ అవసరాలకు ప్రాధాన్యం ఎప్పుడూ సరిగ్గా దక్కలేదు. ఇరాన్ నుంచి సహజవాయువును చౌకగా పొందటానికి ఎన్నో ఏళ్లపాటు చేసిన ప్రయత్నాలకు అమెరికా గండికొట్టింది. 3000 కిలోమీటర్ల పొడవునా పైపులు వేసి సహజవాయువు తీసుకురావటానికి ఇరాన్–పాకిస్థాన్–భారత్‌ల మధ్య చర్చలు కొలిక్కి వచ్చే సమయానికి అట్లా జరగటానికి వీల్లేదని ఆదేశిస్తే దాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అనుకున్నట్లుగా ఆ సహజవాయువు వచ్చి ఉంటే మన అవసరాలు చాలా తీరేవి. చాలాచోట్ల ఇంటింటికీ వంటగ్యాస్ సరఫరా అయ్యేది. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ కొరత లేకుండా దొరికేది. ఎన్నో పరిశ్రమలకు ఇంధన అవసరాలు తీరేవి. రైతులకు ఎరువుల లభ్యతా పెరిగేది. ఆ తర్వాత చమురు దిగుమతులనూ ఆపేయాల్సి వచ్చింది. ఒకప్పుడు మన చమురు అవసరాల్లో 17శాతం వరకూ ఇరానే తీర్చేది.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భవిష్యత్తులో ఏ రూపంలో కొనుగోలుచేసినా అపరాధసుంకం వెంటనే అమల్లోకి వస్తుందనీ ట్రంప్ స్పష్టంచేశారు. ఈ షరతుకు అంగీకరించారా? లేదా? అన్న విషయానికి ఇప్పటికీ ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేదు. దీంతో ఒత్తిడులకు లొంగిపోయిందనే విమర్శలకు బలం చేకూరింది. ఇక అమెరికా నుంచి వచ్చే అనేక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలను భారత్ గణనీయంగా తగ్గించనున్నదని కూడా ట్రంప్ ముందుగా ప్రకటించేశారు. ఆ తర్వాత విడుదలైన సంయుక్త ప్రకటన, ఒప్పందానికి సంబంధించి రూపొందిన ప్రాతిపదిక పత్రంలో కూడా ట్రంప్ చెప్పినవే ఉన్నాయి. వచ్చే అయిదేళ్లలో 500 బిలియన్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని హామీ ఇవ్వటం కూడా వివాదాలకు కారణమైంది. అది హామీ కాదు ఆకాంక్ష అని తర్వాత మాటమార్చినా అనుమానాలు తొలగలేదు. వాటన్నిటికంటే ప్రమాదకరంగా పలువురు నిపుణులు భావిస్తున్నది మరొకటి ఉంది. రెండు దేశాల భద్రతకు ఇబ్బంది కలగకుండా ఆర్థిక వ్యవహారాలను నిర్వహించుకోవాలన్నది ఒప్పందంలో కీలకంగా ఉండబోతోంది. అంటే ఒకదేశ భద్రతకు ఇబ్బందిగా ఉండే ఆర్థిక వ్యవహారాలను ఇంకో దేశం చేపట్టకూడదు. అమెరికా భద్రతకు చైనా చిప్‌లను ఉపయోగించటం వల్ల ఇబ్బంది ఉందని భావిస్తే భారత్ కూడా వాటికి దూరంగా ఉండాలి. ఇదేదో చిప్‌లకు, కృత్రిమమేధ లాంటి ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానాలకో పరిమితం అవ్వాల్సిన పనిలేదు. అవసరాన్ని బట్టి ఏ దేశ ఉత్పత్తికైనా వర్తింపచేసే ప్రమాదం ఉందనే నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా తన భద్రతకు ఫలానా దేశం ప్రమాదకరంగా ఉందని భావిస్తే ఆ దేశంతో లావాదేవీలను కట్టడిచేసుకోవాల్సి వస్తుంది. అవెంత లాభకరంగా ఉన్నా వాటి జోలికి వెళ్లకూడదు.

అమెరికా నుంచి పెద్దఎత్తున ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉంటే ఇప్పటికే ఆ దిశగా వాణిజ్యం జరిగేది. మన అవసరాలకు సరిపడే ఉత్పత్తులను మనం పెట్టగలిగిన ఖర్చుకు ఎగుమతి చేసే స్థితిలో అమెరికా లేదు. ముఖ్యంగా పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో ఇది నిజం. చైనా ఆ స్థాయిలో ఉంది కాబట్టే అక్కడ నుంచి ఎన్నో ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం. అమెరికాతో పోల్చితే చైనాతో సత్సంబంధాలు తక్కువ. అయినా ఆర్థిక కోణం నుంచే మనం అక్కడ నుంచి దిగుమతులు ఎక్కువ చేసుకుంటున్నాం. ఇప్పుడు అమెరికాతో కుదిరే వాణిజ్య ఒప్పందంలో ఆ కోణంకంటే ట్రంప్ కోరికలను నెరవేర్చటమే ప్రధానంగా మారే ప్రమాదం కనపడుతోంది. బెదిరింపులతో దిగుమతి సుంకాలను పెంచేస్తే అమెరికా అప్పుల బాధ తీరుతుందనీ, అదే ఊపుతో అమెరికా ఎగుమతులు ఎక్కువయ్యేలా ఒత్తిళ్లు తెస్తే దేశంలో కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందనీ ట్రంప్ భావిస్తున్నారు. ఈ రెండు లక్ష్యాల భారాన్ని అన్ని దేశాలూ మోయాల్సింది అన్నట్లుగానే ఆయన వ్యవహారం ఉంది.

అమెరికా ఒత్తిళ్లను ఎదుర్కొనే స్థితిలో భారత్ లేదా? అంటే పూర్తిగా లేదని చెప్పలేం. కానీ మన విధానాలన్నీ పైవర్గంలోని 10శాతం జనాన్ని దృష్టిలో పెట్టుకునే రూపొందుతున్నాయి. విపత్కర పరిస్థితుల్లో సైతం మిగతా అధికశాతం ప్రజలను కూడగట్టి ఎదుర్కొనే స్థితిలో పైవర్గం లేదు. రెండు వర్గాల మధ్యా ఆర్థిక అంతరాలు పెరిగిపోతుండటంతో ఆ దిశగా ఆలోచనలు కూడా చేయటం లేదు. ఓట్ల కోసం ఉద్వేగ అంశాలను ప్రేరేపించటానికి రాజకీయ పార్టీలు చేసే ప్రయత్నాలకు పైవర్గం కూడా దోహదం చేస్తోంది. అమెరికా లాంటి దేశాలు పెట్టే షరతులకు సర్దుకుపోవటమే పరిష్కారంగా భావిస్తోంది. పైవర్గానికి పట్టుదల, దృఢసంకల్పం ఉండి జాతీయ ప్రయోజనాలు పరమ ప్రధానమైనవిగా భావించి అడుగులు వేస్తే చరిత్రగతి మారిపోయే అవకాశం ఉండొచ్చు. జపాన్‌లోని పైవర్గం ఒకనాడు ఆ పటిమను ప్రదర్శించి యూరప్, అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి సత్తాను నిరూపించుకుంది. 17వ శతాబ్దం ఆరంభం నుంచి ఈస్టిండియా కంపెనీల్లాంటివి ఆసియాదేశాలపై ఆధిపత్యం సాధించటానికి అడుగులు వేస్తున్న వేళ రాబోయే ప్రమాదాన్ని ముందే పసిగట్టినట్లుగా జపాన్‌లోని పైస్థాయి వర్గం 200 ఏళ్లపాటు ప్రపంచ పరిణామాలకు పనికట్టుకున్నట్లు దూరంగా ఉండిపోయింది. డచ్ వ్యాపారులను మినహా మిగతా వాళ్లని దేశంలోకి అనుమతించలేదు. వాళ్లను కూడా నాగసాకీ పోర్టుకే పరిమితం చేసింది. మతం, రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా వాళ్లని కట్టడిచేసింది. అందుకు వాళ్లూ అంగీకరించి వ్యాపారానికే పరిమితమయ్యారు. డచ్ వ్యాపారుల వల్ల పరిచయమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుకరించి, సొంతంగా ఆధునిక పరికరాలను తయారు చేయటం నేర్చుకోవటం మొదలుపెట్టారు. నేర్చుకున్నదల్లా సొంతభాషలో రాసుకుని విపరీతంగా కొత్త పరిజ్ఞానాలను వ్యాప్తిచేశారు. 1853 వరకూ అది కొనసాగింది. ఇంతలో అమెరికా నౌకాదళం నాయకుడు మాథ్యూ పెర్రీ వచ్చి నౌకాశ్రయాలన్నీ విదేశీ వ్యాపారాలకు తెరవాల్సిందేనని హుకుం జారీచేశారు. పాశ్చాత్య బలగాన్ని తమకున్న బలంతో ఎదిరించలేమన్న నిజం జపాన్ పైవర్గం గ్రహించింది. తీవ్ర అంతర్మథనం మొదలైంది. పెనుమార్పులకు రంగం సిద్ధమైంది.

> **అన్నిటినీ సొంతంగా తయారుచేసుకునే క్రమాన్ని మొదలుపెట్టిన జపాన్ 1914 నాటికి అగ్రదేశాల సరసన నిలిచింది. నిర్బంధ విద్యావిధానాన్ని అమలు జరిపి, అసంఖ్యాకంగా నిపుణ కార్మికులను తయారుచేసుకుని శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంలో యూరప్ దేశాలకు దీటుగా ఎదిగింది. పాశ్చాత్య ఆధిపత్యానికి ఏ రూపంలోనూ లొంగకుండా ఉండాలనే దృఢ చిత్తంతో జపాన్ పైవర్గం వ్యవహరించింది. తెగువకు, నిర్భీతికి, సవాళ్లను స్వీకరించే స్థితికి నిదర్శనంగా నిలిచింది. భారత్‌కు ఇప్పుడు అంతకుమించి వ్యవహరించే అవకాశమూ, స్థాయీ రెండూ ఉన్నాయి. అయినా మన పైవర్గం అంతటి తెగువను చూపుతుందా అన్నది ఇప్పటికైతే ప్రశ్నార్థకమే!**

ముత్సుహితో చక్రవర్తికి పూర్తి అధికారాలు దఖలుపరిచే మెయిజీ యుగం 1868లో మొదలైంది. ఆ కేంద్రీకృత పాలనతో అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు ఉరకలు వేశాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో పరిశ్రమలు నెలకొన్నాయి. అన్నిటినీ సొంతంగా తయారుచేసుకునే క్రమాన్ని మొదలుపెట్టారు. 1914 నాటికి అగ్రదేశాల సరసన జపాన్ నిలిచింది. నిర్బంధ విద్యావిధానాన్ని అమలు జరిపి, అసంఖ్యాకంగా నిపుణ కార్మికులను తయారుచేసుకుని శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంలో యూరప్ దేశాలకు దీటుగా ఎదిగింది. పాశ్చాత్య ఆధిపత్యానికి ఏరూపంలోనూ లొంగకుండా ఉండాలనే దృఢ చిత్తంతో జపాన్ పైవర్గం వ్యవహరించింది. తెగువకు, నిర్భీతికి, సవాళ్లను స్వీకరించే స్థితికి నిదర్శనంగా నిలిచింది. భారత్‌కు ఇప్పుడు అంతకుమించి వ్యవహరించే అవకాశమూ, స్థాయీ రెండూ ఉన్నాయి. అయినా మన పైవర్గం అంతటి తెగువను చూపుతుందా అన్నది ఇప్పటికైతే ప్రశ్నార్థకమే! సంజయబారు లాంటి వ్యాఖ్యాతలు అదిప్పుడు కనపడటం లేదనే ఎత్తిచూపుతున్నారు. సర్దుకుపోవటం కొన్ని సందర్భాల్లో అవసరమైనా ఏ నిర్ణయమూ స్వీయశక్తిని తగ్గించే శాపంగా మారకూడదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఆరెంజ్ ఎకానమీ.. ఏ రేంజ్?

గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి చెమటలు పట్టించింది సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లే. ముఖ్యంగా Is India Becoming a Dictatorship? అంటూ అద్భుతమైన, ఆధారసహితమైన రీసెర్చ్ కంటెంట్‌తో సెన్సేషన్ క్రియేట్ చేసిన ధ్రువ్ రాఠీ, గోదీ మీడియా అంటూ మోదీని టార్గెట్ చేసిన రవీష్ కుమార్, 'The Deshbhakt' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరిన ఆకాష్ బెనర్జీ, యూపీ మే కా బా? (యూపీలో ఏముందని) దేశమంతా నిరుద్యోగం, పేదరికమేనంటూ గళమెత్తిన నేహాసింగ్ రాథోడ్... ఇలా పదుల సంఖ్యలో యువ ఇన్‌ఫ్లూయెన్సర్లంతా బీజేపీకి కంటిమీద కునుకు లేకుండా చేశారు. ఒంటరిగా, బిగ్గెస్ట్ పార్టీగా ఉన్న తిరుగులేని బీజేపీని ప్రాంతీయ పార్టీల చలువతో అధికారం నిలబెట్టుకునే స్థాయికి తెచ్చిన ఘనత ఈ యువ ఇన్‌ఫ్లూయెన్సర్లదే అంటే నమ్మితీరాల్సిందే. ఈ వాస్తవాన్ని, ముప్పును ముందే పసిగట్టింది కాబట్టే.. వారిని నిలువరించేందుకు బీజేపీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆరెంజ్ ఎకానమీకి తెరలేపిందన్నది కాదనలేని నిజం. ఎక్కడిదీ ఆరెంజ్ ఎకానమీ?



బ్రిటన్ దేశానికి చెందిన ప్రఖ్యాత వ్యూహకర్త, రచయిత జాన్ హోకిన్స్ తన "The Creative Economy: How People Make Money from Ideas" పుస్తకం ద్వారా సృజనాత్మకతకు, ఆర్థిక వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని తొలిసారిగా ప్రపంచానికి చాటిచెబుతూ ఆరెంజ్ ఎకానమీ అనే పదాన్ని వినియోగించారు. అయితే, ఆరెంజ్ ఎకానమీకి ఒక స్పష్టమైన రూపునిచ్చింది మాత్రం ఇంటర్–అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులు ఫెలిప్ బ్యూట్రాగో, ఇవాన్ డ్యూక్ వాస్తవానికి మన దేశానికి ఆరెంజ్ ఎకానమీ అనే పదం కొత్త కానీ, అనేక దేశాలు ఆరెంజ్ ఎకానమీకి ప్రోత్సాహకాలు అందించి అద్భుతాలు చేసి చూపించాయి.

ఆరెంజ్ ఎకానమీని అధికారికంగా తన జాతీయ విధానంలో 'ఆరెంజ్ లా'గా చేర్చుకున్న మొదటి దేశం కొలంబియా. అదే బాటలో దక్షిణ కొరియా ఆరెంజ్ ఎకానమీతో అద్భుతాలు సృష్టించి చరిత్రలో నిలిచిపోయింది. నేడు ప్రపంచాన్ని ఉర్రుతలూగిస్తున్న కె–పాప్ మ్యూజిక్, కె–డ్రామాల (సినిమాలు) వెనుక ఉన్నది ఈ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థే. ఆ తర్వాత బ్రిటన్, నైజీరియాలు తమ దేశాల్లో ఆరెంజ్ ఎకానమీని విపరీతంగా ప్రోత్సహించారు. యునెస్కో నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఆరెంజ్ ఎకానమీ ఏటా సుమారు 2.25 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని సృష్టిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ఆలోచనలే అసలైన సంపదగా మారే రోజులు వస్తాయని రెండు దశాబ్దాల క్రితం జాన్ హోకిన్స్ ఊహించారు. సంపద అంటే భూమి, బంగారం లేదా యంత్రాలు అనుకునే ప్రపంచానికి 'ఆలోచనలే అసలైన సంపద' అని ప్రకటించిన వ్యక్తి జాన్ హోకిన్స్.

ఇటీవల నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని ఆరెంజ్ ఎకానమీ సరిగ్గా జాన్ హోకిన్స్ ఆలోచనలను అవగతం చేసుకొని రూపొందించిందే. ఆయన తన పుస్తకంలో ప్రస్తావించిన 'వ్యక్తిగత సృజనాత్మకత' ఆధారంగానే బడ్జెట్‌లో ఇండివిడ్యువల్ టాలెంట్‌ను గుర్తించేందుకు ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ టెక్నాలజీస్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా 15 వేల పాఠశాలలు, 500 కళాశాలల్లో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటుకు పునాదులు పడ్డాయన్నది నిర్వివాదాంశం. అంతేకాదు, ఆలోచనలను వ్యాపారాలుగా మార్చడం కోసం ఏర్పాటు చేసిన ఆరెంజ్ ఎకానమీ ఫండ్ రూ.2,500 కోట్ల నిధి కూడా హోకిన్స్ చెప్పిన 'How people make money from ideas'కు ఆచరణాత్మక రూపమే. సృజనాత్మకత కొత్తది కాదు, ఆర్థికశాస్త్రమూ కొత్తది కాదు.. కానీ వాటి మధ్య ఏర్పడిన ఈ కొత్త బంధమే భవిష్యత్తును శాసిస్తుందని మన పాలకులు అర్థం చేసుకోవడానికి రెండు దశాబ్దాలు పట్టడమే విడ్డూరం.

భారతదేశంలో సినిమా, సంగీతం, కళాకారులు, ఇప్పుడు సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ల సంఖ్య చాలా ఎక్కువ. ఇప్పటివరకు వీటిని కేవలం వినోదంగానే చూశారు. కానీ 2026–27 బడ్జెట్ ద్వారా దీన్ని ఒక వ్యవస్థీకృత ఆర్థిక రంగంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. దీనివల్ల గ్రామీణ కళాకారులకు కూడా అంతర్జాతీయ మార్కెట్ దొరికే అవకాశం ఉంది. ఆరెంజ్ ఎకానమీ వంటి అద్భుతమైన చొరవ తీసుకున్నప్పటికీ అవి అందరికా? లేక బీజేపీని స్తుతించే కంటెంట్ క్రియేటర్లకే ఈ బడ్జెట్ కేటాయిస్తారా అనే సందేహం యువతలో ఉంది. అందుకే చాలామంది ఇది ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్ క్రియేటర్లను కార్నర్ చేసే కార్యక్రమంగా విమర్శిస్తున్నారు. అయితే అది వాస్తవం కాదని, కంటెంట్ ఉన్న ప్రతీ కటౌట్‌కి ఆరెంజ్ ఎకానమీ అండగా నిలబడుతుందనే భరోసా కల్పించాల్సింది ప్రభుత్వమే. ఈ దేశ యువత భవితకు ఆరెంజ్ ఎకానమీ హారతి పట్టాలని ఆశిద్దాం. ఆరెంజ్ ఏ రేంజ్ కార్యక్రమం అన్నది భవిష్యత్తే చెప్పాలి. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇటువైపుగా ఆలోచించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

● శ్రీపాద రమణ

అమరావతే అక్షయ పాత్ర

ఎప్పటికీ తరగని ఆహారాన్నిచ్చే దైవికమైన పాత్రను అక్షయ పాత్ర అంటారు. పాండవులు వనవాసంలో ఉన్నప్పుడు ఎంత మంది ఆకలినైనా తీర్చేందుకు ధర్మరాజు వరంగా అడిగితే, సూర్యభగవానుడు అక్షయ పాత్రను ప్రసాదించాడట. పురాణ కథను కాసేపు పక్కన పెడితే, ఆధునిక ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌కు సరిగ్గా అలాంటి అక్షయ పాత్ర అమరావతే!

అవకాశాలను అందిపుచ్చుకోవటం, ప్రతికూల పరిస్థితులను కూడా అనుకూలంగా మలచుకోవటంలో ముఖ్యమంత్రి చంద్రబాబుది అందెవేసిన చెయ్యి. నిజానికి రాజధాని అంటే అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు, ఐఏఎస్, ఐపీఎస్ పరిపాలనా కార్యాలయాలు. ఏ ముఖ్యమంత్రయినా ఇంతకు మించి ఆలోచన చేయరు. విభజన చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ప్రధాన పాలనా అంగాలకే ఆర్థిక సహాయం అందిస్తుంది. కానీ చంద్రబాబు రాజధానిని పరిపాలనా కేంద్రంగా మాత్రమే చూడలేదు, దానిని ఆధునిక నగరంగా భావించారు. రాష్ట్రానికి ఆర్థిక వనరుగా, రాష్ట్ర భవిష్యత్తుకు చూడచక్కని మహానగరంగా ఉండాలన్నది చంద్రబాబు సంకల్పం. అందుకు అనుగుణంగానే రాష్ట్ర నడిబొడ్డున రాజధాని నిర్ణయం చేశారు. రైతుల నుంచి 34,348 ఎకరాలను భూ సమీకరణ పద్ధతిలో సేకరించారు.

రాజధానికి రైల్వే, విమాన, ప్రధాన రహదారి కనెక్టివిటీ సౌకర్యాలతో పాటు వందేళ్ళు గడిచినా తాగునీటికి కటకట లేకుండా కృష్ణా తీరాన్ని ఎంపిక చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో మానవ జీవన నాగరికత, అభివృద్ధిని ఇతివృత్తంగా భావించారు. రాజధాని లేని ఆంధ్రప్రదేశ్‌కు ఆ ఆవశ్యకతను గుర్తించి రైతులు పూర్తిగా సహకరించి, భూముల్ని ప్రభుత్వానికి ఇచ్చేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అడ్డుపుల్లలు వేసినా, ముఖ్యమంత్రి అంటే ఇష్టం లేని 'మేధావులు' అమరావతిపై విషం చిమ్మినా పట్టువదలని విక్రమార్కుడిలా ముందుకు నడిచారు. అన్ని అడ్డంకులను అధిగమించి 2017–19లోనే పరిపాలనకు సంబంధించిన ప్రధాన అంగాలను పూర్తిచేసి పాలన చేపట్టారు. రాష్ట్రానికి కొత్త రాజధానిగా అమరావతిని భారతావనిపై నిలబెట్టారు.

> **కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి పునరుజ్జీవన సంకల్పం మొదలైంది. పనులు వేగంగా జరగడానికి శ్రీకారం చుట్టారు. అధికారుల నివాస టవర్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు. అనేక సంస్థలు అమరావతికి తరలివస్తున్నాయి. అన్ని అభివృద్ధి ఫలాలు వచ్చాక అమరావతిని అక్షయ పాత్ర అనటంలో సందేహం ఏముంటుంది?**



2019లో రాజధాని యజ్ఞానికి ఊహించని రీతిలో విఘాతం ఏర్పడింది. అమరావతిని అన్నం గిన్నెగా భావించేందుకు ఇష్టం లేని ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చారు. అమరావతి అభివృద్ధి చెందితే చంద్రబాబు సంకల్పం నెరవేరినట్టే అని దిగులుపడ్డారాయన. అమరావతిని అంతం చేసేందుకు 'మూడు రాజధానులు' అనే వితండవాదాన్ని తెరపైకి తెచ్చారు. మూడు ప్రాంతాల ప్రజల్ని ఊహాలోకాల్లో తిప్పారు. అందుకోసం అక్షయ పాత్రకు కొత్త పేర్లు పెట్టి దుమ్ము, ధూళి నింపి దాని ఔన్నత్యాన్ని మట్టితో కప్పెట్టేలా యుద్ధం చేశారు. వెరసి భూములు దానం చేసిన రైతులు కష్టాలు పడ్డారు. చెరసాలల్లో పడ్డారు. 1631 రోజుల చారిత్రకమైన ఉద్యమ బాట పట్టారు. సువర్ణ లిఖిత చరిత్రను రాశారు. ఫలితంగా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అమరావతికి రక్షణగా నిలబడ్డారు. రాజధానిపై కత్తి కట్టిన వాళ్ళను అధికారం నుంచి గద్దె దింపారు.

2024 నుంచి అమరావతి పునరుజ్జీవన సంకల్పం మొదలైంది. పనులు వేగంగా జరగడానికి శ్రీకారం చుట్టారు. చీకటి పాలనకు నకళ్ళుగా ఉన్న అడవిని తొలుత నరికి శుభ్రం చేశారు. ఎన్జీవో, గెజిటెడ్ అధికారుల నివాస టవర్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు. నాలుగువేల మంది ప్రభుత్వ ఉద్యోగుల గృహాలకు రూపకల్పన చేశారు. కొండవీటి వాగు, పాలవాగు వరద నియంత్రణ పనులు చేపట్టారు. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండ ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతోంది. రూ.250 కోట్లతో రాజధాని పరిపాలనా కేంద్రం సీఆర్డీఏ భవనం అందుబాటులోకి తెచ్చారు. రూ.2,245 కోట్ల కేంద్రం నిధులతో 57 కిలోమీటర్ల రైల్వేలైన్ అమరావతికి అనుసంధానం జరుగుతోంది. రూ.250 కోట్లతో అతిపెద్ద ఎక్స్ఎల్ఆర్ఐ ఏర్పాటు, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, జాతీయ విద్యాలయాలు, అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం, టూరిజం, 4 స్టార్ హోటళ్ళ పనులు చకచకా జరుగుతున్నాయి. రూ.212 కోట్లతో రాజ్‌భవన్, రూ.16 వేల కోట్లతో 70 మీటర్ల నుంచి 140 మీటర్ల వరకు ఔటర్ రింగ్ రోడ్డు, సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ వేగం పుంజుకుంది. రూ.150 కోట్లతో ప్రపంచ స్థాయి గ్రంథాలయం ఏర్పాటవుతున్నది. రూ.369 కోట్లతో ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, రూ.99.62 కోట్లతో క్వాంటమ్ సెంటర్, రూ.260 కోట్లతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులతో పాటు 15 జాతీయ బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాలకు ఏకకాలంలో శంకుస్థాపనలు జరిగాయి. దీని ద్వారా రూ.1320 కోట్ల పెట్టుబడులు, 6541 మందికి ఉద్యోగాల భర్తీ. రూ.80 కోట్లతో తపాలా శాఖ ప్రాంతీయ కార్యాలయం, కాగ్ కార్యాలయం, నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ, నేచురోపతి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు వంటి ప్రణాళికలు ఆచరణ రూపంలోకి వచ్చాయి.

అమరావతి బంతిపూల తోటల్లో క్వాంటమ్ వాలీ పూసింది. బిట్స్ పిలానీ సువాసనలు వచ్చాయి. ఆధునిక ప్రపంచ అమరావతి నగరీకరణలో ఎలాంటి అద్భుతమైనా జరగొచ్చు. ఎలాంటి అభివృద్ధి కోణాన్నైనా చూడొచ్చు. వీటన్నింటికీ ఏకైక కారణం లాండ్ బ్యాంక్. దేశంలోని ఏ రాష్ట్రానికి లేని భూ సంపద ఒక్క అమరావతిలోనే ఉంది. అన్ని అభివృద్ధి ఫలాలు వచ్చాక అమరావతిని అక్షయ పాత్ర అనటంలో సందేహం ఏముంటుంది?

■ పోతుల బాలకోటయ్య
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు

నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు

అభిషేకాల అనంతరం త్రికోటేశ్వరుడికి విశేష అలంకారం



● క్షీరాభిషేకం



● పెరుగుతో..



● నెయ్యితో..



● పసుపుతో..



● కుంకుమతో..



● గంధంతో



● విభూదితో..



● శుష్క ఫలాలతో..



- కోటప్పకొండ (నరసరావుపేట)

మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. పంచామృతాలతో ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో స్వామికి లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ప్రభుత్వం తరఫున జిల్లా ఇన్‌ఛార్జ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమర్పించిన పట్టు వస్త్రాలను స్వామికి అ లంకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, ఆలయ ట్రస్టీ మల్రాజు రామకృష్ణ కొండల రావు, ఈవో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

చదువుల కష్టం.. బోధపడింది



- నరసరావుపేట జేఎన్‌టీయూకు బోధకులు
- 10 మంది అధ్యాపకుల నియామకం
- ప్రిన్సిపాల్ బదిలీ.. డాక్టర్ రవీంద్రకు బాధ్యతలు
- ఆంధ్రజ్యోతి కథనాలకు.. వర్సిటీ పాలకవర్గం స్పందన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వసతితోపాటు బోధన కష్టాలు తీరనున్నాయి. ఎట్టకేలకు కళాశాలకు అధ్యాపకులను నియమిస్తూ కాకినాడ జేఎన్‌టీయూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వర్సిటీ వర్గాలు సోమవారం తెలిపాయి. బోధకుల లేక బాధలు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై వర్సిటీ పెద్దలు స్పందించారు. ఎనిమిది మంది ప్రొఫెసర్లు, ఒక అసిస్టెంట్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ మొత్తంగా పది మందిని నియమించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావును వర్సిటీకి బదిలీ చేసింది. ఆయన స్థానంలో డాక్టర్ వి.రవీంద్రను నియమించింది. సివిల్ బ్రాంచ్‌కు ముగ్గురు ప్రొఫెసర్లు నియమితులయ్యారు. ఈసీఈకి, సీఎస్‌ఈకి, మెకానికల్‌కు ఇద్దరు చొప్పున.. ఈఈఈ బ్రాంచ్‌కు ఒకరిని నియమించారు.

జేఎన్‌టీయూ కళాశాలకు పట్టిన గ్రహణం వీడనుంది. ఇటు అధ్యాపకుల నియమాకం. మరోవైపు విద్యార్థుల వసతి గృహాల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. రూ.10 కోట్ల వ్యయంతో అర్ధంతరంగా (మిగతా 4వ పేజీలో)


బోధకులు లేక బాధలు

ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం



హాజరైన అభ్యర్థులు

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ ప్రారంభం

- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థుల హాజరు

ఉండవల్లి వరద ఎత్తిపోతల-2 నిర్మాణం ప్రారంభం

హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ భోగీలు

నారాకోడూరుకు ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్టు

- ప్రతి గ్రామీణ పౌరుడికి డిజిటల్ సేవలే లక్ష్యం
- డిజిటల్ అంతరాలు తగ్గుతాయంటున్న అధికార వర్గాలు
- 22న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ప్రారంభం

5

ఫలించిన వ్యూహం

కొనుగోలు కేంద్రాల్లో మందగించిన ధాన్యం సేకరణ

భారీగా ధాన్యం సేకరణ లక్ష్యాలు, కొనుగోలు కేంద్రాలను తెరిచే ఉంచాలనే దీర్ఘకాలిక ప్రభుత్వ ప్రణాళికలు సత్ఫలితాలను ఇచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధరకు మించి ధాన్యం ధర పెరిగింది. రోజుకు సగటున దాదాపు 2,500 మెట్రిక్ టన్నుల వరకు మద్దతు ధరకు ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు ఫిబ్రవరి మొదటి వారానికే పూర్తయితే.. మరింత పెంపు ప్రతిపాదనలను పాలకులకు నివేదించాల్సిన పరిస్థితి వస్తుందనేది యంత్రాంగం అంచనాగా ఉంది. కానీ, గడచిన రెండు వారాలుగా కొనుగోలు కేంద్రాల్లో రోజువారి సేకరణ సగటు 800 మెట్రిక్ టన్నులకు పడిపోయింది.

- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ప్రభుత్వ ప్రణాళికతో.. రైతుకు లాభాలు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం సేకరణ లక్ష్యాలు చేరుకోవడమే గగనంగా మారింది. ఎంఎస్‌పీకి మించి బయట మార్కెట్‌లో రూ.200 ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల ఏలుబడిలో ఏ ఒక్క సీజన్‌లో కూడా ధాన్యానికి మద్దతు ధర అందించిన పాపాన పోలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో (మిగతా 4వ పేజీలో)



రైతు లాభమే అంతిమ లక్ష్యం..


మార్చి మొదటి వారం నుంచి కుప్పల్లో ధాన్యం కూడా చేతికొస్తుందని, ఆ సమయంలోనే కొనుగోలు కేంద్రాలకు భారీగా ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు కేంద్రాలను తెరిచే ఉంచాలనే నిర్ణయం తీసుకున్నందున నిర్దేశించిన లక్ష్యాలు కచ్చితంగా చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో ఇదే ధర ఇంకాస్త పెరిగి.. కేంద్రాలకు ధాన్యం రాకపోయినా లక్ష్యాల గురించి చింతేమి లేదని అంటున్నారు. అంతిమంగా రైతు లాభపడడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేస్తున్నారు.

పోస్టు ఇస్తే.. రూ.25 లక్షలు



అది పూర్తిస్థాయి బదిలీ కాదు.. కేవలం తాత్కాలిక బదిలీ (డెప్యూటేషన్). అది కూడా ఐదో..మూడేళ్లో కాదు.. కేవలం సంవత్సరం. అయినా కొందరు ఎంఏఓ (మండల వ్యవసాయ అధికారులు)లు ఈ పోస్టింగ్ కోసం ఎంత ఆఫర్ చేస్తున్నారో తెలుసా?!. అక్షరాల పాతిక లక్షల రూపాయలు. గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఒక సంవత్సరం ఏఓ పోస్టింగ్ కోసం ఇంత పెద్ద మొత్తంలో ఇచ్చుకునేందుకు చాలా మంది.. నాయకుల చుట్టూ తిరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఏఓలూ ఈ పోస్టింగ్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకు ఎంతైనా ఇచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవ సాయ శాఖలో భారీ ప్రచారం జరుగుతోంది.

- గుంటూరు విజిలెన్స్ ఏఓ పోస్టింగ్ కోసం ఓపెన్ ఆఫర్
- సిఫార్సుల కోసం క్యూ కట్టిన వ్యవసాయ అధికారులు
- రేసులో వైసీపీ మద్దతుదారులూ..



ఆగ్రా డిగ్రీలు పోటాపోటీ

విజిలెన్స్ ఏఓ పోస్టు అంటే ఖచ్చితంగా వ్యవసాయం మీద పట్టు ఉన్న వాళ్లకే ప్రాధాన్యం దక్కాల్సిన అవసరం ఉంది. క్రమ పద్ధతిలో వ్యవసాయ డిగ్రీ పూర్తి చేసిన వాళ్లకే అవకాశం దక్కితే పోస్టుకు ఎంతోకొంత న్యాయం జరుగుతుంది. కానీ, ఆగ్రా యూనివర్సిటీల నుంచి డిగ్రీలు పొందిన వారు కూడా చాలా మంది ఏఓలుగా నియమితుల య్యారు. సరైన విద్యా బోధన, తరగతుల నిర్వహణ లేకుండానే ఈ డిగ్రీలు ఇచ్చినట్లు ఆరోపణ లున్నాయి. మరి ఎవరికి అధికారులు ప్రాధాన్యం ఇస్తారో చూడాలి.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏఓ పోస్టు ఈ మధ్య కాలంలో ఖాళీ అయ్యింది. ఇప్పటి వరకు ఈ పోస్టులో ఉన్న అధికారి డెప్యూటేషన్ కాలం పూర్తికావడంతో మాతృ శాఖకు పంపించారు. ఏఓ పోస్టు ఖాళీ అయ్యిందన్న దగ్గర నుంచి.. ఆ కుర్చీలో కూర్చునేందుకు.. కొందరు ఏఓలు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు.

గట్టి పోటీ..

గత ప్రభుత్వంలో విజిలెన్స్ విభాగంలో ఏదైనా ఖాళీ ఏర్పడిందంటే.. కేవలం వైసీపీ నేపథ్యం ఉన్న వాళ్లు మాత్రమే పోస్టింగ్ కోసం పావులు కదుపుతూ వచ్చారు. ఇప్పుడు పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. విజిలెన్స్ ఏఓ పోస్టు కోసం టీడీపీ కంటే వైసీపీకి అనుకూలంగా ఉన్నవారే.. ఎక్కువగా పోటీ పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. గత ఎన్నికల్లో టీడీపీ పూర్తిగా ఓడిపోతుందని పందెం కాసిన పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ ఏఓ కూడా ఈ రేసులో ముందు వరుసలో ఉన్నారు. గుంటూరు (మిగతా 4వ పేజీలో)

నదీ తీరంలో 'మెరినా' పార్కు!

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నదీ తీర ప్రాంతంలో పార్కు నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీపీపీ పద్ధతిలో 'మెరినా' పార్కు నిర్మించేందుకు వీలుగా రాయపూడి సమీపంలోని కృష్ణానది తీరంలో ప్రభుత్వం ఎకరం భూమిని కేటాయించింది. పర్యాటక శాఖ నిబంధనల మేరకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నిర్ణయించిన మార్కెట్ విలువలో ఒక శాతం ప్రతి ఏటా చెల్లించే విధంగా 33 ఏళ్ల పాటు లీజుకు కేటాయించారు. మూడేళ్లకోసారి 5 శాతం లీజు పెంచేలా నిర్ణయించారు. ప్రాజెక్టు విలువను ఏపీ సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఏజీఐసీఎల్ చీఫ్ ఇంజనీరింగ్ స్థాయి అధికారులు, విధి విధానాలను ఏజీఐసీఎల్ ఎండీ నిర్ణయిస్తారు. కాగా, పార్కు నిర్మాణానికి కిందటి నెల 6న జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశం ఆమోద ముద్రవేయగా, ఇటీవల క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. దీనిపై పురపాలక శాఖ జీవో జారీ చేసింది.

ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో బిల్‌గేట్స్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజ ధాని ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సీఎం చంద్రబాబుతో కలిసి గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సందర్శించారు. స్థానిక మహిళా రైతులు బిల్‌గేట్స్, చంద్రబాబులకు సంప్ర దాయ స్వాగతం పలికారు. తొలుత అక్కడ సాగు ఉత్పత్తులను పరిశీలించారు. పంటకు చీడపడితే మొబైల్ యాప్ సాయంతో డ్రోన్ల ద్వారా ఆయా పంటల్లో చీడపీడలను నివారిస్తున్న తీరును స్వయంగా పొలంలోకి వెళ్లి బిల్‌గేట్స్ పరిశీలించారు.



మొబైల్ యాప్‌లో పంటకు పట్టిన చీడను గురించి బిల్‌గేట్స్‌కు వివరిస్తున్న మహిళా రైతు

మరో కీలక రైలురాయి

- గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో..
- గాజులపల్లి - చెలమ మధ్య సొరంగం పూర్తి
- త్వరలో విద్యుద్దీకరణతో రైలు మార్గం

5

పులకించిన భక్త హృదయం

- విజయవంతంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులకు కోటయ్య స్వామి ఆశీస్సులు
- నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం
- కోటప్పకొండలో తప్పని ట్రాఫిక్ కష్టాలు
- ప్రభల వెలుగులు.. సాంస్కృతి జిలుగులు
- జాగరణతో..శైవ క్షేత్రాల్లో శివనామస్మరణ


కాంతులీనుతున్న గురవాయపాలెం ప్రభ

విజయవంతంగా ముగిసిన ఉత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా ముగిసింది. 23 భారీ విద్యుత్ ప్రభల వెలుగుల జిలుగులు భక్తులను కనువిందు చేశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కోటయ్యస్వామి ఆశీస్సులు దక్కాయి. పౌర సంబంధాల శాఖ సాంస్కృతిక ప్రదర్శనలు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వికసిత భారత్.. వందేమాతరం 150 ఏళ్ల ఇతి వృతివృత్తాంతో కొండ దిగువన నిర్వహించిన చిత్ర ప్రదర్శన అకట్టుకుంది. శాంతిభద్రల పరిరక్షణలో పోలీసు శాఖ విజయవంతమైంది. ప్రశాంతంగా తిరునాళ్ల ముగియడంతో అన్ని శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా అమరేశ్వరుని కల్యాణం

అమరావతి: మహాశివరాత్రి పర్వదినం ఆదివారం రాత్రి లింగోద్భవ అభిషేకాల అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివార్ల కల్యాణం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. వందలాది భక్తులు కల్యాణం వీక్షించి తరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. ఉదయం 3 నుంచి 6గంటల వరకు కల్యాణ మహోత్సవం జరిగింది.

దర్శనం కాకుండానే..దైవం కనిపించింది

కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసు, ఆర్టీసీ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. యాత్రికులకు ట్రాఫిక్ కష్టాలను తెచ్చి పెట్టింది. ట్రాఫిక్ అమల్లో పలు మార్పులు చేసినా ప్రయోజనం కనిపించ లేదు. ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికను సమర్థంగా అమలు చేయలేకపోయారు. గతేడాది కంటే ఈసారి రద్దీ సమస్య అధికమైంది. ఎన్నడూ లేనంతగా ఘాట్ రోడ్డులో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వాహనాలు స్తంభించిపోయాయి. ఈ ప్రభావం సోపాన మార్గంపై పడింది. పదేళ్ల బాలిక స్పృహ తప్పి పడిపోయింది. ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకుంది. రద్దీ కారణంగా సోపాన మార్గాన్ని కొన్ని గంటలపాటు మూసివేశారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడం, సోపాన మార్గం మూసివేయడంతో దేవస్థానంలో క్యూ లైను 7 గంటల కల్లా ఖాళీ అయ్యింది. షిఫ్టులు లేకుండా పోలీసు సిబ్బంది శనివారం రాత్రి నుంచి తిరునాళ్ల ముగిసే వరకు విధులు నిర్వహించడంతో.. అలసిపోయి సమర్థంగా విధులు నిర్వహించలేక పోయారు.

- వీవీఐపీలు, వారి అనుచరులు అధిక సంఖ్యలో త్రికోటేశ్వర స్వామి దర్శనానికి అనుమతించడంతో రూ.200, అభిషేకం క్యూ లైన్లలో భక్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వీవీఐపీలు, అనుచరుల వాహనాలనూ కొండపైకి అనుమతించడం విమర్శలకు దారితీసింది.
- కొండపై నీటి సమస్య నెలకొంది. మరుగుదొడ్ల నిర్వహణకు నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- భక్తులందరికీ ఉచిత ప్రసాదం పంపిణీ జరగలేదు. దేవస్థానం విక్రయించిన ప్రసాదం నాణ్యత లేదని భక్తులు తెలిపారు. అరిసె ప్రసాదం గట్టిగా ఉందని, తయారీలో నాణ్యత పాటించ లేదన్న విమర్శలొచ్చాయి.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్



కనుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



పెదకాకాని: కనుల పండువగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం జరిగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ పునర్నిర్మాణ దాతలు కొల్లిపర వంశీకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారని ఆలయ ఈఓ గోగినేని లీలాకుమార్, చైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు. భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం, కల్యాణ అక్షింతలు అందజేశారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

చదువుల కష్టం బోధపడింది

(3వ పేజీ తరువాయి)

నిలిచిపోయిన వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు అతిథి, కాంట్రాక్ట్ అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ప్రొఫె సర్ల నియమాకంతో బోధన గాడిలో పడనుంది. వసతి గృహాల పనులు మే నెలాఖరుకు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు వర్సిటీ టార్గెట్ ఇచ్చింది. 2018 డిసెంబర్‌లో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాప పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను నాడు కేటాయించింది. తొమ్మిది ప్రొఫెసర్లు, 53 అసిస్టెంట్, 18 అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు కళాశాలకు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ మేరకు అధ్యాపకులను వర్సిటీ నేటికీ నియమించ లేదు. గత వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా విస్మ రించింది. ప్రస్తుత ప్రభుత్వ చర్యల నేపథ్యంలోనే వర్సిటీ నియమాకాలను అమలు చేసింది. మొత్తమ్మీద ఎనిమిది ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 53 మందికి గాను ఆరుగురు ఉండగా మరొకరిని, అసోసియేట్ ప్రొఫెసర్లు 18 మందికి గాను కేవలం ఒక్కరే ఉండగా మరొకరిని నియమించారు. 48 మంది అసిస్టెంట్, 15 మంది అసోసియేట్ ప్రొఫెసర్లను ఇంకా నియమించాలి. మిగిలిన పోస్టులు భర్తీ చేసేందుకు వర్సిటీ అధికారులు స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పోస్టు ఇస్తే..రూ.25 లక్షలు

(3వ పేజీ తరువాయి)

నుంచి ఇలానే మరో అధికారి కూడా గట్టిగానే ప్రయత్నం చేస్తున్నట్లు తెలస్తోంది. వైసీపీ నేపథ్యం ఉన్న అధికారుల కోసం కూటమి నాయకులతో మంచి సంబంధాలు కలిగిన కొందరు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

ఆదాయంలో హాట్ సీటు..

వ్యవసాయ రంగంలో ఉమ్మడి గుంటూరు జిల్లాది అగ్రభాగం. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ పోస్టు ఒక్కటే ఉంటుంది. ఈ మూడు జిల్లా ల్లో సుమారు 1800 వరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. ఏడాదికి సుమారు రూ. 2 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇవికా బయో ఉత్పత్తులు, తయారీ, అమ్మకాలు అదనం. గుంటూరు కేంద్రంగానే కొన్ని ప్రముఖ కంపెనీలు.. విత్తన, పురుగు మందుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నాయి. ఇక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కూడా విత్తనాలు, పురుగు మందులు సరఫరా అవుతుంటాయి. వీటన్నిటి మీద పర్యవేక్షణ బాధ్యత గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం మీదే ఉంటుంది. సీజన్ తో సంబంధం లేకుండా దుకాణాలపై దాడులు, విచారణలు జరుతూనే ఉంటాయి. కాబట్టి ఇక్కడ ఏఓగా నియమితులైన వారికి ఆదాయం.. నిత్య కల్యాణం.. పచ్చ తోరణం అన్న నానుడి ఎప్పటి నుంచో ప్రచారంలో ఉంది.

ఫలించిన వ్యూహం

(3వ పేజీ తరువాయి)

సేకరించి, ఆ తర్వాత రైతులను వారి మానాన వారిని వదిలేసేది. దళారులు ఇష్టారీతిన రైతులను దోచుకునేవారు. సాధారణంగా బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర పెరగగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను మూసివేసేది. కానీ, ఈసారి దానికి భిన్నంగా సేకరణ మందకొడిగా ఉన్నా బయటి ధరలు స్థిరంగా ఉండాలంటే కేంద్రాలను కొనసాగించాలనే ప్రభుత్వ వ్యూహాత్మక నిర్ణయం అన్నదాతలకు కలిసొచ్చింది.

బాపట్లలో 1.60 లక్షల టన్నులు

బాపట్ల జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం రెండు లక్షల మెట్రిక్ టన్నులు కాగా 1,45,000 టన్నుల మార్కును కొనుగోలు కేంద్రాలు జనవరి నెలాఖరుకే దాటేశాయి. బయటి ధర పెరగడంతో ఈ రెండు వారాల్లో కొనుగోలు కేంద్రాల బాట పట్టిన ధాన్యం 15 వేల టన్నులే కావడం గమనార్హం. అలాగే ఈసారి గుంటూరు జిల్లాకు సేకరణ లక్ష్యం లక్ష టన్నులు ఇవ్వగా.. ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 87 వేల టన్నులు. పల్నాడు జిల్లాలో 45 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రస్తుతం సేకరణలో 90 శాతం వాటా జనవరి నెలాఖరు వరకు చేసిందే.

రికార్డు స్థాయిలో లక్ష్యాలు ఇచ్చినా..

గడచిన ఆరేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలను భారీగా ప్రభుత్వం నిర్దేశించింది. చివరి గింజ వరకు మద్దతు ధరకు కొంటామని, అవసరమైతే సేకరణ లక్ష్యాలను పెంచుతామని జనవరి మొదటి వారంలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఇలా అన్నదాతలకు భరోసానివ్వడం సిండికేట్ మాయాజాలనికి ముగింపు పలికినట్లయింది.

కూలిన మద్దిరాల గ్రామ ప్రభ



కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్ల నుంచి స్వగ్రామానికి తరలిస్తున్న చిలకలూరిపేట మండలం మద్దిరాల భారీ విద్యుత్ ప్రభ కూలి పోయింది. రోడ్డు ఎక్కించే సమయంలో ఒక్కసారిగా ప్రభ పక్కకు ఒరిగింది. ఇది గమనించిన పంబ తాళ్లు పట్టుకున్న, ప్రభ బండిపై ఉన్న వాళ్లు పక్కకు తప్పుకోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. క్రేన్‌ల సాయంతో పైకి లేపి ప్రభను మద్దిరాలకు నిర్వాహకులు తరలించారు. ప్రభ కూలిపోవడంతో సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

చేతికి కట్టుతో చిరంజీవి



ఇటీవల విడుదల చేసిన కొన్ని ఫొటోలలో మెగాస్టార్ చిరంజీవి ఎడమ చేతికి ఓ కట్టుతో కనిపించడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఆయన చేతికి గాయమైందా.. అసలు ఏం జరిగింది.. దీని వల్ల రాబోయే ప్రాజెక్టులపై ప్రభావం ఏమైనా ఉంటుందా?.. అంటూ రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే వాటి చెక్ పెడుతూ అసలు ఏం జరిగిందో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు చిరంజీవి. 'ఇది ఆందోళన చెందాల్సినంత పెద్ద ఆరోగ్య సమస్య కాదు. షోల్డర్ కీ హోల్ సర్జరీ మాత్రమే జరిగింది. ముందస్తు జాగ్రత్తగా చేసిన సాధారణ ప్రక్రియ. నేను కోలుకుంటున్నాను. కంగారు పడవద్దు' అంటూ పేర్కొన్న చిరంజీవి ఆ సర్జరీని నిర్వహించిన వైద్యుడు నితిన్‌తో తను దిగిన ఫొటోను షేర్ చేశారు.

శివకార్తికేయన్ 'సెయాన్'




'అమరన్'తో బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో నటిస్తున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. పూర్తి గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'సెయాన్' అనే శక్తిమంతమైన టైటిల్‌ని ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో పూర్తి ఆధ్యాత్మిక వేషధారణతో శివకార్తికేయన్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో ఉన్న శివకార్తికేయన్ చేతిలోని కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగి ఉన్న శక్తిని సూచిస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకర్షించేలా భావోద్వేగాలు, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందుతున్నట్లు చిత్రబృందం పేర్కొంది. నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపింది.

అమర సైనికులకు అంకితం



భారతీయ సైనికుల అసమాన ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన గల్వాన్ లోయ ఘర్షణల ఆధారంగా రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. సల్మాన్ ఖాన్ కథానాయకుడు. చిత్రాంగద సింగ్ కథానాయిక. తాజాగా 'మై హూ' అంటూ సాగే దేశభక్తి గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ పుడమి సాక్షిగా దేశం కోసం నిలబడతాను అనే అర్థం వచ్చేలా సాగే ఈ పాట సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుడి మనోబలాన్ని, కుటుంబం చేసే త్యాగాలను ప్రతిబింబిస్తోంది. శ్రేయా ఘోషల్, అయాన్ లాల్ ఆలపించిన ఈపాటను గల్వాన్ పోరాటంలో అసువులు బాసిన అమర సైనికులకు అంకితం ఇస్తున్నట్లు యూనిట్ పేర్కొంది. అపూర్వ లఖియా దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 17న విడుదలవనుంది.

'మజాకో మల్లికా..'



ఆంటోని వర్గీస్ ప్రధాన పాత్రధారునిగా నూతన దర్శకుడు పాల్ జార్జ్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'కాటలన్' క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై షరీఫ్ మహ్మద్ నిర్మిస్తున్నారు. దుసర విజయన్, కబీర్ సింగ్‌తోపాటు సునీల్ కీలక పాత్రల్లో నటించారు. మే 14న మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'మజాకో మల్లికా...' అంటూ సాగే తొలి పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. పాటను వినాయక్ శశికుమార్ రాయగా, ఆనంద్ శ్రీరాజ్, భద్ర పాడారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు సమకూర్చారు. పాటలో.. ఓ చేత్తో సిగరెట్ తాగుతూ ఒకే కాలితో సునీల్ వేసిన స్టెప్స్ అదిరిపోయాయి. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే నెట్టింట వైరల్ అయింది. సునీల్ స్టెప్స్‌కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 'మోనికా' పాటతో ఈ పాటను పోల్చుతూ పోస్టులు పెట్టడం గమనార్హం.

చేసేవి ఐదు సినిమాలైనా... మంచి కథలే ఎంపిక చేసుకుంటా!

శివాని నగరం




'నిజానికి నేను నటిని అవ్వాలని అనుకోలేదు. నా అదృష్టం కొద్దీ మంచి అవకాశాలు లభించాయి. చాలా సెలెక్టివ్‌గా కథలు ఎంపిక చేసుకుంటున్నా. వరుస సినిమాలు చేయకుంటే ఇండస్ట్రీలో కనిపించకుండా పోతావు అని పలువురు హెచ్చరించారు. కానీ, నాకు వంద సినిమాలు చేయాలని లేదు. చేసేవి ఐదు సినిమాలైనా మంచి కథలతోనే చేస్తాను' అని అన్నారు శివాని నగరం. ఆమె కథానాయికగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హే బల్‌వంత్'. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్రరెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 20న విడుదలవుతున్న సందర్భంగా శివాని మీడియాతో ముచ్చటించారు.

- సుహాస్‌తో రెండో సినిమా ఇది. ఇందులో నా పాత్ర అమాయకత్వంతో కూడినదే అయినా ఆద్యంతం వినోదాన్ని పంచుతుంది. నరేశ్, వెన్నెల కిశోర్ పాత్రలు కూడా ప్రేక్షకులను అలరిస్తాయి. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో ఓ సర్‌ప్రైజ్ ఉంటుంది. చివర్లో తండ్రీ కొడుకుల మధ్య వచ్చే సన్నివేశాలు భావోద్వేగభరితంగా ఉంటాయి.
- వచ్చిన సక్సెస్‌ని బట్టే తదుపరి సినిమాను అంగీకరిస్తాను. స్టార్ హీరోలతో అవకాశమొచ్చినా కథ, నా పాత్ర నచ్చితేనే చేస్తా. ఎటువంటి నేపథ్యం లేకుండానే ఇండస్ట్రీకి వచ్చాను. ప్రేక్షకులు ఇచ్చిన విలువను నిలుపుకోవడం ముఖ్యం. ఇప్పుడు తెలుగు అమ్మాయిలకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. చిన్న సినిమాలను కూడా ప్రేక్షకులు పెద్ద హిట్ చేస్తున్నారు.

ఇటు మహేశ్.. అటు రణ్‌బీర్.. రాముడొస్తున్నాడు!





వెండితెరపై పురాణ పాత్రలు పోషించడం అంటే ఆషామాషీ విషయం కాదు. అందులోనూ రాముడి పాత్రను పోషించాలంటే శారీరకంగా, మానసికంగా చాలా సన్నద్ధమవ్వాలి. అలాంటి మహత్తరమైన పాత్రను పోషించే అవకాశం నటులకు అరుదుగా వస్తుంటాయి. ఇప్పుడు అలాంటి అద్భుత అవకాశం ఇప్పుడు ఇద్దరు హీరోలకు దక్కింది. దాంతో వెండితెరపై రాముడిగా అలరించడానికి ఆరు నెలల కాల వ్యవధిలో టాలీవుడ్ నుంచి మహేశ్, బాలీవుడ్ నుంచి రణబీర్ కపూర్ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ఇద్దరు రాముళ్లలో ఎవరు అభినయంతో ఆకట్టుకుంటారోనని నెట్టింట జోరుగా చర్చ సాగుతోంది. అయితే 'వారణాసి' చిత్రంలో మహేశ్ రాముడిగా కనిపించేది చాలా తక్కువ సమయమే. కానీ వాల్మీకి రామాయణం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న 'రామాయణ'లో రణబీర్ పూర్తి స్థాయిలో రాముడిగా కనిపించనున్నారు. దాదాపు రూ. 4 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో ఆ సినిమా రూపుదిద్దుకుంటోంది.

పూర్తి స్థాయి పాత్రలో..

అందరికీ తెలిసిన రామకథను వెండితెరపై దృశ్యకావ్యంగా మలచబోతున్నట్లు బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ గతంలో ప్రకటించి అందరి దృష్టి తనవైపు తిప్పుకొన్నారు. అందుకు తగ్గట్లే ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను చిత్రీకరిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన 'రామాయణ' గ్లింప్స్‌తో తన విజన్ ఎలాంటిదో అందరికీ పరిచయం చేశారు ఆయన. అంతర్జాతీయ ప్రేక్షకులకు మన ఇతిహాసం గొప్పదనాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా ఆయన ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా కనిపించనున్నారు. ఇందులో ఎంతో పవిత్రమైన రాముడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టంగా భావించి, ఎన్నో నియమాలు పాటిస్తూ ఆ పాత్రలో ఒదిగిపోవడానికి రణబీర్ కపూర్ కృషి చేశారు. తాత్కాలికంగా మాంసాహారాన్ని మానేసి కేవలం శాఖాహారానికి పరిమితమయ్యారు. శారీరకంగానూ రాముడిలా కనిపించడానికి చాలా కసరత్తులు చేశారు. ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం కోసం ధ్యానం సాధన చేశారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా తొలి భాగం ఈ దీపావళికి విడుదల కానుంది. రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

శ్రీరాముడి లుక్ కోసం మహేశ్ కసరత్తు

ఇప్పటివరకూ యాక్షన్.. లవ్.. హిస్టారికల్.. జానర్స్‌లో సినిమాలు తీశారు దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. కానీ ఆయన ఇప్పటివరకూ టచ్ చేయని జానర్ పౌరాణికం. మహేశ్‌బాబు కథానాయకుడిగా ఆయన తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంతో తొలిసారి ఈ ప్రయత్నం చేస్తున్నారు ఆయన. తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం'కు ముందే ఆయన పౌరాణికంతో ప్రేక్షకులను పలకరిస్తుండడంతో ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. 'వారణాసి'లో రామాయణంలోని ఓ ముఖ్య ఘట్టాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు. ఈ సన్నివేశాలు ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయే విధంగా ఉంటాయని.. అద్భుతమైన థ్రిల్‌ను పంచుతాయని రాజమౌళి ఓ సందర్భంలో చెప్పారు. అయితే వాటి నిడివి సినిమాలో దాదాపు 25 నిమిషాలు మాత్రమే ఉంటుందట. ఈ సందర్భంలోనే మహేశ్ రాముడిగా కనిపించనున్నారు. ఈ తరం కథానాయకుల్లో ప్రభాస్ తర్వాత తనకే శ్రీరాముడి పాత్ర పోషించే అవకాశం రావడంతో ఆ పాత్రలో ఒదిగిపోవడానికి ఎంతో కసరత్తు చేశారు మహేశ్.

నటన, నడక, లుక్ కోసం దాదాపు మూడు నెలలు కష్టపడ్డారు. ఆయన తొలిసారి ఓ పౌరాణిక పాత్రలో కనిపిస్తుండడంతో అభిమానులు ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మహేశ్ ఇందులో రుద్ర పాత్రలో కనిపించనున్నారు. 'వారణాసి' కథాంశం వివిధ టైమ్ పీరియడ్లలో జరుగుతుండడంతో ఇందులో ఆయన పోషించే పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయని తెలుస్తోంది. వచ్చే ఏడాది శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదలవుతోంది.

'రామాయణ' హిందీతో పాటు తెలుగులో కూడా విడుదలవుతుంది. అలాగే 'వారణాసి' తెలుగుతో పాటు హిందీలో కూడా రిలీజ్ కానుంది. మరి ఈ ఇద్దరు రాముళ్లలో ఎవరు భారతీయ ప్రేక్షకులను ఆకట్టుకుంటారనేది ఆసక్తికరం.

మీ ఇంట్లో కులం పిచ్చి ఏమన్నా ఉందా?



'కొత్త పోరడు' చిత్రంలో నటించిన అన్వేష్ మైఖేల్, కావ్య కల్యాణ్‌రామ్ జంటగా రూపుదిద్దుకుంటున్న సినిమా 'వాట్సాప్ నరేశ్'. సీవీ విశాల్ దర్శకత్వంలో భాగ్యలక్ష్మి చింత నిర్మించిన ఈ యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ గ్లింప్స్ విడుదల చేశారు. 'ఎట్ల నడుస్తుంది డేటింగ్ లైఫ్' అని హీరో అడగడం, 'మొన్ననే చెప్పిన కదా నాకు ఇష్టం లేదని' అని హీరోయిన్ సమాధానం చెప్పడంతో మొదలైన గ్లింప్స్ సంభాషణలతో సరదాగా సాగింది. చివరికి 'మీ ఇంట్లో కులం పిచ్చి ఏమన్నా ఉందా' అనే డైలాగ్‌తో ముగించారు. గ్లింప్స్ లెంగ్త్ కొంచెం ఎక్కువైనా ఫీల్ మాత్రం మిస్ కాకుండా జాగ్రత్త పడ్డారు దర్శకుడు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి వేదరామన్ శంకరన్ ఛాయాగ్రాహకుడు.

జేఈఈ మెయిన్ ఫలితాలలో
శ్రీ చైతన్య ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలలో శ్రీ చైతన్య గుంటూరు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారని ఎగ్జిక్యూటివ్ ఏజీయం ఈమని దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు పి.చెన్నకేశవ్ 300 మార్కులకు గాను 285 మార్కులు తెచ్చుకొని 99.99 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. మరో విద్యార్థి ఎమ్ సాకేత్ 270 మార్కులతో 99.9949 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో సత్తాచాటినట్లు వివరించారు. అదే విధంగా తమ విద్యార్థులు 11 మంది, 99.90 పర్సంటైల్, మరో 23 మంది 99.5 పర్సంటైల్ సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీయం ఈమని దుర్గాప్రసాద్, డీన్ సురేష్‌బాబు, ఏజీయం ఎల్‌టీసీ శ్రీనివాస్ క్యాంపస్‌ల ప్రిన్సిపాళ్లు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాంఘిక సంక్షేమశాఖ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. కొల్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని తెనాలిలోని సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహంలో ఉంటూ అక్కడే ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం హాస్టల్ సిబ్బంది అనుమతి లేకుండా బయటకు వెళ్లిన ఆమె, స్నేహితుడి బైక్ వెళ్తూ నారాకోడూరు సమీపంలోని క్వారీ వద్ద రెండు బైకులు ఢీకొట్టిన ఘటనలో ప్రమాదానికి గురైంది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. కాగా, కళాశాల హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థిని బయటకు వెళ్లిందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం గురించి సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్యను వివరణ కోరగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, విద్యార్థిని జీజీహెచ్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.

హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ భోగీలు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం పగటి పూట గుంటూరు మీదుగా రాకపోకలు సాగించే విజయవాడ-ఎస్ఎస్ఎస్ హుబ్లీ ఎక్స్‌ప్రెస్ భోగీలను రైల్వే శాఖ అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటివరకు ఐసీఎఫ్ భోగీలతో ఈ రైలు రాకపోకలు సాగిస్తోంది. తాజాగా లింక్ హాఫ్‌మెన్ బుష్ భోగీలను మంజూరు చేసింది. దీని వల్ల కోచ్ కంపోజిషన్ మారింది. ఎల్‌హెచ్‌బీ భోగీల వల్ల ఒక సెకెండ్ ఏసీ, మూడు ఏసీ త్రీటైర్, ఏడు స్లీపర్, మూడు జనరల్, ఒకటి ఎస్ఎల్ఆర్ భోగీలతో ఈ రైలు ప్రయాణించనుంది.

కోటయ్య స్వామి తిరునాళ్ళ ఆదాయం రూ 1.95 కోట్లు

కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళకు దేవస్థానానికి రూ.1కోటీ 95లక్షల 81వేల 848 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. గతేడాది కంటే రూ.18.13 లక్షలు ఆదాయం పెరిగిందన్నారు. దర్శనం, అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.77,78,318 లక్షలు, హుండీల ద్వారా రూ 75,52,700 లక్షలు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.38.16 లక్ష లు గతేడాది లభించగా ఈ సారి 25,56,640 లభించింది. బంగారం 3.055 గ్రాములు, వెండి 278.300 గ్రాములు భక్తులు కానుకలు సమర్పించారు. ఈవో డి.చంద్రశేఖరరావు, ఈవో టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది.

నారాకోడూరుకు ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్టు

● ప్రతి గ్రామీణ పౌరుడికి డిజిటల్ సేవలే లక్ష్యం ● డిజిటల్ అంతరాలు తగ్గుతాయంటున్న అధికారవర్గాలు ● 22న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సమృద్ధ్ గ్రామ ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్టుకు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని నారాకోడూరును ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలని టెలికమ్యూనికేషన్ల విభాగం నిర్ణయించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని ఈ పైలట్ ప్రాజెక్టును మంజూరు చేయించారు. భారత్ నెట్-ఆధారిత ఈ పైలట్ ప్రాజెక్టు పౌర కేంద్రీకృత సేవలకు అనుసంధానిస్తుంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలను గ్రామాలకు తీసుకురావడానికి దృష్టి సారిస్తుంది. దేశవ్యాప్తంగా మూడు పైలట్ ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయగా వాటిల్లో ఒకటి ఉత్తర్‌ప్రదేశ్, రెండోది మధ్యప్రదేశ్ కాగా మూడోది నారాకోడూరులోని కార్పస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్. భారత్ నెట్ మౌలిక సదుపాయాలను ఉపయోగించి భౌతిక, డిజిటల్ సేవలను సజావుగా ఏకీకృతం చేయడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని మార్చడమే లక్ష్యంగా ఈ సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్టును వచ్చే ఆదివారం ప్రారంభించబోతోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రానుండటం విశేషం.



● ప్రతి గ్రామీణ పౌరుడికి డిజిటల్ సేవలే లక్ష్యం

గ్రామీణ పౌరులను శక్తివంతం చేయడానికి బలమైన డిజిటల్ మౌలిక సదుపాయాలతో ఆన్-గ్రౌండ్ ఉనికిని అనుసంధానించే మార్గదర్శక భౌతిక సేవల నమూనాగా సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్‌ను రూపొందించారు. ఈ చొరవ భారత్ నెట్ కనెక్టివిటీని ఉపయోగించి అవసరమైన సేవలను అందిస్తుంది. ప్రతి గ్రామీణ పౌరుడు రోజువారి జీవితంలో డిజిటల్ పరివర్తన నుంచి ప్రయోజనం పొందేలా దోహదపడుతుంది. ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా నారాకోడూరు పరిసర ప్రాంతాల్లోని ప్రతి గ్రామీణ పౌరుడు ప్రయోజనం పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


నారాకోడూరులో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించనున్న సమృద్ధ్ గ్రామ ఫిజిటల్ సర్వీసెస్ కేంద్రం

సమృద్ధ్ కేంద్రం అందించే సేవలు

స్మార్ట్ తరగతి గదులు, ఏఆర్, వీఆర్-ఆధారిత అభ్యాసం, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు అనుగుణంగా డిజిటల్ నైపుణ్యం. ఐవోటీ ఆధారిత నేల పరీక్ష, డ్రోన్ మద్దతు, స్మార్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు. టెలికన్సల్టేషన్లు, ఆరోగ్య ఏటీఎంలు, అత్యవసర సంరక్షణ. పౌర సేవలు, డాక్యుమెంటేషన్, ఫిర్యాదుల పరిష్కారానికి సహాయం. స్థానిక వ్యవస్థాపనల కోసం ఓఎన్‌డీసీ, డిజిటల్ మార్కెట్ ప్రాంతాలతో ఏకీకరణ. డిజిటల్ బ్యాంకింగ్, చెల్లింపులు. విలేజ్ ఏరియా నెట్‌వర్క్, పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్ బలోపేతం.

● పెమ్మసాని చొరవ ఫలితమే

కేంద్ర సహాయ మంత్రిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టాక తాను పర్యవేక్షించే శాఖల్లో ఏ కొత్త కార్యక్రమం వచ్చినా గుంటూరుకు మంజూరు చేయిస్తున్నారు. ఇప్పటికే ఒక దఫా భూముల సర్వేకు సంబంధించిన జాతీయ వర్క్‌షాప్‌ను గుంటూరు నగరంలో నిర్వహింపజేశారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తీసుకొచ్చి వెంగళాయపాలెంలో వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని ప్రారంభింపజేశారు. ఇప్పుడు మూడో కార్యక్రమం కింద నారాకోడూరులో గ్రామ సమృద్ధ ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్టుని మంజూరు చేయించి కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను తీసుకొస్తున్నారు.

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ ప్రారంభం

● రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థుల హాజరు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ సోమవారం అర్ధరాత్రి దాటాక ప్రారంభమైంది. ర్యాలీ ఈ నెల 27వ తేదీ వరకు జరుగనుంది. నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్న 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను ఇందుకోసం సిద్ధం చేశారు. ఎంపిక ప్రక్రియ రాత్రి సమయంలోనే చేపట్టనున్నందున ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. శారీరక కొలతల పరీక్షలు, వైద్య పరీక్షలకు ఇండోర్ బ్యాడ్మింటన్, జిమ్ భవనాలను సిద్ధం చేశారు. సింథటిక్ ట్రాక్‌కు ఆనుకొని శారీరక ధారుఢ్య పరీక్షలు, డ్రగ్ పరీక్షలు, అభ్యర్థుల హాజరు, వేచి ఉండే స్థలం, మొబైల్ టాయిలెట్స్ తదితర ఏర్పాట్లు చేశారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. ల్యాబ్ టెక్నీషియన్ సేవలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యగా అగ్నిమాపక శకటాలు సిద్ధంగా పెట్టారు. పోలీస్ బందోబస్తు, అవసరమైన చోట బారికేడింగ్ ఏర్పాటు చేశారు.

● 8,598 మంది అభ్యర్థులు హాజరు

ఈ ర్యాలీలో మొత్తం 8,598 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు. నిత్యం అర్ధరాత్రి దాటాక రాత్రి 2 నుంచి వేకువజామున 5 గంటల వరకు వర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై 1.60 కిలోమీటర్ల పరుగు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. శారీరక పరీక్షలలో భాగంగా పుల్ అప్స్, జిగ్ జాగ్, 9 అడుగుల లాంగ్ జంప్ తదితర అంశాలలో పరీక్షించి అందులో ఎంపికైన వారికి ఎత్తు, బరువు తదితర శారీరక కొలతల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అందులో అర్హత సాధించిన వారికి రాత పరీక్ష నిర్వహించి, అనంతరం డ్రగ్, మెడికల్ పరీక్షలు జరుపుతామన్నారు. అభ్యర్థులు వారికి నిర్దేశించిన సమయంలో రిక్రూట్మెంట్ ప్రదేశానికి చేరుకోవాలని చెప్పారు. అభ్యర్థుల శరీరంపై ఎక్కడా ఐదు సెంటీమీటర్లు మించి టాటూలు ఉండరాదని, అయితే గిరిజన తెగల కు మాత్రం వారి ఆచారాల మేరకు వెసులుబాటు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తుది పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు రెండు, మూడు నెలల తర్వాత సులభ వైద్య పరీక్షలు నిర్వహించి, నియామకం చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారు రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్‌కు నియామక ఉత్తర్వులు పంపిస్తామన్నారు.


ఏఎన్‌యూలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం చేసిన ఏర్పాట్లు

నేడు ఎయిమ్స్ ద్వితీయ స్నాతకోత్సవం

● హాజరుకానున్న కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్
● ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు డిగ్రీల ప్రదానం



మీడియాతో మాట్లాడుతున్న ఎయిమ్స్ ఈడీ శాంతా సింగ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ద్వితీయ స్నాతకోత్సవం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎయిమ్స్ ఆడిటోరియంలో జరుగనుంది. ఎయిమ్స్ పరిపాలనా భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ తపన్ కుమార్ సాహా అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవ సభలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథిగాను, ఏపీ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖా మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథిగా హాజరవుతారని తెలిపారు. 2018లో 50 మంది విద్యార్థులతో ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభం కాగా, ఇప్పుడు 125 సీట్లకు పెంచడం జరిగిందని, ప్రస్తుతం మొత్తం ఎంబీబీఎస్ విద్యార్థులు 748 మంది వున్నారని చెప్పారు. పీజీ కోర్సులకు సంబంధించి 2022లో ఎండీ, ఎంఎస్‌లో ఐదు విభాగాలు వుండగా, ఇప్పుడు 28 విభాగాల్లో 250 మంది పీజీ విద్యార్థులు వున్నారని, ఈ ఏడాది కొత్తగా ఎండీ ఫ్యామిలీ మెడిసిన్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎయిమ్స్ అకడమిక్స్ డీన్ డాక్టర్ దేశు రాంమోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ మోహన్, డీడీఏ కల్నల్ శశికాంత్ తుమ్మా, మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ పీకే శంకరన్, డాక్టర్ కే.వంశీకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

మరో కీలక రైలు రాయి

● గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో..
● గాజులపల్లి - చెలమ మధ్య సొరంగం పూర్తి
● త్వరలో విద్యుద్దీకరణతో రైలు మార్గం

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్(రెండో మార్గం) నిర్మాణంలో ఆ శాక మరో మైలు రాయిని చేరుకుంది. గాజులపల్లి - చలమ మధ్య 320 మీటర్ల పొడవునా కొండ ప్రాంతంలో ఎలాంటి అపశృతులు లేకుండా సొరంగం తవ్వకం పూర్తి చేసింది. రైల్వే చరిత్రలో ఇదొక కీలక మైలు రాయిగా అధికారులు పేర్కొంటున్నారు. అలానే కొద్ది రోజుల్లోనే బొగడ వద్ద కూడా సొరంగం తవ్వకం పూర్తి చేస్తామని చెబుతున్నారు. ఈ రెండు సొరంగాల్లో పను లు పూర్తయితే.. గుంటూరు - గుంతకల్లు మధ్యన 401 కిలోమీటర్ల రెండో రైలు మార్గం అందుబాటులోకి వస్తుం ది. దీంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా కొత్త రైళ్లను ప్రవేశపెట్టడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ రైలు మార్గం గుంటూరు, పల్నాడు, మార్కాపురం, ప్రకా శం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలను కలుపుతుంది. కొన్ని దశాబ్దాల క్రితం బొగడ, చెలమ వద్ద రైల్వే శాఖ రెండు సొరంగాలు నిర్మించింది. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గాన్ని మంజూరు చేసింది. ఇందుకు రూ.4,306 కోట్ల భారీ నిధుల కేటాయింపులు జరిపింది. ఈ మార్గంలో 357 కిలోమీటర్ల పొడవునా రెండో రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తి కాగా, ప్రస్తుతం రైళ్ల రాకపోకలకు దీని వల్ల చాలా వరకు ప్రయాణ సమయం తగ్గింది. అయితే కీలకమైన రెండు సొరంగాలు నిర్మించకపోవడంతో 44 కిలోమీటర్ల డబ్లింగ్ అందుబాటులోకి రాలేదు. ఈ కారణంగా అక్కడ రైళ్ల క్రాసింగ్ కోసం లూప్‌లైన్‌లో వేచి చూడాల్సిన పరిస్థితి. రెండు సొరంగాల నిర్మాణం కోసం రైల్వే శాఖ అటవీ, వన్యప్రాణి విభాగం నుంచి కీలకమైన అనుమతులు తీసుకునేందుకు.. చాలా సంవత్సరాలే పట్టింది. ఎట్టకేలకు అనుమతులు రాగా ఇప్పుడు గాజు లపల్లి - చెలమ సొరంగం తవ్వకాన్ని పూర్తి చేసింది. దీంతో ఈ సెక్షన్ కొద్ది రోజుల్లోనే పూర్తవుతుంది. ఆ తర్వాత బొగడ వద్ద మరో కీలకమైన సొరంగం నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. విజయవంతంగా చెలమ టన్నెల్ తవ్వకం పూర్తి చేసినందుకు రైల్వే కార్మికులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

గ్యాస్ స్టవ్ లీక్ అయి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నగరాలులో గ్యాస్ లీక్ అయి ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన శృంగవరపు చెంచమ్మ తన కుమార్తె, మనవరాలితో కలిసి నగరాలులో ఉంటోంది. ఈ నెల 9న చెంచమ్మ గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు అంటుకున్నాయి. ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాపురంలో పేకాట రాయుళ్ళ అరెస్ట్

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపురం ఐదో లైన్‌లో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్ళను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 30,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఉండవల్లి వరద ఎత్తిపోతల-2 నిర్మాణం ప్రారంభం

● మట్టి నమూనా పరీక్షలు చేపట్టిన మేఘా ఇంజనీరింగ్
● కొద్ది రోజుల్లోనే కాంక్రీట్ పనులు మొదలయ్యే అవకాశం


ఉండవల్లి ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2 కోసం మట్టి పనులు ప్రారంభించిన మేఘా సంస్థ

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి కొండవీటి వాగు వరద ముప్పు నుంచి కాపాడేందుకు ఉండవల్లిలో వరదనీటి ఎత్తిపోతల-2 పథకం నిర్మాణం ప్రారంభమైంది. ఒకేసారి 8,400 క్యూసెక్కుల వరదనీటిని కృష్ణానదిలోకి పంపింగ్ చేసేందుకు దీనిని డిజైన్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మిం చిన ఎత్తిపోతల పథకం-1 సమర్థవంతంగా వరద సమయంలో ఉపయోగపడుతుం డగా ప్రస్తుతం నిర్మాణం చేపట్టబోతున్న స్కీమ్ రెండోది. ఈ ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ పూర్తయితే కొండవీటి వాగుకు ఒకేసారి 13 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా రాజధానికి ఎలాంటి ముప్పు వాటిల్లే అవకాశం ఉండదు. వీటికి తోడు రాజధానిలో ఎ క్కడికక్కడ కొండవీడు, పాలవాగుల వరద ప్రవాహాలను ఒడిసి పట్టేందుకు నీరు కొండ, కృష్ణాయపాలెం, పెనుమాకలో రిజర్వాయర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

● వరద ముప్పు తగ్గించే లక్ష్యంతో..

కృష్ణానదికి, కొండవీటి వాగుకు గత కొన్నేళ్ల గణాం కాలను పరిగణనలోకి తీసుకుంటే వరద ప్రవాహం ఒకేసారి వస్తోంది. దీని వల్ల కొండవీటి వాగులో ప్రవ హించే వరద కృష్ణానదిలోకి గ్రావిటీ విధానంలో చేరడం లేదు. దాంతో నీరుకొండ వరకు కొండవీటి వాగు పరిసర ప్రాంతాలను వరద ముంచెత్తుతోంది. అయితే కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గగానే కొండవీటి వాగులో వరద అంతా వెళ్లిపోతోంది. అయితే అమ రావతి రాజధానిని విశ్వనగరంగా నిర్మించేందుకు కూట మి ప్రభుత్వం సంకల్పించడంతో వరద ముప్పు ఉండ టానికి వీల్లేదన్న లక్ష్యంతో అన్ని చర్యలు చేపడుతోంది. రాజధానిలో గ్రావిటీ కెనాల్స్ నిర్మాణాలను ఇప్పటికే ప్రారంభించింది. తద్వారా బ్లూ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ కొంతమేరకు వరద బలహీనప డుతుంది. అలానే రిజర్వాయర్లలోకి దాదాపు 0.03 టీఎంసీల నీరు నిల్వ చేసుకొని రాజధాని అవసరాలకు వినియోగించుకోవచ్చు. మిగిలిన వరదనీటిని పంపింగ్ చేసేందుకు ఉండవల్లి ఎత్తిపోతల పథకం-2ను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. దీనిని రూ. 443.76 కోట్లకు మేఘా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకుంది. భవిష్యత్తులో ఈ పథకం సామర్థ్యాన్ని 17,650 క్యూసెక్కుల డిశ్చార్జికి పెంచుకునేలా డిజైన్ చేశారు. రెండేళ్ల వ్యవధిలో ఈ ఎత్తిపోతల పథకం నిర్మా ణం పూర్తయి అందుబాటులోకి వస్తుంది. ఆపరేషన్, మెయిన్‌టెనెన్స్ కాలాన్ని 15 ఏళ్లుగా నిర్ణయించింది. ప్ర స్తుతం సాయిల్ టెస్టింగ్ పనులను మేఘా సంస్థ ప్రా రంభించింది. వాటి ఫలితాలు రాగానే నిర్మాణ పనులను చేపడుతుందని ఏపీసీఆర్డీఏ వర్గాలు తెలిపాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 123, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

మిర్చియార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	87,018
అమ్మకాలు	82,824
నిల్వ	18,618



నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13500	22500
273	14000	23000
341	14000	24500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15500	27000
ఆర్మూరు	13000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13000	20500
273	----	----
341	14000	23000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
బ్యాడిగి 355	14000	23500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

శాప్ క్రీడా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు (క్రీడలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన శాప్ లీగ్ పోస్టర్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. రాష్ట్రంలోని అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 'శాప్ లీగ్'ను ప్రారంభించిందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ లీగ్ ఫిబ్రవరి రెండో వారం నుంచి డిసెంబర్ వరకు కొనసాగుతుందన్నారు. దీని కోసం పాఠశాల విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తో కలిసి పని చేస్తాయని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని, ఎంపికైన వారు నేరుగా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఫిబ్రవరి 21న తిరుపతిలో రాష్ట్ర స్థాయి చెస్ లీగ్ ప్రారంభం కానుందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ హయ్యర్‌తోనే క్రైస్తవ సంఘ అభివృద్ధి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫాదర్ క్రిస్టియన్ హయ్యర్ సువార్త సభల ఫలితంగా రాష్ట్రంలో క్రైస్తవ సంఘం అభివృద్ధి సాధించిందని గుంటూరు సెంట్రల్ సినాడ్ బిషప్ రెవరెండ్ డా.ఎస్‌జె బాబురావు అన్నారు. గుంటూరు నల్లపాడులోని పరిశుద్ధ పేతురు లూథరన్ దేవాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, వైద్య రంగాల్లో ఫాదర్ క్రిస్టియన్ హయ్యర్ త్యాగం చిరస్మరణీయమని అన్నారు. సంఘ ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘస్థులు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాతలైన దుగ్గింపూడి యోగేశ్వరరెడ్డి, కిషోర్ రెడ్డిని సన్మానించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.

ముగిసిన ఎన్టీఆర్ స్టేడియం నామినేషన్ల ప్రక్రియ

● నేడు నామినేషన్ల ప్రకటన

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిందని ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ ఉప కమిషనర సీహెచ్ శ్రీనివాసు తెలిపారు. సెక్రటరీకి 8, ట్రెజరర్ 5, వైస్ ప్రెసిడెంట్ 5, ఎక్జిక్యూటివ్ మెంబెర్స్‌కు 18, జాయింట్ సెక్రటరీకి 7 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన తెలిపారు. మంగళవారం నామినేషన్ల జాబితా స్టేడియంలో ప్రదర్శిస్తామని తెలిపారు. 19వ తేదీ నామినేషన్ల స్క్రూటినీ జరుతుగుతుందని, అనంతరం లిస్టు పబ్లిష్ చేస్తామన్నారు. ఈ నెల 20న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది అభ్యర్థుల లిస్టు పబ్లిష్ చేస్తామన్నారు. మార్చ్ 1వ తేదీన స్టేడియం ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహించి అనంతరం లెక్కింపు, ఫలితాల వెల్లడిస్తామన్నారు.

ఐలాపురం వెంకయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి



వెంకయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలోని సీతారాంపురంలోని నివాసానికి వెళ్ళి వెంకయ్య భౌతిక కాయానికి పూల మాలలతో లింగంశెట్టి నివాళులర్పించారు. వెంకయ్య తనకు ఎంతో సన్నిహితుడని తమ అనుబంధాన్ని లింగంశెట్టి గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వికసత్ భారత్ లక్ష్యం సాధించేలా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రూ. 3 లక్షల 32వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టటం చరిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో విద్య, వైద్య, వ్యవసాయరంగాలకు అత్యధిక కేటాయింపులు చూపటం శుభపరిణామమన్నారు. అలానే కార్పొరేషన్‌ల నిధులతో ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరంపాలెం పునీత ఆంథోనీ చర్చ్ వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగించే 45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం అతను అపస్మారక స్థితిలోకి చేరగా జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం సీఐకు 8688831336లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

యార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారాన్ని జయప్రదం చేయండి : కిలారి రోశయ్య

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే మిర్చియార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పిలుపునిచ్చారు. స్థానిక విద్యానగర్‌లో సోమవారం మిర్చియార్డు డైరెక్టర్‌గా నియమితులైన జనసేన పార్టీ నగర కార్యదర్శి కటకంశెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ ప్రముఖులతో డివిజన్ అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి రోశయ్య మాట్లాడుతూ మిర్చి యార్డు పాలకవర్గంలో వైస్ చైర్మన్ పదవితో పాటుగా రెండు డైరెక్టర్ పదవులు జనసేనకు దక్కటం హర్షణీయమన్నారు. జనసేన పార్టీలో కష్టపడ్డ ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుంది అనటానికి ఈ పదవులే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయబ్ కమాల్ మాట్లాడుతూ వచ్చే శుక్రవారం చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో జరగనున్న ప్రమాణ స్వీకారానికి గుంటూరు అర్బన్ పరిధిలో ఉన్న 57 డివిజన్‌ల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అడపా మాణిక్యాలరావు, ఆళ్ళ హరి, నార దాసు ప్రసాద్, చింతా రాజు, బండారు రవీంద్ర, బుడంపాడు కోటి, కవిత, అలివేలు, అన్నపూర్ణ దేవి, వరలక్ష్మి, యడ్ల రాధికా, లలిత అంజనాదేవి పాల్గొన్నారు.



యార్డు డైరెక్టర్ కటకంశెట్టి విజయలక్ష్మిని సత్కరిస్తున్న కిలారి రోశయ్య, జనసేన నాయకులు

ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి

● డీఆర్వో ఖాజావలీ ● పీజీఆర్ఎస్‌కు 291 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలీ, జడ్పీ సీఈవో జ్యోతిబసు తదితరులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సంతృప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఖాజావలీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్‌తో కలిసి డీఆర్వో ఖాజావలీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లో 74 ఇతర సమస్యలపై 217 మొత్తం 291 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డీఆర్వో ఖాజావలీ మాట్లాడుతూ, కార్యాలయాల్లోని అన్ని ఫైళ్లను ఈపీటీఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఈవో సలీం బాషా, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీహరి, డీపీవో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టికను ప్రదర్శించాలి

● రోగుల పరీక్షలు, స్కానింగ్, బీపీ, షుగర్ పరీక్షలు, ఐసీయూ చార్జీలు, తదితర సేవలకు ధరలు నిర్ణయించినప్పటికీ, ప్రైవేటు ఆస్పత్రులలో ఆ ధరల జాబితా బోర్డులను ప్రదర్శించడం లేదని డీఆర్వో దృష్టికి కన్స్యూమర్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్పత్రులలో అందరికీ కనిపించేలా ఈ బోర్డులను ఏర్పాటు చేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీరాల నాగేశ్వరరావు, చేకూరి రాజశేఖర్, వెంకట రత్నం తదితరులు ఉన్నారు. రాజధాని ప్రాంతంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయ కొత్త కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. జగనన్న ఇళ్ల పథకంలో బాధితులకు న్యాయం చేకూర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు కోరారు. ఆయన వెంట తోట శ్రీనివాస్, కత్తి సరోజిని, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపై చర్యలు తీసుకోవాలి

● స్వయం ఉపాధి రుణాలలో చేతివాటం చూపిన ఆర్పీపై చర్యలు తీసుకోవాలని గుంటూరు రూరల్ మండలం, దాసరిపాలెంకు చెందిన డ్వాక్రా మహిళలు పీజీఆర్ఎస్‌లో డిఆర్వో ఖాజావలీను కోరారు. 2023లో అనితా అనే ఆర్పీ గ్రూపుకు రూ.లక్ష రుణం మంజూరయిందని బ్యాంకుకు రావాలని చెప్పి అక్కడకు వెళ్లిన తర్వాత రూ.32 వేలు చేతిలో పెట్టి మిగిలిన మొత్తం తర్వాత అందజేస్తామని నమ్మ బలికిందన్నారు. మూడేళ్ళ నుంచి మిగిలిన డబ్బులు అందజేయలేదన్నారు. ఇప్పుడు బ్యాంకు ద్వారా నోటీసులు పంపి మొత్తం రూ.లక్ష కట్టాలని వేధిస్తుందని వాపోయారు. ఆర్పీ, అధికారులపై చర్యలు తీసుకొని, బ్యాంకు నుంచి వచ్చే నోటీసులను నిలిపిలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రూపు లీడర్ బి.మల్లేశ్వరి, సభ్యులు షేక్ మస్తానీ, దాసరి దేవకి ఉన్నారు.

గాంధీ పార్క్ అభివృద్ధికి చర్యలు

● నగర కమిషనర్ మయూర్ అశోక్



గాంధీ పార్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గాంధీ పార్క్‌ను అన్ని రకాల వసతులతో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి గుంటూరు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. పార్క్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం టికెట్ల విక్రయాల ద్వారా వస్తున్న ఆదాయాలు, ఇతర వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం గాంధీ పార్క్, ట్రావెలర్స్ బంగ్లాలను పరిశీలించి, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు హనీఫ్, శ్రీనివాస్, వెంకటరమణ, ఆర్వో రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ సాంబయ్య, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారుల సంయుక్త సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల వేగవంతానికి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో ఉండాలని ఆదేశించారు.

● అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

గుంటూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను నగర కమిషనర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 46 అర్జీలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయండి

● పోలీసు అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీసు అధికారులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, రంజాన్ మాసం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో మసీదుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో కొత్తపేట పోలీస్ స్టేషన్ నూతన బిల్డింగ్ నిర్మాణం చేపట్టబోతున్నామని వెల్లడించారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను సావధానంగా ఆలకించాలని సూచించారు. పోలీసులకు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● పవన్ కుమార్‌కు ఎమ్మెల్యే నసీర్ అభినందనలు

ఈ నెల 4 నుంచి 8 తేదీలలో ఢిల్లీలో జరిగిన ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ కాంపిటేషన్ రెండో స్థానం సాధించిన పాత గుంటూరుకు చెందిన చెన్న పవన్ కుమార్‌ను సోమవారం గుంటూరు తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి అభినందనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో వెండి పతకాన్ని కైవసం చేసుకున్న నగరానికి చెందిన పటాన్ రెహ్మాన్ ఖాన్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సత్కరించారు. జాతీయస్థాయి పోటీలలో పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ బండ్లమూడి గాంధీ, ప్రజా సేవకుడు షేక్ బాజీ, సయ్యద్ బాబు, మహమ్మద్ హర్షద్ బాబు, కోచ్ క్రముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పఠాన్ రెహ్మాన్‌ఖాన్, కిక్ బాక్సింగ్ సిల్వర్ మెడల్ గ్రహీత పవన్ కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

రోబోటిక్ టెక్నాలజీతో 92 ఏళ్ల వృద్ధుడికి మోకీళ్ల మార్పిడి

● సర్జరీ చేయించుకున్న పెద్ద వయస్కుడిగా గుర్తింపు ● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై సుబ్రహ్మణ్యం వెల్లడి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం నేతృత్వంలో నగరంలోని సంజీవి హాస్పిటల్‌లో 92 ఏళ్ల వృద్ధుడికి మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహిం చారు. ఇంత పెద్ద వయస్కుడైన రోగికి మోకీళ్ల మార్పిడి చేయడం రాష్ట్రంలో ఇదే మొదటి సారని వైద్య వర్గాలు తెలిపాయి. సోమవారం లక్ష్మీపురం నాలుగో లైన్‌లోని సంజీవి హాస్పిటల్‌లో విలేకరులతో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.లక్ష్మ ణస్వామి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం మాట్లా డారు. 92 ఏళ్ల వయస్సు కలిగిన ఆర్.నారా యణ అనే రోగి మోకీళ్ల అరుగుదలతో తీవ్రమైన నొప్పితో బాధపడేవారిని తెలిపారు. చికిత్సకు సంజీవిని ఆసుపత్రిని సంప్రదించగా, సర్జరీ చేయాలని సూచించామన్నారు. రోగి నారాయణకు మోకాళ్ల నొప్పితో పాటు గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో తగిన జాగ్రత్తలు పాటిస్తూ రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్ల రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిపినట్లు తెలిపారు. ఆపరేషన్ తర్వాత నారాయణ మోకాలు నొప్పి నుంచి పూర్తిగా ఉపశమనం పొందారన్నారు. ఇప్పుడాయన సొంతగా నడుస్తున్నట్లు వెల్లడించారు. తమ హాస్పిట ల్‌లో అత్యాధునిక రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స సదుపా యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 300కు పైగా రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు చెప్పారు. రోగి భద్రతతో పాటు కచ్చితమైన చికిత్స, ఉత్తమ ఫలితాలను అందిస్తున్నట్లు సుబ్రహ్మణ్యం వెల్లడించారు.



నడుస్తున్న నారాయణ, పక్కన డాక్టర్ సుబ్రహ్మణ్యం

కేహెచ్ఐటీలో త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నిపుణులైన ట్రైనర్ సయ్యద్ ఖాజా హబేదుబ్బిన్ మొహమ్మద్ పాల్గొని విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కళ్ళం భరద్వాజ్, కళ్ళం నవ్య తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు


ఎన్టీఆర్ స్టేడియంలో మరింత అభివృద్ధి జరగాలి



మాట్లాడుతున్న షేక్ లాల్‌వజీర్, పాల్గొన్న ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో మరింత అభివృద్ధి జరిగి, రాష్ట్ర స్థాయి క్రీడలకు వేదికవ్వాలని లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక చంద్రమౌళినగర్‌లో కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేడియం అభివృద్ధికి త్వరలోనే రూ.లక్ష విరాళాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. త్వరలో జరిగే స్టేడియం కమిటీ ఎన్నికల్లో కార్యదర్శిగా పోటీ చేస్తున్నానని, గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఈ విరాళాన్ని అందజేస్తానని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల చరిత్ర కలిగిన స్టేడియం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సాయం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో లాఫింగ్ క్లబ్ సభ్యులు, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ పాల్గొన్నారు.

ఉపనిషత్ ప్రవంతిపై ఆధ్యాత్మిక ప్రవచనం



ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం జరుగుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో ఉపనిషత్ ప్రవంతిపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్ర జ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయామిషన్ సువీరానందస్వామి ప్రవచిస్తూ ఉపనిషత్తుల ప్రాధాన్యాన్ని వివరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

● ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సూచించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రోషన్, బత్తుల దేవానంద్, రత్నప్రసాద్, సత్యనారాయణరెడ్డి, విజయ మాధవి, విజయమ్మ, సత్యవతి, వెంకాయమ్మ, ఆలా కిరణ్ తదితరులున్నారు.

వాస్తవిక నిధులతోనే బడ్జెట్ రూపొందించాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆతుకూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు, యేల్చూరి తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉన్న వాస్తవిక నిధులతోనే బడ్జెట్ రూపొందిస్తే బాగుండేదని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏకంగా రూ.3లక్షల 32వేల కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టటం బాగానే ఉందని, కానీ రూ.75వేల కోట్లు లోటు బడ్జెట్‌తో రూపొందించటం ప్రజల్ని మభ్యపెట్టటమేనన్నారు. ముఖ్యంగా రాష్ట్రాభివృద్ధికి పారిశ్రామిక రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాల్సి ఉందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో స్కిల్ డెవలప్‌సెంటర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపంతో పారిశ్రామిక రంగం కుంటుపడుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో చాంబర్ సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, ఆతుకూరి నగేష్‌కుమార్, గొల్లపూడి కాశీరాంబాబు ఉన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

● ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి సర్వం సిద్ధం ● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయసు కలిగిన 4,71,937 మందికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో ఈ మాత్రలు మంగళవారం ఉచితంగా అందజేస్తామని ఆమె వివరించారు. ఏడాది నుంచి రెండేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు సగం మాత్ర నీటిలో కరిగించి తాగించాలని ఆమె సూచించారు. మూడు సంవత్సరాలు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. నాలుగేళ్లపైబడిన వారి నుంచి 19 ఏళ్ల వరకు మాత్రను చప్పరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం అరగంట తర్వాత ఈ మాత్రను చప్పరించాలని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ఆల్బెండజోల్ మాత్రలల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. మంగళవారం ఈ మాత్రలను తీసుకోని వారి కోసం ఫిబ్రవరి 24న జరిగే మరో రౌండ్ కార్యక్రమంలో అందజేస్తామని డాక్టర్ విజయలక్ష్మీ ప్రకటించారు.

● ఆరోగ్య శాఖకు ఐడీ వివరాలు అందజేయాలి

రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, రక్తపరీక్ష కేంద్రాలు, స్కానింగ్ సెంటర్ల యాజమాన్య సిబ్బంది, వారి దగ్గర పనిచేస్తున్న వైద్యుల హెచ్‌పీఆర్ ఐడీ, ఆయా వైద్య సంస్థల హెచ్ఎఫ్ఆర్ ఐడీలు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియను 30 రోజుల్లో పూర్తి చేసుకోవాలని అన్నారు. నిర్ణీత సమయంలోపు ఈ ప్రక్రియ చేసుకోని ఆసుపత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాల లైసెన్సులు రద్దయినట్లుగా భావిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ వెల్లడించారు.



శ్రీశైలంలో భక్త జనం మధ్యన కొనసాగుతున్న రథోత్సవం, రథంలో భ్రమరాంబ, మల్లికార్జునస్వామి (ఇన్‌సెట్)

కమనీయం.. మల్లన్న రథోత్సవం

శ్రీశైలానికి భారీగా తరలివచ్చిన భక్తజనం

శ్రీశైలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ముక్కంటి ఆలయం భక్త జన సాగరమయింది. శ్రీగిరి వీధులు కైలాసాన్ని తలపించాయి. భక్తుల శివ నామ స్మరణతో శ్రీశైల క్షేత్రం మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సా యంత్రం ఉత్సవమూర్తులను మంగళవాద్యాల మధ్య గంగాధర మండపం వద్దకు తీసుకునివచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులనుజేసి రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి సరస్వి పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు.



కన్నుల పండువగా విజయవాడలో రథోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ వన్‌టౌన్ కెనాల్ రోడ్డులో సోమవారం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీకన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, శ్రీగంగా పార్వతిసమేత వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్దా వారి గుడి), శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లోని ఉత్సవ మూర్తులను రథం సెంటర్ వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి, రథంపై ఉంచి పూజలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు రథోత్సవాన్ని ప్రారంభించారు. -ఆంధ్రజ్యోతి, విజయవాడ

అ'క్రమబద్ధీకరణ'!

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి.. తహశీల్దారు అత్త, భార్యకు బదలాయింపు

- 240 చ.గజాలను ఆక్రమించి రేకుల ఇల్లు వేసుకున్న గౌస్‌బీ
- 2019 జూన్ 12న క్రమబద్ధీకరణ కింద ఆమె పేరిట రిజిస్ట్రేషన్
- దానిని కుమార్తె తన్వీర్‌కు రాసిచ్చిన గౌస్‌బీ
- ఆ తర్వాత అదే రేకుల ఇల్లు చూపించి మరో 176 చ.గజాలను క్రమబద్ధీకరించుకున్న తన్వీర్
- ఈమె నెల్లూరు అర్బన్ తహశీల్దారు షఫీ భార్య
- ప్రభుత్వ ఉద్యోగికి క్రమబద్ధీకరణ వర్తించదు
- అయినా షఫీ తల్లి, భార్య పేరిట రిజిస్ట్రేషన్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

నెల్లూరు బీవీ నగర్‌లో ఉదంతం



నెల్లూరు బీవీనగర్‌లో తహశీల్దారు అత్త, భార్య నివాసంగా పేర్కొన్న ఇల్లు

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

నిరుపేదలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించడానికి విడుదల చేసిన జీవో(నంబర్ 388).. అక్రమార్కులకు వరంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని కొందరు రెవెన్యూ అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారన్న విమర్శలూ వస్తున్నాయి. తాజాగా నెల్లూరు అర్బన్ తహశీల్దారు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తన అత్త, భార్య పేరిట క్రమబద్ధీకరించారన్న ఆరోపణలు కలకం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరులోని భక్తవత్సల్‌నగర్ (బీవీనగర్)లోని 52 అంకణాల ప్రభుత్వ స్థలమది. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దాని విలువ రూ.కోటిన్నర పైమాటే. ఈ భూమిని అర్బన్ తహశీల్దారు షఫీ మాలిక్ అత్త, భార్య పేరిట బదలాయించారు. సర్వే నంబర్లు 437, 438ల్లోని 52 అంకణాల ప్రభుత్వ భూమిలో 240 చదరపు గజాలను షేక్ గౌస్‌బీ అనే మహిళ ఆక్రమించుకుని రేకుల ఇల్లు కట్టుకుంది. సదరు భూమిని జీవో 388 కింద 2019 జూన్ 12న ప్రభుత్వం తరపున నెల్లూరు రూరల్ తహశీల్దారు కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్.. ఆమె పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత 2022 జూలైలో ఈమె తన కూతురు పఠాన్ తన్వీర్‌కు సెటిల్‌మెంట్ పత్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. తన్వీర్ అర్బన్ తహశీల్దారు షఫీ మాలిక్‌కు భార్య కావడం విశేషం. ఇక ఇదే సర్వే నంబర్‌లోని మరో 176 చ.గజాల స్థలాన్ని ఆమె ఆక్రమించుకుని, అందులో రేకుల ఇల్లు నిర్మించుకుని ఉంటున్నట్లు చూపించి.. 2023 ఆగస్టులో క్రమబద్ధీకరణ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

పక్కా అక్రమాలు..!

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ చట్ట నిబంధనల ప్రకారం.. ఆక్రమితదారులు ఇల్లు లేని పేదలై ఉండాలి. ఆక్రమిత స్థలంలో నివాసం ఏర్పరచుకుని ఉండాలి. 2022 జూలై 22న పఠాన్ తన్వీర్‌కు ఆమె తల్లి గౌస్‌బీ తనకు క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం సంక్రమించిన 240 చదరపు గజాల స్థలాన్ని సెటిల్‌మెంట్ కింద రాసి ఇచ్చారు. అంటే ఈ సెటిల్‌మెంట్‌తో పఠాన్ తన్వీర్‌కు ఒక ఇల్లు ఏర్పడింది. ఆ నిబంధన ప్రకారం ఆమెకు క్రమబద్ధీకరణ చట్టం కింద మరో భూమిని ఇవ్వడానికి వీల్లేదని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. అయితే 2023 ఆగస్టు 26న ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 176 చదరపు గజాల స్థలాన్ని క్రమబద్ధీకరణ చట్టం కింద రూరల్ తహశీల్దారు కార్యాయం తరపున రెవెన్యూ ఇనెస్పెక్టర్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ డాక్యుమెంట్‌లో కూడా గౌస్‌బీ ఉన్న నివాసం డోర్ నంబర్‌నే పఠాన్ తన్వీర్ ఇల్లు (ఆక్రమణ స్థలంలో నిర్మించుకున్న ఇల్లు)గా చూపించారు. వాస్తవానికి ఆ స్థలంలో ఉన్నది రేకుల ఇల్లు. దానినే చూపించి తల్లి పేరుతో 240 చదరపు గజాలు, కుమార్తె పేరుతో 176 చదరపు గజాలు క్రమబద్ధీకరణ చేయడంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. క్రమబద్ధీకరణ చట్టం ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ సభ్యులకు వర్తించదు. కానీ ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగి.. అందునా తహశీల్దారు కావడం, కోట్ల విలువజేసే సుమారు 476 చదరపు గజాల స్థలాన్ని ఆయన అత్త, భార్యల పేరుతో క్రమబద్ధీకరించడం విమర్శలకు దారితీస్తోంది. తహశీల్దారు హోదాలో తనకున్న పరిచయాలను, పరపతిని ఉపయోగించి డివిజనల్ లెవల్ కమిటీని ప్రభావితం చేసి అప్రూవల్ తెచ్చుకున్నారని, కోట్లాది రూపాయల విలువజేసే ప్రభుత్వ భూమిని దొడ్డిదారిన తన కుటుంబ సభ్యుల పేరుమీదకు బదలాయించుకున్నారనే ఆరోపణలు షఫీ మాలిక్‌పై వెల్లువెత్తాయి. దీనిపై నెల్లూరు కలెక్టర్ మొదలు రాష్ట్ర ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదులు అందాయి.

చట్ట ప్రకారమే రిజిస్ట్రేషన్ జరిగింది: తహశీల్దారు

తన అత్త, భార్య పేర్లతో క్రమబద్ధీకరణలు చట్ట ప్రకారమే జరిగాయని నెల్లూరు అర్బన్ తహశీల్దారు షఫీ మాలిక్ అన్నారు. ఉద్దేశపూర్వకంగా తనపై తప్పుడు ప్రచారాలు, ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. తన అత్తగారి పూర్వీకుల కాలం నుంచి ఆ భూమి ఆ కుటుంబం అధీనంలో ఉందని చెప్పారు.

నవయుగకే రామాయపట్నం రేవు బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతలను నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌ఈసీఎల్)కే కట్టబెడుతూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రామాయపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతలను నవయుగ -ఆరో ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (అరబిందో రియాలిటీ లిమిటెడ్) సంస్థల భాగస్వామ్యంలోని జాయింట్ వెంచర్‌కు గతంలో అప్పగించారు. ఇటీవల ప్రభుత్వాన్ని నవయుగ కంపెనీ కలిసి.. తాము ఆరో లిమిటెడ్‌తో భాగస్వామ్య ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నామని లిఖితపూర్వకంగా వెల్లడించింది. అదేవిధంగా ఆరోకు చెందిన 49 శాతం వాటాను కూడా తామే తీసుకుంటున్నట్లు తెలిపింది. మొత్తం 100 శాతం వాటాతో తామే పోర్టు నిర్మాణ పనులు చేస్తామంటూ ప్రభుత్వానికి అభ్యర్థన సమర్పించింది. దరిమిలా.. ఈపీసీ కాంట్రాక్టు విధానంలో నవయుగకే రామాయపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక సీఎస్ ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు.

ఇళ్ల పట్టాల పేరుతో జగన్ రాజకీయ నేరం: మాధవ్

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ 2024 ఎన్నికల ముందు ఇళ్ల పట్టాల పేరుతో రాజకీయ నేరానికి పాల్పడ్డాడు. దీనిపై విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలి' అని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. 2019-24 మధ్య కాలంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీలో జరిగిన మోసంపై బీజేపీ నాయకులు అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. దీనిపై మాధవ్ ఓ ప్రకటన చేశారు. 'ఇళ్ల పట్టాల పేరుతో రాష్ట్రంలో 30 లక్షల మంది నిర్వాసితులను మాజీ సీఎం జగన్ మోసం చేశారు. పేదల ఇళ్ల పట్టాలను రాజకీయ పోస్టర్‌గా మార్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నం చేశారు. స్థలం లేకుండా పట్టా ఇచ్చి పేదల సొంత ఇంటి కలను ఓటు బ్యాంకుగా మార్చేందుకు కుట్ర చేశారు. జగన్ చేసిన తప్పులను కప్పిపుచ్చేందుకు కూటమి ప్రభుత్వంలోని అధికారులు ప్రయత్నించడం సిగ్గుచేటు. జగన్ చేసిన కుట్రను రాజకీయ నేరంగా పరిగణలోకి తీసుకుని విచారణ చేసి పేదలకు న్యాయం చేయాలి' అని మాధవ్ డిమాండ్ చేశారు.

గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతులు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మంది గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు స్పెషల్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2025-26 ప్యానల్ ఇయర్ సీనియారిటీ జాబితాను డీపీపీ ఆమోదించడంతో ఆ మేరకు అడహాక్ పదోన్నతులు కల్పిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వు లు జారీచేసింది. ఎం.శ్రీలక్ష్మి, కె.శివప్రసాద్, టి.వెంకటకృష్ణయ్య, జి.శేఖర్, పి.శ్రీహరిబాబు, ఐ.ఎల్‌పీఐ నాయుడు, ఆర్‌జీవీ కృష్ణ, కె.మేరీగోల్డ్ డైమండ్, పి.నరసింహప్రసాద్, జి.సృజన, బి.శ్రీకాంత్, డి.రవీంద్ర, కె.శాలిని దేవి, ఎ.దాదాబాషా, బి.విజయసారథి, ఎం.ఏ సుబాబుఈ జాబితాలో ఉన్నారు.

ఆర్థిక సంఘ నిధులపై ఆంక్షలు తొలగించాలి: సర్పంచ్‌లు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను కేంద్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా ఖర్చు చేసుకునే విధంగా ఆదేశాలు జారీచేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సర్పంచ్‌ల సంఘం నేతలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌ను కలిసి గ్రీన్ అంబాసిడర్ జీతాలు, చెత్త సేకరణ వంటి అంశాలకే పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలన్న మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. గతంలోలాగే గ్రామాల్లో సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల భవనాలు, సైడ్ డ్రైయిన్లు, విద్యుత్ పరికరాల కొనుగోలు, మోటారు రిపేర్లు వంటి అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించుకునేలా ఆదేశాలను సడలించాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారు.

'సింహగర్జన'కు అనుమతిచ్చేలా ఆదేశించండి

- హైకోర్టుకు బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తాను నిర్వహించ తలపెట్టిన బీసీ సింహగర్జన బహిరంగ సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఈనెల 22న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బహిరంగ సభ నిర్వహించ తలపెట్టినట్టు సోమవారం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

నేడు ఎయిమ్స్ ద్వితీయ స్నాతకోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ద్వితీయ స్నాతకోత్సవం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎయిమ్స్ ఆడిటోరియంలో జరుగనుంది. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్ సోమవారం మీడియాకు స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ తపన్ కుమార్ సాహా అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవ సభలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్య అతిథిగాను, ఏపీ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి ఎన్టీఆర్ ట్రస్టు ఆసరా

- 30 ఏళ్ల వేడుకలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఎన్టీఆర్ ట్రస్టు ఆసరాగా నిలుస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్టు 30వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి భారీ కేక్ కట్ చేసి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ పేరిట స్థాపించిన ఎన్టీఆర్ ట్రస్టు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. ఒక సంస్థ మూడు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలు అందించడం అసాధారణ విషయమని చెప్పారు. ఎన్టీఆర్ కుమార్తె, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టుకు మేనేజింగ్ ట్రస్టీగా ఉంటూ, కష్టాల్లో ఉన్నవారిని ఒక తల్లిలా ఆదుకుంటున్నారని కొనియాడారు. విద్య, వైద్యం, విపత్తు నిర్వహణ, ఉపాధి కల్పన.. ఇలా అనేక రకాలుగా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. ఎందరో పేద బిడ్డలకు విదేశీ విద్యను కూడా ట్రస్టు అందించిందన్నారు.



టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ప్లకార్డులను ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు

రేపు శ్రీవారి ఆర్జిత సేవల

మే నెల కోటా విడుదల



తిరుమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి మే నెల ఆర్జిత సేవల టికెట్ల కోటాను టీటీడీ బుధవారం విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలకు సంబంధించిన లక్కీడిప్ కోటాను టీటీడీ ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ డిప్ కోసం భక్తులు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 21వ తేదీన ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారసేవ టికెట్లను, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లను విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారికి టోకెన్లు జారీ చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలో గదుల కోటాను విడుదల చేస్తారు. ఇక, ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారిసేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27వ తేదీన విడుదల చేయనున్నారు. భక్తులు వీటిని 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

26 నుంచి శ్రీవారి తెప్పోత్సవాలు

- 20 నుంచి 5 వరకు పుష్కరిణి స్నానాల రద్దు
- 3న చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు తిరుమలలో శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. తెప్పోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సోమవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పుష్కరిణిలో తెప్ప నిర్మాణ పనులు పూర్తిచేసి 23వ తేదీన ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. పుష్కరిణిలో పుష్కలంగా నీరుండేలా చర్యలు తీసుకోవాలని, తెప్ప, పుష్కరిణి ఆకర్షణీయంగా ఉండేలా విద్యుత్ అలంకరణలు చేయాలని ఆదేశించారు. అలాగే వరాహస్వామి ఆలయం, నాలుగుమాడవీధుల్లో పందిళ్లు ఏర్పాట్లు చేయలని.. భక్తులకు సూచనలు అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో అవసరమైన సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇక, తెప్పోత్సవాల సందర్భంగా 20 నుంచి మార్చి 5వ తేదీ వరకు పుష్కరిణిలో స్నానాలకు అనుమతించకూడదని నిర్ణయం తీసుకున్నారు. మార్చి 3వ తేదీన జరుగనున్న కుమారధార తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై కూడా ఆయన అధికారులతో సమీక్షించారు. ఆ రోజు ఉదయం 5 నుంచి 10 గంటలకు వరకే భక్తులకు అనుమతి ఉంటుందన్నారు. అదే రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు చంద్ర గ్రహణం కారణంగా శ్రీవారి ఆలయం మూతపడనుందన్నారు. మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 6.47 గంటల వరకు గ్రహణం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, సువర్ణమ్మ, ఈఈలు శ్రీనివాసరావు, సుధాకర్, వీఎస్వో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భువనేశ్వరి

శింగిరికోనలో నారా భువనేశ్వరి

- నరసింహ స్వామి సేవలో సీఎం సతీమణి

నారాయణవనం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నారాయణవనం మండల పరిధిలోని శింగిరికోనలోని లక్ష్మీ నరసింహ స్వామిని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన హోమంలో పాల్గొని గోశాల, నిత్యన్నదాన సత్రం, నక్షత్రవనాన్ని ప్రారంభించారు. నిత్యన్నదాన సత్రంలో భక్తులకు భోజనం వడ్డించారు. గోశాలలో ఆవులకు గడ్డి అందించారు.

విశాఖ నుంచి పాపికొండలకు పెద్దపులి



విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విశాఖ జంతు ప్రదర్శన శాల పునరావాస కేంద్రంలో ఉన్న పెద్దపులిని శనివారం రంపచోడవరం జిల్లా పరిధిలోని పాపికొండలు జాతీయ అభయారణ్యానికి తరలించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీప ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన పెద్దపులిని ఈ నెల ఆరో తేదీన పట్టుకుని విశాఖలో ఉన్న యానిమల్ రెస్క్యూ సెంటర్‌కు తరలించారు. ఇక్కడ వారం రోజులపాటు పెద్దపులి ఆరోగ్యం, మానసిక స్థితిని వైద్యులు పరిశీలించారు. పెద్దపులి ఆరోగ్యంగా ఉందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో పోలవరం జిల్లా అటవీ శాఖాధికారి ఆధ్వర్యంలో రెస్క్యూ టీమ్ శనివారం వచ్చి పెద్దపులిని తీసుకువెళ్లి పాపికొండల్లోని జాతీయ అభయారణ్యంలో విడిచిపెట్టింది. పాపికొండల అభయారణ్యంలో పెద్దపులులు సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు ఉన్నాయని, అభయారణ్యం సురక్షితంగా ఉంటుందని భావించి పెద్దపులిని అక్కడ విడిచిపెట్టామని విశాఖ సర్కిల్ ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఎం.దివాన్ మైదీన్ తెలిపారు.

పిల్లల్లో నాటుకునే నాడీ సమస్యలు

చైల్డ్ కేర్

పిల్లల్లో ప్రధానంగా మూర్ఛ, ఆటిజం, బ్రెయిన్ స్ట్రోక్ మొదలైన నాడీ సమస్యలుంటాయి. ఈ సమస్యలు జన్యుపరంగా సంక్రమించవచ్చు. పోషక లోపాలు, ప్రమాదాలు ఈ సమస్యలకు దారి తీయవచ్చు. కొన్ని సమస్యల తీవ్రత తక్కువగా ఉండొచ్చు ఇంకొన్ని పిల్లల ఎదుగుదలను దెబ్బతీస్తుంది. కాబట్టి పిల్లల్లో చోటుచేసుకునే నాడీ సమస్యల గురించి అవగాహన ఏర్పరచుకోవడం అత్యవసరం.





పిల్లలు నాడీ సమస్యలను పుట్టుకతోనే వెంటతెచ్చుకోవచ్చు. ఆ సమస్యలు పలు రూపాల్లోనూ ఉండవచ్చు. అయితే సమస్య ఏదైనా దాన్ని సకాలంలో గుర్తించి, సమర్థమైన చికిత్సను అందించగలిగితే, ఈ పిల్లలు కూడా ఆరోగ్యంగా ఎదగగలుగుతారు అంటున్నారు వైద్యులు.

మూర్ఛల్లో రకాలున్నాయి

పుట్టిన రోజు మొదలు పిల్లల్లో మూర్ఛలు కనిపించవచ్చు. మెదడులో అవసరం లేని ఎలక్ట్రికల్ యాక్టివిటీ చోటు చేసుకున్నప్పుడు మూర్ఛలు మొదలవుతాయి.

నెల లోపు పిల్లల్లో: అప్పుడే పుట్టిన పసికందుల్లో కూడా మూర్ఛలు రావచ్చు. వీటి తీవ్రత క్రమేపీ పెరగవచ్చు. మెదడుకు అందే ఆక్సీజన్‌లో కొరత ఏర్పడడం, చక్కెరల మోతాదు తగ్గడం, క్యాల్షియం, మెగ్నీషియం తగ్గడం వల్ల పసికందుల్లో మూర్ఛలు కనిపిస్తాయి. అలాగే మెదడులో రక్తస్రావం వల్ల కూడా మూర్ఛలు కనిపించవచ్చు.

4 నుంచి 8 నెలలు: ఈ వయసు పిల్లల్లో ఎపిలెప్టిక్ స్పాసమ్స్ సాధారణంగా కనిపిస్తూ ఉంటాయి. నిద్ర నుంచి లేచినప్పుడు అకస్మాత్తుగా ఉలిక్కిపడడం ఈ సమస్య ప్రధాన లక్షణం. ఈ సమస్య రెండు నుంచి మూడేళ్ల వయసొచ్చేవరకూ కొనసాగుతుంది. కొందరు పిల్లల్లో జీవితాంతం కొనసాగుతుంది

నెల నుంచి ఏడాది: మెదడు నిర్మాణంలో లోపాలున్నప్పుడు, జన్యు సమస్యలున్నప్పుడు, పోషకాల లోపం ఉన్నప్పుడు ఈ వయసు పిల్లల్లో మూర్ఛలు కనిపించవచ్చు.

ఒకటి నుంచి ఐదేళ్ల లోపు: ఈ వయసు పిల్లలను బినైన్ ఆక్సిపిటల్ ఎపిలెప్సీ వేధించవచ్చు. నిద్ర నుంచి లేవగానే వాంతి చేసుకుంటారు.

4 నుంచి 8 ఏళ్లు: ఈ వయసు పిల్లల్లో బినైన్ సెంట్రో టెంపోరల్ ఎపిలెప్సీ కనిపించవచ్చు. నిద్రలో ఒక నిమిషం పాటు మూర్ఛలు వేధిస్తాయి. పిల్లలకు 10 నుంచి 12 ఏళ్ల వయసొచ్చేటప్పటికి ఈ మూర్ఛలు వాటంతట అవే తగ్గిపోతాయి

మూర్ఛల చికిత్సలు ఇలా...

పసికందుల్లో పోషక లోపాలను భర్తీ చేయడం ద్వారా మూర్ఛలను అదుపు చేయవచ్చు. పెద్ద పిల్లల్లో తలెత్తే బినైన్ ఆక్సిపిటల్ ఎపిలెప్సీని మందులతో అదుపు చేసుకోవచ్చు. బినైన్ సెంట్రో టెంపోరల్ ఎపిలెప్సీలో ఆరు నెలలకోసారి ఏడాదికోసారి మూర్ఛలు వేధిస్తే, ఇఇజి పరీక్ష ఫలితం ఆధారంగా, మందులతో అదుపు చేసుకోవచ్చు. ఏడు నుంచి పదేళ్ల మధ్య పిల్లలకు ఆక్సిపిటల్ ఎపిలెప్సీలో కళ్లు మసకబారడం, తలనొప్పి లాంటి లక్షణాలతో పాటు స్పృహ కూడా కోల్పోతూ ఉంటే, మందులతో చికిత్స చేయవచ్చు. మూర్ఛలు లేకపోయినప్పటికీ మాట్లాడుతూ అకస్మాత్తుగా కొన్ని క్షణాల పాటు ఆగిపోయి మళ్లీ మాట్లాడడం లాంటి లక్షణాలతో కూడిన ఆబ్సెన్స్ ఎపిలెప్సీలో ఇఇజి ఫలితం ఆధారంగా రెండు రకాల మందులతో చికిత్సను అందించవచ్చు. పసికందుల్లో మూర్ఛలు మందులతో సమర్థంగా అదుపులోకొస్తాయి. ఎక్కువ సందర్భాల్లో మళ్లీ తిరగబెట్టకుండా ఉంటాయి. పిల్లల్లో తలెత్తే మూర్ఛలు అంతకంటే ఎక్కువ కాలం కొనసాగే అవకాశాలుంటాయి. వేరే రకాల మూర్ఛలకు దారి తీసే ముప్పు కూడా ఉంటుంది. అయితే మందులు సక్రమంగా వాడుకుంటూ, వైద్యుల సూచనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. మందులు ఆపిన తర్వాత కొన్ని మూర్ఛలు తిరగబెట్టే అవకాశాలు పది శాతం మేరకు ఉంటే, ఇంకొన్ని మూర్ఛలు తిరగబెట్టే అవకాశాలు 20 శాతం మేరకు ఉంటాయి. మెదడు నిర్మాణాల్లో లోపాలతో తలెత్తే మూర్ఛలను మందులతో నియంత్రించలేకపోవచ్చు. అలాంటప్పుడు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన కీటోజెనిక్ డైట్‌తో మూర్ఛల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఒకవేళ మందులతో మూర్ఛలు అదుపులోకి రానప్పుడు మాత్రమే అంతిమ ప్రయత్నంలో భాగంగా వైద్యులు సర్జరీలను ఎంచుకుంటారు.

ఆటిజం అదుపు

ఇది నాడీ అభివృద్ధి రుగ్మత. ఈ సమస్య ఎమ్మారై స్కాన్, రక్తపరీక్షల్లో బయల్పడదు. పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసొచ్చేలోపు పిల్లల మెదడులో 3 లక్షల కోట్ల నాడీ కనెక్షన్లు ఏర్పడతాయి. పిల్లలను ప్రేరేపించేకొద్దీ ఈ కొత్త కనెక్షన్లు ఏర్పడుతూ ఉంటాయి. ఇళ్లలో పిల్లల బాగోగులు చూసే వాళ్లు ఎక్కువ మంది ఉంటే ఈ కనెక్షన్లు ఎక్కువగా ఏర్పడతాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులై ఉండి పిల్లలకు తగినంత సమయం కేటాయించలేప్పుడు పిల్లల్లో ఎదుగుదల లోపాలు ఏర్పడతాయి. అలాగే మూడేళ్ల లోపు పిల్లలకు సెల్‌ఫోన్ లాంటి గ్యాడ్జెట్లను అలవాటు చేయడం వల్ల కూడా ఇవే ఎదుగుదల లోపాలు పెరుగుతాయి. బదులుగా పిల్లలకు మూడేళ్ల వరకూ గ్యాడ్జెట్స్‌ను దూరం చేసి, వాళ్లతో ఎక్కువ సమయం గడుపుతూ, ఎక్కువగా మాట్లాడే ప్రయత్నం చేస్తూ ఉండాలి. మన మాటలు పిల్లలకు అర్థం కావలసిన అవసరం లేదు. అయినా వీలైనంత ఎక్కువగా, మాటలు, పనుల ద్వారా పిల్లలను ఎంగేజ్ చేస్తూ ఉండాలి. ఉద్యోగస్తులైన దంపతులు పిల్లలను ప్లే స్కూల్లో చేర్పించడం మంచిది. బదులుగా పిల్లలకు గ్యాడ్జెట్స్ ఇచ్చినప్పుడు, వాళ్లకు కావలసిన కాలక్షేపం అడగకుండానే చేతికి అందుతోంది కాబట్టి మన మాటలకు, చేతలకూ స్పందించడం మానేస్తారు. గ్యాడ్జెట్స్ వల్ల పిల్లల్లో భాషాపరమైన సమస్యలు, సామాజిక సానుభూతి, ఆత్మీయులతో అనుబంధాల సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో మాటలు ఆలస్యమవుతాయి. తల్లి ఎన్నిసార్లు పిలిచినా పలకరు, స్పందించరు. అకస్మాత్తుగా గట్టిగా అరవడం, ఆడుకుంటున్న తోటి పిల్లలను చూస్తూ ఆ ఆటలో పాల్గొనే ప్రయత్నం చేయరు. ఆగకుండా పరిగెత్తడం, కుదురుగా కూర్చోలేకపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఆటిజం చికిత్స సంక్లిష్టమైనది. ఆటిజంను పూర్తిగా నయం చేసే చికిత్సలు లేకపోయినప్పటికీ, పిల్లలు సాధ్యమైనంత స్వతంత్రంగా జీవించడమే లక్ష్యంగా చికిత్స సాగుతుంది.



పిల్లల్లోనూ బ్రెయిన్ స్ట్రోక్

పుట్టిన పసికందు మొదలు పెద్ద పిల్లల వరకూ ఎవర్లోనైనా బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు. చికెన్‌పాక్స్, హెర్పిస్, మైకోప్లాస్మా లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల ప్రభావం ఫలితంగా పిల్లల్లో బ్రెయిన్ స్ట్రోక్స్ రావచ్చు. అలాగే మోయా మోయా సిండ్రోమ్ అనే జన్యుపరమైన సమస్యల్లో మెదడులోని రక్తనాళాలు సన్నబడిపోవడం ద్వారా రక్తప్రవాహంలో అవరోధం ఏర్పడి ఈ ముప్పు పెరగవచ్చు. అలాగే సికెల్ సెల్ అనీమియాలో కూడా రక్తనాళాలు దెబ్బతిని మెదడు స్ట్రోక్ తలెత్తవచ్చు. కొందరు పిల్లల్లో పుట్టుకతోనే పోషక లోపాల మూలంగా మెదడులోని కొన్ని రక్తనాళాలు గట్టిపడిపోవచ్చు. 6 నుంచి రెండున్నరేళ్ల పిల్లల్లో కూడా పోషకలోపాలు, ఇన్‌ఫెక్షన్లు ఇదే పరిస్థితికి దారితీయొచ్చు. ఇలాంటి సందర్భాల్లో తలకు తగిలే చిన్న దెబ్బలకు ఆ రక్తనాణాలు చిట్లిపోయి రక్తస్రావం జరిగి, మెదడు స్ట్రోక్‌కు గురికావచ్చు. ఈ స్ట్రోక్ వచ్చినప్పుడు పిల్లలు, శరీరంలో ఒక వైపు కాలు, చేతిని లేపలేకపోతూ ఉంటారు. దెబ్బ తగిలిన తర్వాత పిల్లల్లో ఇలాంటి లక్షణాలు కనిపించినా, మూర్ఛలు కనిపించినా ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. 6 నుంచి 24 గంటల్లో మూసుకుపోయిన రక్తనాళాన్ని తెరిచి, రక్తపు గడ్డను తొలగించగలిగితే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. కాబట్టి సాధ్యమైనంత త్వరగా పిల్లలను వైద్యుల దగ్గరకు తీసుకువెళ్లాలి. చికిత్స తర్వాత సాధారణంగా సమస్య శాశ్వతంగా తగ్గిపోతుంది. మోయా మోయా సిండ్రోమ్‌లో సమస్య తిరగబెట్టినా, రీవ్యాస్క్యులరైజేషన్ సర్జరీతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

డాక్టర్ లోకేష్ లింగప్ప, క్లినికల్ డైరెక్టర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడియాట్రిక్ న్యూరోసైన్సెస్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.



మీకు తెలుసా?

పొద్దున్నే తినకపోతే...

ఉదయం అల్పాహారం తినకుండా ఉండడం ద్వారా కొన్ని ప్రయోజనాలను పొందవచ్చు. అవేంటంటే...

ఉదయానికే మన శరీరం 8 నుంచి 10 గంటల ఉపవాసంలో ఉంటుంది. ఇన్సులిన్ తక్కువగా ఉంటుంది. నిల్వ శక్తి అందుబాటులో ఉంటుంది. మరమ్మత్తు వ్యవస్థలు చురుగ్గా ఉంటాయి. కాబట్టి ఆహారం తిన్న వెంటనే ఇవన్నీ మూతపడిపోతాయి. అల్పాహారాన్ని మానుకోవడం వల్ల ఇన్సులిన్ అదుపులో ఉంటుంది. ఇన్సులిన్ తక్కువగా ఉంటే శరీరం తనలో నిల్వ ఉన్న కొవ్వును కరిగించుకుంటుంది. కాబట్టి తిన్న ఆహారాన్ని ఖర్చు చేసుకోడానికి బదులుగా, అప్పటికే నిల్వ ఉన్న కొవ్వును కరిగించుకోవడం ఉత్తమం. ఉదయం ఉపవాసంతో ఫ్యాట్ ఆక్సిడేషన్ పెరుగుతుంది. గ్లూకోజ్ డిపెండెన్స్ తగ్గుతుంది. శక్తి స్థిరంగా ఉంటుంది. ఆహారం అందనప్పుడు కాలేయం కీటోన్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. కీటోన్స్, మెదడుకు సమర్థమైన, శుభ్రమైన ఇంధనం లాంటివి. ఫలితంగా మెదడు చురుకుదనం పెరుగుతుంది. ఆలోచనాశక్తి మెరుగుపడుతుంది. ఆహార కొరత వల్ల మెదడుకు రక్తప్రసరణ పెరుగుతుంది. ఫలితంగా ఆలోచనల్లో స్పష్టత ఏర్పడుతుంది. ఉపవాస సమయంలో శరీరం ఆటోఫజీని ప్రేరేపిస్తుంది. ఇదొక కణశుద్ధి వ్యవస్థ. పాత ప్రొటీన్లు, కణవ్యర్థాలు రీసైకిల్ అవుతాయి. ఆటోఫజీతో కణ సామర్థ్యం పెరుగుతతుంది. కణజాలం నాణ్యత మెరుగుపడుతుంది. ఉపవాసంతో గ్రోత్ హార్మోన్ పెరుగుతుంది. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. కణజాల మరమ్మత్తు సాధ్యపడుతుంది. అయితే ఈ ప్రయోజనాలను పొందడం కోసం కడుపు మాడ్చుకోకూడదు, తక్కువ ఆహారం తినకూడదు, ప్రొటీన్‌ను మానకూడదు. రోజులో తినే మొదటి భోజనాన్ని కాస్త ఆలస్యంగా తినాలి.



పరిశోధన

తన కోపమే తన శత్రువు

8 నిమిషాల కోపం మన రక్తనాళాలను గంట పాటు పక్షవాతానికి లోను చేసి, గుండెపోటు ముప్పును పెంచుతుంది. కోపానికీ గుండెపోటుకూ మధ్య నెలకొని ఉండే అవినాభావ సంబంధమిది. మరిన్ని వివరాలు...

8 నిమిషాల కోపం మన ప్రసరణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఒక అధ్యయనంలో భాగంగా 250 మంది మీద చేపట్టిన ఒక ప్రయోగంలో, కోపాన్ని పెంచే జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నప్పుడు వాళ్లలో రక్తనాళాల వ్యాకోచ లక్షణం 50 శాతానికి క్షీణించినట్టు, ఆ పరిస్థితి ఏకంగా 40 నిమిషాల పాటు కొనసాగినట్టు పరిశోధకులు గుర్తించారు. విషాదం, ఆందోళనలకు గురైనప్పుడు రక్తప్రసరణ వ్యవస్థ చెక్కుచెదరకపోయినా కోపానికి లోనైనప్పుడు రక్తనాళాల్లోని అంతర్గత పొర ఎండోథీలియం బిగుసుకుపోయి, సాగే గుణాన్ని కోల్పోయి, రక్త ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నట్టు వారు కనిపెట్టారు. అయితే అరుదుగా కోపానికి గురవడం వల్ల తీవ్ర ప్రభావం లేకపోయినా, పదే పదే కోపానికి లోనవడం వల్ల రక్తనాళాలు పదే పదే రక్తప్రవాహానికి అవరోధాలు కల్పిస్తూ అంతిమంగా గుండె మీద దుష్ప్రభావాన్ని కనబరిచే ప్రమాదం ఉందనీ, కాబట్టి భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవడం మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యానికీ శ్రేయస్కరమనీ అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన నిపుణులు సూచిస్తున్నారు.



ఆరోగ్య సూత్రాలు

ఆరోగ్యమే మహాభాగ్యం



కుటుంబంలోని అందరి ఆరోగ్యాన్ని పట్టించుకునే మహిళలు తమ ఆరోగ్యం విషయంలో మాత్రం వెనుకబడి ఉంటారు. మీరు ఆరోగ్యంగా ఉంటేనే కదా ఇల్లు నిండుగా ఉండేది. కాబట్టి ఈ చిన్న సూత్రాలు మీ కోసం..

నీటి ప్రాముఖ్యత: చర్మం ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా రోజూ కనీసం 3-4 లీటర్ల నీటిని తాగడం ముఖ్యం. నీటిలో కొన్ని పుదీనా ఆకులు లేదా నిమ్మచెక్కలు వేసుకుని 'డిటాక్స్ వాటర్'లా తాగితే ఇంకా మంచిది.

ఐరన్ ముఖ్యం: మహిళల్లో రక్తహీనత సమస్య ఎక్కువ. అందుకే రోజూ ఒక బెల్లం ముక్క లేదా ఖర్జూరం తినడం అలవాటు చేసుకోండి. ఆకు కూరలను వారానికి మూడుసార్లు ఆహారంలో భాగం చేసుకోండి.

నడక తప్పనిసరి: జిమ్‌కు వెళ్లే సమయం లేకపోతే రోజుకు కనీసం 30 నిమిషాల వేగవంతమైన నడక అలవాటు చేసుకోండి. ఇది ఒత్తిడిని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

తెలుసుకుందాం

ఈ ఉప్పులు నిరర్థకం

హైపోథైరాయిడ్ సమస్య ఉన్నవాళ్లు ప్రత్యేకించి కొన్ని సాల్ట్స్‌ను ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తూ ఉంటారు. కానీ వాస్తవం అందుకు పూర్తి భిన్నం.

అత్యధిక టిఎస్‌హెచ్, తక్కువ టి3, టి4 కలిగి ఉండే హైపోథైరాయిడ్ ఉన్న వాళ్లు అందుబాటులో ఉన్న హిమాలయన్, రాక్, సెల్టిక్ ఇలా పలు రకాల సాల్ట్స్‌ను ఎంచుకుంటూ ఉంటారు. ఇవన్నీ నిరుపయోగకరం. ఎందుకంటే....

హిమాలయన్/పింక్ సాల్ట్: దీన్లో ట్రేస్ మినరల్స్ ఉంటాయి. ఐరన్, మెగ్నీషియం, పొటాషియం తక్కువ మోతాదుల్లో ఉంటాయి. కానీ దీన్లో అయోడిన్ ఉండదు. కాబట్టి ఈ ఉప్పుతో ప్రయోజనం శూన్యం

రాక్ సాల్ట్/సైంధవ లవణం: ఉపవాస సమయాల్లో ఎలక్ట్రొలైట్ బ్యాలెన్స్ కోసం ప్రధానంగా ఉపయోగించేవారు. దీన్లో అయోడిన్ ఉండదు కాబట్టి థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడదు



సెల్టిక్ సాల్ట్: దీన్లో ఖనిజ లవణాలు ఎక్కువ. కాబట్టి హైడ్రేషన్‌కు తోడ్పడుతుంది. కానీ దీన్లో కూడా అయోడిన్ ఉండదు. కాబట్టి థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి సహాయపడదు

బ్లాక్ సాల్ట్/కాలా నమక్: జీర్ణశక్తిని పెంచుతుంది. భోజనానంతర కడుపుబ్బరాన్ని తగ్గిస్తుంది. దీన్లో కూడా అయోడిన్ ఉండదు. కాబట్టి థైరాయిడ్ గ్రంథికి ఉపయోగపడదు

అయొడైజ్డ్ సాల్ట్

టి3, టి4 హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడేలా రూపొందిన ఉప్పు ఇది. గోయిటర్, హైపోథైరాయిడిజంలను నివారిస్తుంది. ప్రత్యేకించి గర్భిణులకు ప్రయోజనకరం. గర్భంలో పెరిగే బిడ్డ మెదడు ఎదుగుదలకు తోడ్పడుతుంది. మన థైరాయిడ్ గ్రంథి అందంగా కనిపించే ఉప్పులతో ప్రయోజనం పొందదు. దానికి అయోడిన్ అవసరం. కాబట్టి 80 నుంచి 90% అయోడిన్ కలిగిన ఉప్పుతో పాటు అదనపు పోషకాల కోసం 10 నుంచి 20% ఇతర ఉప్పులను కలిపి వాడుకోవడం మంచిది.

ప్రొటీన్ వంటకాలు

పసందైన ప్రొటీన్

కండర నిర్మాణానికీ, వ్యాధినిరోధకశక్తి మెరుగుదలకూ, కణజాల మరమ్మత్తుకూ, ఎంజైమ్స్, హార్మోన్స్ ఉత్పత్తికీ ప్రొటీన్లు అవసరం. కాబట్టి ప్రతి రోజూ తినే ఆహారం ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ప్రొటీన్ పొందే ప్రయత్నం చేస్తూ ఉండాలి. అందుకోసం 20 గ్రాముల ప్రొటీన్‌ను అందించే పదార్థాల గురించి తెలుసుకుందాం!

ప్రొటీన్ ప్రయోజనాల గురించి తెలిసినా, సరిపడా ప్రొటీన్‌ను పదార్థాల ద్వారా ఎలా పొందాలో, ప్రొటీన్ పుష్కలంగా ఉండే వంటకాలను ఎలా తయారుచేసుకోవాలో అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. అయితే నిజానికి తక్కువ శ్రమతో ఎక్కువ ప్రొటీన్‌ను అందించే వంటకాలు చాలా ఉన్నాయి. అవేంటంటే...



పన్నీర్: వంద గ్రాముల పన్నీర్‌తో 20 గ్రాముల ప్రొటీన్ దక్కుతుంది. అందుకోసం పచ్చి పన్నీర్ తినొచ్చు. లేదా గ్రిల్ చేసి, కూరల్లో కలుపుకుని, సలాడ్ రూపంలో, పరోటాలతో కలిపి తినొచ్చు

ఉడకబెట్టిన గుడ్లు: మూడు పెద్ద గుడ్లతో 20 గ్రాముల ప్రొటీన్ పొందవచ్చు. త్వరగా ప్రొటీన్ పొందే వీలున్న సులభమైన మార్గమిది. కాబట్టి బ్రేక్‌ఫాస్ట్ లేదా ఈవినింగ్ స్నాక్‌గా గుడ్లు తీసుకోవచ్చు

చికెన్ బ్రెస్ట్: వంద గ్రాముల చికెన్ బ్రెస్‌లో 20 నుంచి 22 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. తక్కువ కొవ్వును కలిగి ఉండే ఈ ప్రొటీన్ సోర్స్‌ను కండర సాంద్రతను పెంచుకోవాలనేవారు, బరువు తగ్గించుకోవాలనుకునేవారూ ఎంచుకోవచ్చు

ఉడికించిన పప్పు: కందులు, పెసలు, బొబ్బర్లు ఏవైనా ప్రొటీన్ వనరులే! కాబట్టి ఒకటిన్నర కప్పు పప్పుతో 18 నుంచి 20 గ్రాముల ప్రొటీన్ పొందే ప్రయత్నం చేయాలి. పప్పును క్వినోవా, అన్నంతో కలిపి తినొచ్చు

గ్రీక్ యోగర్ట్: 200 గ్రాముల గ్రీక్ యోగర్ట్‌లో 20 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అయితే ఈ యోగర్ట్ తీయగా ఉండకూడదు. దీన్ని సాదాగా లేదా పండ్లతో కలిపి తినొచ్చు

సోయా: 50 గ్రాముల సోయా చంక్స్ 20 గ్రాముల ప్రొటీన్‌ను అందిస్తాయి కాబట్టి కూరగాయలతో కలిపి కూరగా వండుకోవచ్చు

ప్రొటీన్ షేక్: వే లేదా వృక్షాధారిత ప్రొటీన్ షేక్స్ తీసుకోవచ్చు. అందుకోసం ఒక స్కూప్ ప్రొటీన్ పౌడర్‌ను నీళ్ల లేదా పాలతో కలిపి తీసుకోవాలి

మరిన్ని చిట్కాలు

- బ్రేక్‌ఫాస్ట్‌లో పన్నీర్ లేదా ఉడకబెట్టిన గుడ్లు తినాలి
- వేయించిన సెనగలు లేదా గ్రీక్ యోగర్ట్ లేదా ప్రొటీన్ స్మూదీలను స్నాక్‌గా తీసుకోవచ్చు
- దాల్, సోయా, లేదా మొలకలను లంచ్ లేదా డిన్నర్‌లో చేర్చుకోవచ్చు
- క్వినోవా లేదా మిల్లెట్స్‌ను పప్పుతో కలిపి తీసుకోవచ్చు
- చియా, అవిసె గింజలను సలాడ్స్‌లో లేదా పెరుగులో కలిపి తినొచ్చు

కేవలం వ్యాయామాలు చేసేవాళ్లు మాత్రమే ప్రొటీన్ తీసుకోవాలన్నది అపోహ మాత్రమే! ప్రొటీన్ ప్రతి ఒక్కరికీ అవసరమే! కాబట్టి సరైన పదార్థాలను ఎంచుకుంటే ప్రొటీన్ సరిపడా అందుతుంది. మూడు భోజనాల్లో ప్రొటీన్ సమంగా ఉండేలా చూసుకోవాలి. లేదా కనీసం ఒక భోజనంలోనైనా ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్ సరిపడా తీసుకున్నప్పుడు రోజంతా హుషారుగా, చలాకీగా, దృఢంగా, అన్నిటికీ మించి ఆరోగ్యంగా ఉండగలుగుతాం!

పోషణ

మొలకల్లో మతలబులు

మొలకలు పోషకాల భాండాగారాలు. అయితే ఆ పోషకాలను శరీరం గరిష్ఠంగా శోషించుకోగలగాలంటే మొలకల విషయంలో కొన్ని నియమాలను పాటించాలంటున్నారు పోషకాహార నిపుణులు.

గింజలు మొలకెత్తినప్పుడు వాటిలోని పోషకాల అరుగుదలకూ, శోషణ పెరుగుతుంది. అన్ని గింజల్లో ఫైటేట్స్ అనే జీర్ణం కాని పోషకాలుంటాయి. ఇవి మనకు అవసరమే అయినా శక్తినిచ్చే ఇతర సూక్ష్మ పోషకాల శోషణకు ఫైటేట్స్ అడ్డుపడతాయి. కాబట్టి వీటి ప్రభావాన్ని తగ్గించడం కోసం గింజలను నానబెట్టుకోవాలి. మన శరీరం సమర్థంగా నూటికి నూరు శాతం ఐరన్‌ను శోషించుకోలేదు. దీనికి పలు కారణాలు లేకపోలేదు. కాబట్టి ఈ ఇబ్బంది లేకుండా ఉండడం కోసం గింజలను నానబెట్టి, మొలకెత్తించి తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల తేలికగా జీర్ణమవడంతో పాటు, పోషకశోషణకు అడ్డుపడే అంశాల మోతాదు తగ్గిపోతుంది.

రాగి మాల్ట్ మెరుగు

రాగులను మొలకెత్తించి, ఆరబెట్టి, దోరగా వేయించి పిండిలా దుంచుకోడాన్ని మాల్టింగ్ అంటారు. ఇలా చేయడం వల్ల రాగుల్లోని పిండిపదార్థాలు మాల్ట్‌గా మారిపోతాయి. ఈ ప్రక్రియ కూడా పోషకాల శోషణకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది కాబట్టి శక్తి మోతాదులు పెరుగుతాయి. సాధారణ రాగి జావతో పోల్చితే, రాగి మాల్ట్‌తో పొందే పోషక ప్రయోజనం రెట్టింపు ఉంటుంది. వంద గ్రాముల రాగుల్లో 300 క్యాలరీలుంటే, వాటిని మొలకెత్తించకుండా తీసుకున్నప్పుడు ఆ క్యాలరీలన్నీ శరీరానికి అందవు. కానీ మొలకెత్తించి తీసుకున్నప్పుడు శరీరానికి అందే క్యాలరీల పరిమాణం పెరుగుతుంది.



మధుమేహులు అప్రమత్తంగా...

తొందరగా అరిగి, తొందరగా శోషణ చెందుతాయి. దాంతో రక్తంలో చక్కెర పెరిగిపోతుంది కాబట్టి మధుమేహులు మొలకలను సలాడ్‌తో కలిపి పరిమితంగా తీసుకోవాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే రాగి జావ కూడా మధుమేహులు పరిమితం చేసుకోవాలి. అలాగే అనీమియాతో బాధపడేవారు, బాడీ మాస్ ఇండెక్స్ తక్కువగా ఉన్నవారు అర కప్పు నుంచి ముప్పావు కప్పు వరకూ మొలకలు తీసుకోవచ్చు. అలాగే పెద్దలు మొలకలను నేరుగా కాకుండా పిండి రుబ్బి దోసెల రూపంలో తీసుకోవడం ఉత్తమం. క్యాన్సర్ రోగులు ఆవిరి మీద ఉడికించిన మొలకలు తినడం ఆరోగ్యకరం. ఆరోగ్యవంతులు మొలకలను నేరుగా తినాలి.

ఎంత పెద్ద మొలక

గింజలను మొలకెత్తించే విషయంలో, మొలక ఎంత పొడవు పెరిగిన తర్వాత తినాలి అనే విషయంలో పలు అనుమానాలుంటాయి. అయితే గింజ మొలకెత్తినప్పుడు దాని పొడవును బట్టి పోషకాల పరిమాణం కూడా మారుతూ ఉంటుంది. అయితే అరంగుళం నుంచి అంగుళం పొడవు పెరిగిన మొలకలను ఎంచుకోవడం మంచిది. అలాగే వాటిని నానబెట్టే నీళ్ల పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మొలకెత్తిన గింజలను ఫ్రిజ్‌లో జాగ్రత్తగా భద్రపరుచుకుని తినాలి. అలాగే బూజు పట్టే అవకాశం ఎక్కువ కాబట్టి మొలకలను వీలైనంత జాగ్రత్తగా మొలకెత్తించుకోవాలి. సూపర్‌మార్కెట్లలో దొరికే మొలకల కోసం ఏ నీళ్ల ఉపయోగించారో, ఎలాంటి పరిసరాల్లో మొలకెత్తించారో తెలియదు కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిది.

నానబెట్టడం ఉత్తమం

ఉలవలు, శనగలు, పెసలు, బొబ్బర్లు... ఇలా ఏ గింజకైనా ఈ సూత్రం వర్తిస్తుంది. వీటిని నానబెట్టి, మొలకెత్తించి, వాడుకోవాలి. మిల్లెట్స్‌ను కూడా నేరుగా వండుకోకూడదు. వాటిని కూడా రాత్రంతా నానబెట్టుకుంటే, పోషక శోషణ పెరుగుతుంది.

డాక్టర్ లత శశి,
చీఫ్ న్యూట్రిషనిస్ట్,
ఫెర్నాండెజ్ హాస్పిటల్,
హైదరాబాద్



నా వ్యక్తిగత జీవితాన్ని వివాద వస్తువుగా మార్చొద్దు!

» ఉన్నత పదవిలో ఉంటూ అసహ్యకరమైన వ్యాఖ్యలా?

» తమిళ బీజేపీ అధ్యక్షుడిపై సినీ నటి త్రిష ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఇటీవల టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్లో తన పేరు ప్రస్తావించడంపై సినీ నటి త్రిష తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. 'తమిళ రాజకీయాల్లో ఉన్నతమైన పార్టీ పదవిలో ఉంటూ ఇంతటి అసహ్యకరమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేస్తారని నేను ఊహించలేదు' అంటూ మండిపడ్డారు. ఇటీవల నయినార్ నాగేంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ 'విజయ్‌కి ఏమీ తెలియదు. అతనికి అనుభవం లేదు. ముందుగా అతను తన ఇంటి నుంచి బయటకు వచ్చి చూడమనండి. అంతకంటే ముందు అతను త్రిష నుంచి దూరమైతేనే వాస్తవాలను గ్రహించగలడు' అని వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో త్రిష.. నయినార్ నాగేంద్రన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె తరపున న్యాయవాది సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏ రాజకీయ పార్టీతోనూ త్రిషకు సంబంధాలు లేవని, అలా ఉండాలనే ఉద్దేశం కూడా లేదని స్పష్టంచేశారు. తానెప్పుడూ రాజకీయాలకు దూరంగా ఉంటానని, అన్ని పార్టీలతో తటస్థ వైఖరినే అవలంబిస్తానని పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఒక వివాద వస్తువుగా మార్చొద్దని ఆమె నయినార్ నాగేంద్రన్‌కు హితవు పలికారు. కాగా, అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో నయినార్ నాగేంద్రన్ విచారం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో నటి త్రిష గురించిన మాట తప్పుగా దొర్లిందన్నారు.

ప్రాణదాత.. ఆ 10నెలల బిడ్డ!

» కేరళలో రోడ్డు ప్రమాదంలో ఆడ శిశువు బ్రెయిన్‌డెడ్

» కళ్లు, కిడ్నీలు, గుండె, కాలేయం సేకరణ

తిరువనంతపురం, ఫిబ్రవరి 16: పది నెలల శిశువు.. తీవ్రగాయాలతో తుదిశ్వాస విడుస్తూనే మరో నలుగురికి ఊపిరిలూదింది! ఆ బిడ్డ తల్లిదండ్రుల ఔదర్యమూ గొప్పదే. ఉబికివస్తున్న కన్నీటిని దిగమింగుకొని తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు వారు ముందుకొచ్చారు. ఆ పాప నుంచి వైద్యులు కాలేయం, కళ్లు, కిడ్నీలు, గుండె కవాటాన్ని సేకరించి నలుగురు పిల్లలకు అమర్చి వారికి కొత్త జీవితాన్నిచ్చారు. కేరళలోని ఎర్నాకులంలో ఈ ఘటన జరిగింది. ఆ చిన్నారి దాత పేరు ఆలెన్ షెరీన్ అబ్రహాం! కేరళలో అతిపిన్న వయసులో అవయవదానం చేసింది షెరీనే కావడం విశేషం.! కొట్టాయంలో ఫిబ్రవరి 5న రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో షెరీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. జీవన్‌దాన్ బృందం అవగాహన కలిగించిన మీదట తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ఒప్పుకొన్నారు. ఫిబ్రవరి 13న షెరీన్ అవయవాలను సేకరించి నలుగురు చిన్నారులకు అమర్చారు.

కలుషిత నీటితో 15 రోజుల్లో 12 మరణాలు

» మృతుల్లో ఐదుగురు చిన్నారులు..హరియాణాలో కలకలం

చండీగఢ్, ఫిబ్రవరి 16: హరియాణాలోని పాల్వాల్ జిల్లా చాయన్సా గ్రామంలో కలుషిత తాగునీటి కారణంగా అంటువ్యాధులు వ్యాప్తిచెందుతుండడం కలకలం రేపుతోంది. గత 15 రోజుల్లో ఐదుగురు పిల్లలు సహా మొత్తం 12మంది మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో అనేక మంది కామెర్లు, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. ఈ ఘటనతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. 865 కుటుంబాలు, సుమారు 5700 జనాభా ఉన్న ఈ గ్రామంలో వైద్యశిబిరాలు, ఇంటింటి సర్వేలు, స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఇప్పటివరకు 107 ఇళ్ల నుంచి తాగునీటి నమూనాలు సేకరించగా, వాటిలో 23 నమూనాల్లో ప్రమాదకర బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు.

రసాయన ఫ్యాక్టరీలో పేలుడు..ఏడుగురి మృతి

భివాడి, ఫిబ్రవరి 16: రాజస్థాన్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భివాడి పట్టణంలోని ఓ రసాయన కర్మాగారంలో భారీ పేలుడు సంభవించడంతో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. ఖుష్ఖేరా-కరోలి పారిశ్రామిక ప్రాంతంలోని దుస్తుల కర్మాగారంలో సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. అయితే, దుస్తుల కర్మాగారం పేరుతో నడుస్తున్న ఈ భవనంలో అక్రమంగా బాణసంచా తయారుచేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో సుమారు 20 మందికి పైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం. పేలుడు సంభవించగానే చాలామంది బయటకు పరుగులు తీసినప్పటికీ, తొమ్మిది మంది లోపలే ఉండిపోయారు. వీరిలో ఏడుగురు మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

తుది దశకు భారత్- అమెరికా ట్రేడ్ డీల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే దీనిపై మధ్యంతర ఒప్పందం ఖరారు కాగా, పూర్తిస్థాయి బీటీఏలో న్యాయపరమైన అంశాలపై చర్చలు జరిపేందుకు భారత ప్రతినిధి బృందం ఈ నెల 23న అమెరికా వెళ్లనుందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగ్రవాల్ సోమవారం మీడియాకు తెలిపారు. భారత్ తరఫున చర్చల ప్రధాన ప్రతినిధి, వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి దర్పన్ జైన్ నేతృత్వంలో వెళ్లనున్న ఈ ప్రతినిధి బృందం, అమెరికా ప్రతినిధులతో బీటీఏ న్యాయపరమైన అంశాలపై చర్చలు జరుపుతుందని చెప్పారు.

'న్యూస్‌క్లిక్'కు ఈడీ 184 కోట్ల పెనాల్టీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్తా సంస్థ 'న్యూస్‌క్లిక్', దాని ఎడిటర్ ఇన్ చీఫ్‌లకు ఈడీ రూ.184 కోట్ల కోట్ల పెనాల్టీ విధించింది. న్యూస్‌క్లిక్ న్యూస్ పోర్టల్‌ను నిర్వహిస్తున్న 'పీపీకే న్యూస్‌క్లిక్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్'కు రూ.120 కోట్లు, ఆ సంస్థ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థకు రూ.64 కోట్ల జరిమానా విధించినట్లు సోమవారం ప్రకటించింది. ఈ సంస్థపై మనీలాండరింగ్ ఆరోపణలు రావటంతో 2021 సెప్టెంబరులో ఢిల్లీలోని సైదులజబ్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల అనంతరం ఈ సంస్థ ఫెమాను ఉల్లంఘించినట్లు ఈడీ ప్రకటించింది.

సర్వజన క్షేమానికి పరిష్కారాలు కనుగొందాం

టెక్ నిపుణులకు ప్రధాని పిలుపు

» ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సోమవారం సాయంత్రం ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026ని ప్రారంభించారు. ఏఐ సాయంతో సర్వజన సంక్షేమానికి పరిష్కారాలు కనుగొనాలని టెక్ నిపుణులకు పిలుపునిచ్చారు. "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" అన్నదే ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026 థీమ్ అని ఉదయం ఎక్స్‌లో పోస్ట్ చేసిన సందేశంలో ప్రధాని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన, వ్యాపార రంగాల్లో సంపూర్ణ పరివర్తనకు ఏఐ దోహదపడుతున్నట్టు తెలిపారు. ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించిన తర్వాత మోదీ ఎక్స్‌పోలో కలియతిరుగుతూ పలువురు స్టాల్ నిర్వాహకులతో సంభాషించారు. సోమవారం ప్రారంభమైన ఈ ఎక్స్‌పో 4రోజుల పాటు జరుగుతుంది. 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఎక్స్‌పో ఏర్పాటయింది. ప్రపంచ టెక్నాలజీ సంస్థలు, స్టార్టప్‌లు, విద్య, పరిశోధన సంస్థలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, అంతర్జాతీయ భాగస్వాములు ఎక్స్‌పోలో పాల్గొన్నారు. ఈ సదస్సుకు హాజరయ్యే ప్రముఖుల్లో సుందర్ పిచాయ్, శామ్ ఆల్ట్‌మన్(ఓపెన్ ఏఐ), డరియో అమోదీ(ఆంత్రోపిక్) ఉన్నారు. వారి సెషన్లు బుధవారం నుంచి ప్రారంభం కావచ్చునంటున్నారు. చివరి రెండు రోజుల్లో 20కి పైగా దేశాల అధినేతలు హాజరు కానున్నారు. ఎక్స్‌పోకు హాజరు కానున్న దేశాధినేతల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియా లులా డ సిల్వా ఉన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు ఏఐ అనే అంశంపై వారంతా తమ అభిప్రాయాలు పంచుకోనున్నారు.



ఏఐ ఎక్స్‌పోలో స్టాళ్లను పరిశీలిస్తున్న మోదీ

త్వరలో "క్రియేట్ ఇన్ ఇండియా" మిషన్

పరిశ్రమ సామర్థ్యాల పెంపు, ఉపాధి కల్పన, భవిష్యత్ సంసిద్ధత గల ప్రతిభావంతుల తయారీ లక్ష్యంగా త్వరలో క్రియేట్ ఇన్ ఇండియా పేరిట ఒక కార్యక్రమం ప్రారంభించనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. తమ ప్రస్తుత సామర్థ్యాలను పటిష్ఠం చేయడంతో పాటు ప్రపంచానికి ప్రాధాన్యతా వేదికగా భారత్ మారేందుకు ఇది వీలు కల్పిస్తుందన్నారు. ఇన్నోవేషన్‌కు ఏఐ ముప్పు అన్న వాదాన్ని ఆయన తోసిపుచ్చారు. కొత్త టెక్నాలజీని స్వీకరించడం అంటే చేపను నీటిలోకి తీసుకెళ్లడం అని ఆయన అన్నారు.

ఏఐ వినియోగంతో తస్మాత్ జాగ్రత

ఏఐ పరికరాల వినియోగం విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చెంది, ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడే ముప్పు ఉన్నదన్నారు. ఏఐ వినియోగం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల అధ్యయన సామర్థ్యాలు విశేషంగా పెరిగినా విమర్శనాత్మకమైన ఆలోచనలు, ఉత్సుకతలు నీరుగారిపోకుండా చూసుకోవలసిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. కృత్రిమ మేధ రెండు వైపులా పదునున్న కత్తి వంటిదని ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారు అజయ్ కుమార్ సూద్ అన్నారు. బాలల వికాసంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

సినిమా దిశను మార్చుతోంది: రానా

ఏఐ సినిమా ప్రపంచ దిశను మార్చుతోందని నటుడు రానా దగ్గుబాటి అన్నారు. సినిమాపై అనిశ్చితిని తొలగించి సృజనాత్మక నిర్ణయాలకు ఏఐ పదును పెడుతుందన్నారు. విజువల్ ఎఫెక్ట్స్ చిత్రీకరణకు గతంలో 3-5 రోజుల వ్యవధి పట్టేదని, ఏఐ సహాయంతో ఇప్పుడు 2-3 గంటల వ్యవధిలోనే వాటిని చిత్రీకరించగలుగుతున్నారని చెప్పారు. వాస్తవానికి ప్రస్తుత ఏఐ ప్రపంచంలో చిత్ర నిర్మాత షూటింగ్ ప్రారంభం కావడం కన్నా ముందే తన సినిమాను వీక్షించగలుగుతున్నట్టు రానా తెలిపారు.

ఐటీ కంపెనీలు ఐదేళ్లలో గాయబ్!


» మనిషి కన్నా మెరుగ్గా పనిచేసే ఏఐ టూల్స్ వస్తాయి

» సన్ మైక్రోసిస్టమ్స్ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఏఐ ప్రపంచంలో రెండు భిన్న కోణాలను భారతీయ ఐటీ దిగ్గజం, సన్ మైక్రోసిస్టమ్స్ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా ఆవిష్కరించారు. ఒక పక్క సామాన్యుల విద్య, వైద్యం, న్యాయ సహాయం అవసరాలను కారుచౌకగా తీర్చే సామర్థ్యాన్ని సంతరించుకుంటున్న కృత్రిమ మేథ(ఏఐ) అదే సమయంలో లక్షల మందికి వైట్ కాలర్ ఉపాధి అందిస్తున్న భారతీయ ఐటీ సేవల రంగానికి సమాధి కట్టనుందని ప్రకటించారు. సోమవారం ఆయన ఒక మీడియా సంస్థతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఐటీ, బీపీవో కంపెనీల స్థానాన్ని ఏఐ ఆక్రమిస్తుందని అంచనా వేశారు. ఐదేళ్లలో ఈ కంపెనీలన్నీ దాదాపుగా అదృశ్యం అయిపోతాయని చెప్పారు. డబ్బు సంపాదనకు మనిషి చేస్తున్న పనుల్లో చాలావరకు ఏఐ మనిషికన్నా మెరుగ్గా చేసే పరిస్థితి వస్తుందని, ఈ దిశగా ఏఐ వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్‌గా ఉన్న ఏఐ కొద్ది రోజుల్లోనే స్వతంత్ర ఏఐ వర్కర్‌గా రూపుదిద్దుకుంటుందని అన్నారు. దాంతో ప్రత్యేక నిపుణత అవసరం ఉన్న న్యాయవాద, వైద్య, చిప్ డిజైనింగ్ వృత్తుల్లో వచ్చే రెండు దశాబ్దాల్లో సమూల మార్పులు వస్తాయని అంచనా వేశారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ విప్లవాలతో పోలిస్తే ప్రస్తుత ఏఐ విప్లవం పూర్తిగా విభిన్నమైనదని చెప్పారు. "అవి కొత్త వ్యాపారాలను ఆవిష్కరిస్తే ఇది ఏకంగా మేధో శ్రమను పునఃసృష్టించింది. దీనివల్ల వచ్చే ఐదేళ్లలో ఉత్పత్తిరంగంలో వినూత్న పరిణామాలు సంభవిస్తాయి" అన్నారు. భారతీయులు అవుట్ సోర్సింగ్ సేవల నుంచి ఏఐ ఆధార ఉత్పత్తులు, సేవలకు మారాలని సూచించారు. నిత్య జీవిత సేవల ఖర్చును ఏఐ బాగా తగ్గించగలదని ఖోస్లా అంచనా వేశారు. అత్యంత నాణ్యమైన వైద్యం, విద్య, న్యాయ సహాయం, ఇతర జ్ఞాన సంధ సేవలు కారుచౌకగా ప్రజలకు అందుతాయని అన్నారు. తరానికి ఒకసారి వచ్చే అతిపెద్ద మార్పుల్లో ఏఐ ఒకటని ఆయన అన్నారు.

లోకం తీరు



సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టింది 34,855 కోట్లు

వాటిలో 12,229 కోట్లను అటాచ్ చేశాం: ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశంలో వివిధ మార్గాల్లో సైబర్ క్రిమినల్స్ కాజేసిన మొత్తం రూ.34,855 కోట్లు ఉంటుందని ఈడీ గుర్తించింది. వాటిలో ఇప్పటి వరకు రూ.12,229 కోట్లను అటాచ్ చేసినట్టు ఈడీ అధికారి ఒకరు వెల్లడించారు. సైబర్ నేరాలకు సంబంధించి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద నమోదైన 234 కేసుల్లో ఎక్కువ శాతం సొమ్ము.. మ్యూల్ ఖాతాలు, షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ, హవాలా మార్గాల ద్వారా నిర్వహిస్తున్నట్టు గుర్తించామని ఆ అధికారి తెలిపారు. గతవారం ఢిల్లీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్... 'సైబర్ ఆధారిత మోసాలను అరికట్టడం, వాటి వ్యవస్థను ఛేదించడం' పేరిట నిర్వహించిన జాతీయ సమావేశంలో ఈడీ ఈ వివరాలు వెల్లడించింది.

400 కోట్ల దోపిడీ కేసు కొట్టివేత!

బెంగళూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బెళగావి జిల్లాలో రూ.400 కోట్ల నగదు దోపిడీ' కేసును కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో సరైన ఆధారాలు లేవని, నేరాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని మహారాష్ట్రలోని ఇగాత్పురి కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. అరెస్టు అయిన ఏడుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసు దర్యాప్తునకు ఏర్పాటైన సిట్.. ఫిర్యాదుకు, దర్యాప్తులో తేలిన అంశాలకు పొంతనలేదని తేల్చింది. దోపిడీపై మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ చేసిన ఫిర్యాదే అబద్ధమని పేర్కొంది. అయితే, అతనిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

బాగేపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి ఎన్నిక రద్దు

» కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు



బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ఎన్నికను హైకోర్టు ధర్మాసనం రద్దు చేసింది. ఈ సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు, శాసనసభ కార్యదర్శికి పంపాలని సోమవారం ఆదేశించింది. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో సుబ్బారెడ్డి సమర్పించిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆస్తి వివరాలను దాచి పెట్టారని, సమగ్రంగా సమర్పించలేదని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని బీజేపీ అభ్యర్థి మునిరాజు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి జస్టిస్ ఎంజీఎస్ కమల్ ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అనర్హుడని సోమవారం తీర్పునిచ్చింది. రెండో స్థానంలో ఉన్న మునిరాజును ఎమ్మెల్యేగా ప్రకటించేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఉన్నత న్యాయస్థానానికి వెళ్లేందుకు వీలుగా, ఆదేశాలను నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తరఫు న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. దీంతో ధర్మాసనం మధ్యంతర స్టేను విధించింది. దీంతో ఎమ్మెల్యే సుబ్బారెడ్డికి తాత్కాలిక ఊరట లభించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని ఎమ్మెల్యే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు పిటిషన్‌ను స్వీకరించి, ఆదేశాలపై స్టే విధించినా, రద్దు చేసినా ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతారు. లేనిపక్షంలో ఆయన ఎన్నిక రద్దు అవుతుంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుబ్బారెడ్డికి 82 వేల ఓట్లు, బీజేపీ అభ్యర్థి మునిరాజుకు 62 వేల ఓట్లు దక్కాయి.

ఆలయాల్లో మహిళల ప్రవేశంపై 9మంది సభ్యుల బెంచ్

» మసీదులు, ఇతర ప్రార్థన స్థలాలపైనా పరిశీలన

» మునుపటి తీర్పుపై సుప్రీంకోర్టు సమీక్ష



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: శబరిమలలోని అయ్యప్ప దేవాలయం సహా, ఇతర ప్రార్థన స్థలాల్లో మహిళల ప్రవేశానికి సంబంధించిన అంశంపై తుది విచారణకు 9మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశాన్ని అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై సమీక్ష జరపనుంది. ఆ తీర్పుకు అనుకూలంగా కొన్ని, ప్రతికూలంగా మరి కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిపై విచారణకు 9మంది సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఏప్రిల్ 7న వాదనలు మొదలయి 22న ముగుస్తాయని పేర్కొన్నారు. మార్చి 14లోగా లిఖితపూర్వక వాదనలు సమర్పించాల్సి ఉంటుంది. తీర్పును సమీక్షించాలని కోరుతున్న పక్షాల తరఫున న్యాయవాది కృష్ణ కుమార్ సింగ్ నోడల్ కాన్సెల్‌గా, వ్యతిరేకిస్తున్న వారి తరఫున న్యాయవాది శాశ్వతి పారి నోడల్ కాన్సెల్‌గా వ్యవహరిస్తారని సీజేఐ తెలిపారు. సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్, న్యాయవాది శివం సింగ్‌లు కోర్టు మిత్రులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వివిధ ఆచారాల వెనుక ఉన్న మతస్వేచ్ఛపైనా సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. శబరిమలలో 10-50ఏళ్ల వయసు ఉన్న మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ 2018లో 4:1మెజార్టీతో అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ప్రార్థన స్థలాల్లో మహిళల పట్ల ఉన్న వివక్షను అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలని 2019లో మరో అయిదుగురు సభ్యుల ధర్మాసనం నిర్ణయించింది. దీంట్లో మసీదులు, దర్గాల్లో మహిళల ప్రవేశం, పార్సీ మహిళల సమస్యలు కూడా ఉన్నాయి. ఇలాంటి సమస్యలపై విస్తృత ధర్మాసనాలు ఏర్పాటు చేసే అధికారం ఉందంటూ 2020లో ఇంకో అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అయితే కరోనా కారణంగా అప్పట్లో విస్తృత ధర్మాసనం ఏర్పాటు కాలేదు. దాన్ని ఏర్పాటు చేస్తూ తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకొంది. ఈ నేపథ్యంలో వైఖరిని స్పష్టం చేస్తూ సరైన అఫిడవిట్‌ను కోర్టులో సమర్పించాలని కేరళలోని పినరయ్ విజయ్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్, బీజేపీలు డిమాండు చేశాయి.

డాటా ప్రొటెక్షన్ చట్టంపై నోటీసులు

డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టం-2023ను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై సమాధానం ఇవ్వాలని సీజేఐ ఆధ్వర్యంలోని ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. అయితే నిబంధనల అమలుపై స్టే మంజూరుకు మాత్రం నిరాకరించింది. నిబంధనల్లోని 'విశ్వాస పాత్రత'కు సంబంధించిన క్లాజులపై పిటిషనర్లు అనుమానాలు వ్యక్తం చేశారు. దీని కింద కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సమాచారాన్నయినా తీసుకునేందుకు అవకాశాలు ఉండడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆధార్ కార్డుపై ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఆధార్ కార్డు స్వరూపం మారబోతోంది. ఉడాయ్ ఈమేరకు కార్డు డిజైన్‌ను పూర్తిగా మార్చబోతోంది. పలు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కార్డుపై కార్డుదారుని ఫొటో, క్యూఆర్ కోడ్‌లు మాత్రమే ఉంటాయి. ఆధార్ ఆధారంగా జరుగుతున్న నేరాలు... సిమ్ కార్డు మోసాలు, అనధికారిక రుణాలు, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ ద్వారా నగదు తీసుకోవడం వంటి వాటిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఉడాయ్ ఈమార్పులు తీసుకువస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇప్పటి వరకూ అధికారిక నిర్ధారణ ఏదీ లేదు. అయితే తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన కొత్త ఆధార్ యాప్‌లోని ఫీచర్లను పరిశీలిస్తే ఈ విషయం సూచనా ప్రాయంగా అర్థమవుతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌లో సంబంధిత వ్యక్తి పూర్తి సమాచారం ఉంటుంది.

పెళ్లికి ముందు ఎవర్నీ నమ్మొద్దు!

» శారీరక సంబంధాల విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: వివాహానికి ముందు శారీరక సంబంధాల విషయమై అమ్మాయిలు, అబ్బాయిలు అప్రమత్తంగా ఉండాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, బాధిత యువతి ఇద్దరు ఏకాభిప్రాయంతోనే శారీరకసంబంధం కలిగి ఉన్నట్లు కనిపిస్తోందని.. ఇలాంటి కేసులు విచారించేందుకు, శిక్షలు విధించేందుకు తగినవి కావని పేర్కొంది. ఇరు పక్షాలను మధ్యవర్తిత్వానికి పంపిస్తామని సూచిస్తూ విచారణను వాయిదా వేసింది.

జైళ్లపై 'రిమాండ్' ఒత్తిడి!



» నేరం నిరూపణ కాకుండానే సగటున మూడేళ్ల వరకు జైల్లోనే

» 300కిపైగా జైళ్లలో సామర్థ్యం కంటే రెట్టింపు సంఖ్యలో ఖైదీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మనదేశంలోని 300కి పైగా జైళ్లలో సామర్థ్యం కంటే రెట్టింపు సంఖ్యలో ఖైదీలు ఉన్నారని ఇండియా జస్టిస్ అనే సంస్థ వెల్లడించింది. వీరిలో అత్యధికంగా రిమాండ్ ఖైదీలే ఉన్నారని తెలిపింది. దీనివల్ల నిద్రించే స్థలం దగ్గరనుంచి ఆరోగ్య వసతులు, పర్యవేక్షణ వరకు, పలు మౌలిక సమస్యలతో జైళ్లు కునారిల్లుతున్నాయని నివేదించింది. కోర్టు తీర్పుల్లో జాప్యం కారణంగా అండర్‌ట్రయల్ (రిమాండ్) ఖైదీలతో జైళ్లు నిండిపోవడమే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషించింది. ఈ మేరకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్)తో కలిసి సేకరించిన గణాంకాలను గత వారం ఈ సంస్థ విడుదల చేసింది. ఈ నివేదికను అనుసరించి, ఢిల్లీ సెంట్రల్ జైలు నం.4లో 2023 నాటికి సామర్థ్యం కంటే 550% కంటే అధికంగా ఖైదీలున్నారు. బిహార్‌లోని దీనాపూర్ సబ్ జైలు, జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లా జైలులో 300%, పశ్చిమబెంగాల్‌లోని కందీ సబ్‌జైలులో 450% కంటే ఎక్కువగా ఖైదీలు ఉన్నారు. కోర్టుల్లో శిక్షలు పడే కేసులు పెరగడం వల్ల జైళ్లపై ఒత్తిడి పెరుగుతున్నదా అంటే, అలాంటిదేమీ లేదు. పైగా తీర్పుల్లో విపరీత జాప్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తింది. దీనివల్ల మనదేశంలోని జైళ్లలోని ఖైదీల్లో 76% రిమాండ్ ఖైదీలే ఉన్నారు. అంటే, ఇంకా నేరం నిరూపణ కాని నిందితులన్నమాట. గత రెండు నుంచి ఐదేళ్ల కాలంలో వీరి సంఖ్య రెట్టింపునకు చేరుకుంది. 2023 లెక్కల ప్రకారం, ప్రతి నలుగురికి ఒక రిమాండ్ ఖైదీ సగటున ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలులో ఉంటున్నారు.

797 మందికి ఒక వైద్యుడు

జైళ్లలో సరిపడా సిబ్బంది లేరు. ఖైదీల అవసరాలు తీర్చగల స్థాయిలో వసతులు లేవు. దేశవ్యాప్తంగా జైళ్లలో 30 శాతం గార్డింగ్ స్టాఫ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 29 రాష్ట్రాల పరిధిలోని జైళ్లలో ఒక్క మానసిక వైద్య నిపుణుడు కూడా లేరు. దాదాపు 1,150 మంది మానసిక వైద్యులను నియమించాలని మోడల్ ప్రిజన్ మాన్యువల్ నిర్దేశించగా, ఇప్పటివరకు 65 పోస్టులు మంజూరుచేసి, వాటిలో 35 పోస్టులను మాత్రమే నింపారు. ప్రస్తుతం 797 మందికి ఒక వైద్యుడు మాత్రమే ఉన్నారు.

టెక్నాలజీ అనుసంధానంతో సుపరిపాలన

» సులభంగా పౌర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

» ఆర్టీజీఎస్‌పై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి ప్రభుత్వ శాఖ సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ఆ లక్ష్యంతోనే అడుగులు వేస్తామని పేర్కొన్నారు. పాలన ప్రక్రియలు, నిబంధనలు మరింత సరళం చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలనూ సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలని, ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక కూడా చెల్లింపులు, ఇతర ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకూడదన్నారు. ప్రభుత్వంలోని 8.20 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు విధులను సమర్థంగా నిర్వహించేలా సామర్థ్యాలను పెంచుకునే శిక్షణ పొందాలన్నారు. పలు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల్లో అమలవుతున్న అత్యుత్తమ ప్రమాణాలను అన్ని పథకాలు, కార్యక్రమాల్లో అనుసరించాలని అధికారులకు సీఎం సూచించారు. దీనివల్ల ప్రభుత్వంపై ప్రజల్లో మంచి అభిప్రాయం కలుగుతుందన్నారు.

మరింత రుచిగా అన్నా క్యాంటీన్ల ఆహారం

అన్నా క్యాంటీన్లలో వడ్డించే ఆహారం మరింత రుచికరంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో భోజనాలు మరింత మెరుగుపరచాలని చెప్పారు. అన్ని వసతి గృహాల్లోనూ అత్యుత్తమ ప్రమాణాలతో ఆహారం అందేలా చూడాలన్నారు. మహిళలపై నేరాల నివారణకు విజిబుల్ పోలీసింగ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న చర్యలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని హోం శాఖకు సూచించారు.

ప్రజెంటేషన్ భేష్

గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌పై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సాప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్‌సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏపీఏఐ సెర్చ్‌బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై చూపిన ప్రజెంటేషన్స్ బిల్ గేట్స్‌ను ఆకట్టుకున్నాయని చంద్రబాబు సంతోషంగా చెప్పారు.



జస్టిస్ బాలాజీ మెడమల్లిని సన్మానించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం

జస్టిస్ బాలాజీకి న్యాయవాదుల సన్మానం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో కొత్తగా బాధ్యతలు చేపట్టిన అదనపు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లిని హైకోర్టు న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. సోమవారం జస్టిస్ బాలాజీని శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేసింది. బార్‌తో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా జస్టిస్ బాలాజీ గుర్తు చేసుకున్నారు. జూనియర్ న్యాయవాదులు ఓపికతో కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) సాంబ శివ ప్రతాప్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో నారాయణ రికార్డు



100 పర్సంటైల్ సాధించిన వివన్ శరద్, మహిత్, మాధవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2026 తొలి విడత ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థ రికార్డు సృష్టించింది. ముగ్గురు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించడంతో పాటు ఐదు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా) స్టేట్ టాపర్లుగా నిలిచారు. వివన్ శరత్ మహేశ్వరి, మాధవ్ విరాడియా, నరేంద్రబాబు గారి మహిత్ 100 పర్సంటైల్‌తో దేశంలోనే టాపర్లుగా నిలిచారు. కర్ణాటకకు చెందిన విష్ణు సాయితేజ 99.999, గోవాకు చెందిన తనయ్ అజిత్ ప్రభు 99.825 పర్సంటైల్‌తో ఆయా రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిచారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణలు తెలిపారు. జేఈఈ మెయిన్ పరీక్షకు నారాయణ విద్యాసంస్థ అందించిన శిక్షణ, రిసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌లు, పటిష్ఠ ప్రణాళిక, స్టడీ మెటీరియల్, నిబద్ధతతో కూడిన వారాంతపు పరీక్షల వల్లనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. దిశ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తూ ఒత్తిడి లేని చదువును అందిస్తున్నామని, ప్రతి విద్యార్థికీ వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

శ్రీచైతన్య ప్రభంజనం



100 పర్సంటైల్ సాధించిన మోహిత్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2026 సెషన్-1 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్రీ చైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. శ్రీచైతన్య విద్యార్థి పసల మోహిత్ 300/300 మార్కులతో 100 పర్సంటైల్‌తో దేశంలోనే ఒక్కడిగా నిలిచాడు. మోహిత్‌తో పాటు శ్రీచైతన్య విద్యార్థులు 290, 285, 280లకుపైగా మార్కులతో అత్యధిక సంఖ్యలో 100 పర్సంటైల్ స్కోర్లు కైవసం చేసుకున్నట్లు శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక బోధనా పద్ధతులే ఈ విజయానికి కారణమని అన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, తమ సంస్థ రూపొందించిన అకడమిక్ ప్రోగ్రామ్స్, షెడ్యూల్స్ అంతర్గత పరీక్షలే నాలుగేళ్లుగా జేఈఈ మెయిన్‌లో 300/300 మార్కులతో 100 పర్సంటైల్స్ సాధించడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుత పర్సంటైల్స్‌లోనే కాకుండా.. రాబోయే ర్యాంకుల్లో కూడా శ్రీచైతన్య విద్యార్థులు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారని పేర్కొన్నారు.

సత్తాచాటిన భాష్యం విద్యార్థులు

- జాతీయ స్థాయిలో 99.99 పర్సంటైల్ సాధించిన నూతలపాటి యోగ శివసాయి శ్రీరామ్



యోగ శివసాయి శ్రీరామ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సోమవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్-2026 సెషన్-1 ఫలితాలలో భాష్యం విద్యార్థి నూతలపాటి యోగ శివసాయి శ్రీరామ్ 99.99 టాప్ పర్సంటైల్‌తో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 13.5 లక్షల మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడగా భాష్యం విద్యార్థి యోగ శివసాయి శ్రీరామ్ ఉత్తమ ప్రతిభ కనబరచడం తమ విద్యాసంస్థలకే గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ ప్రతి ఏటా అంచనాలకందని ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఈ సంచలన విజయాలకు భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే కారణమన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

'తిరుమల' విద్యార్థుల జయకేతనం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరిలో ఆలిండియా టాపర్‌గా నిలిచారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకూ విడుదలైన ఫలితాల్లో డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్, ఎం.కృష్ణ శరవణ సాకేత్ 99.99 పర్సంటైల్, గన్నమనీడి వాత్సల్య 99.98 పర్సంటైల్, ఆర్.చరణ్‌తేజ 99.98 పర్సంటైల్, జి.ప్రభవ్‌తేజ 99.97 పర్సంటైల్ సాధించారని చెప్పారు. సుమారు 1000 మందికి పైగా విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ లేదా ఐఐటీలలో సీట్లు సాధించగలరని తిరుమలరావు వెల్లడించారు. అత్యుత్తమ స్కోరులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

శ్రీ ప్రకాష్ అత్యుత్తమ ఫలితాలు

తుని రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ సోమవారం తెలిపారు. కాకినాడ జిల్లా తుని రూరల్‌లో ఉన్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలో ఆయన మాట్లాడారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో తమ విద్యార్థి జె.మోనిష్ కుమార్ 99.93 పర్సంటైల్ సాధించాడని.. ఇంకా అనేక మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. కళాశాలలో ఇస్తున్న ఐఐటీ-జేఈఈ కోచింగ్ ద్వారా తమ విద్యార్థులు ఈ పర్సంటైల్ సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకె నరసింహారావు, ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్.భానుమూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

రెసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో రెసోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. ఈ పరీక్షలకు 55 మందికిపైగా విద్యార్థులు 99 పర్సంటైల్‌కు పైగా స్కోర్ చేసినట్లు రెసోనెన్స్ విద్యాసంస్థల ఎండీ పూర్ణచంద్రరావు ప్రకటనలో తెలిపారు. రెసోనెన్స్ హైదరాబాద్ నుంచి సమిద్ భట్టాచార్య 99.988, రేవంత్ వంగల 99.982, సాకేత్ రెడ్డి బొమ్మడి 99.932, బునేటి ఆదిత్యరెడ్డి 99.918, సెట్టిపల్లి అన్వితారెడ్డి 99.915 స్కోర్ సాధించారని ఆయన పేర్కొన్నారు.

సిక్కోలు ఇసుకలో.. అరుదైన సిరులు!

(మొదటి పేజీ తరువాయి)



పిలిచే వాటిపైనే ఇప్పుడు ప్రపంచం దృష్టి పడింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకు న్న తాజా నిర్ణయాలు జిల్లాకు పారిశ్రామిక శోభ ను తీసుకురానున్నాయి. అటు ప్రకృతి ప్రసాదించిన వనరులు, ఇటు సీఎం చంద్రబాబు దార్శనికత వెరసి.. సిక్కోలు దశ దిశ మారే సమయం ఆసన్నమైంది..!

చైనా ఆధిపత్యానికి గండి కొట్టేలా..

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ల నుంచి యుద్ధ విమానాల వరకు, ఎలక్ట్రిక్ కార్ల నుంచి క్షిపణుల వరకు ప్రతి అత్యాధునిక పరికరం తయారీలో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్' కీలకం. ఇప్పటివరకు వీటి ఉత్పత్తి, శుద్ధిలో దాదాపు 90 శాతం చైనాదే ఏకఛత్రాధిపత్యం. భవిష్యత్తులో చైనా సరఫరా నిలిపివేస్తే ప్రపంచం స్తంభించిపోయే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా, జపాన్ వంటి దేశాలు 'చైనా ప్లస్ వన్' విధానంలో భారత్ వైపు చూస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక రేర్ ఎర్త్ నిల్వలున్న దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. అందులోనూ శ్రీకాకుళం తీరంలో లభించే మోనజైట్, ఇల్మనైట్, జిర్కాన్ వంటి ఖనిజాలు అత్యంత నాణ్యమైనవిగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మూలపేట పోర్టు.. పారిశ్రామిక ముఖద్వారం

ఈ అరుదైన సంపదను ఉపయోగించుకుని శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి బాట పట్టించేందుకు సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో నిర్మాణం అవుతున్న మూలపేట పోర్టు కేంద్రంగా భారీ 'ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్' (తూర్పు తీర పారిశ్రామిక కారిడార్) రూపుదిద్దుకోనుంది. మూలపేట నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వరకు ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని, దీనికి శ్రీకాకుళమే 'స్టార్టింగ్ పాయింట్' కావాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనివల్ల పోర్టు ఆధారిత పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగాలు జిల్లాలో భారీగా విస్తరించే అవకాశం ఉంది.

'వాల్యూ చైన్'.. ఇక్కడే పరిశ్రమలు..

గతంలోలా ఖనిజాలను వెలికితీసి ముడిసరుకుగా తరలించడమే కాకుండా, ఇక్కడే శుద్ధి చేసేలా పరిశ్రమలు రాబోతున్నాయి. కేంద్రం ప్రకటించిన 'రేర్ ఎర్త్ కారిడార్'ను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని సీఎం ఇటీవల ఆదేశించారు. ఖనిజాల వెలికితీత (మైనింగ్)తో పాటు, వాటి 'వాల్యూ చైన్' (విలువ ఆధారిత) పరిశ్రమలను ఇక్కడే స్థాపించడం ద్వారా స్థానిక యువతకు భారీగా ఉపాధి లభించనుంది. రక్షణ పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్స్, గ్రీన్ ఎనర్జీ పరికరాల తయారీలోనూ శ్రీకాకుళం జిల్లా కీలకం కానుంది.

కంటైనర్ హబ్‌గా సిక్కోలు

మూలపేట పోర్టు అందుబాటులోకి వస్తుండటంతో కంటైనర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎక్విప్‌మెంట్ తయారీ యూనిట్లను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. పర్యావరణానికి హాని కలగకుండా, అధునాతన పద్ధతుల్లో ఖనిజాలను వెలికితీస్తూనే పారిశ్రామికంగా జిల్లాను అగ్రభాగాన నిలబెట్టాలన్న ప్రభుత్వ సంకల్పం.. వలసల జిల్లాలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'.. ఎందుకంత స్పెషల్?

రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అంటే.. భూమి పొరల్లో చాలా అరుదుగా, చాలా తక్కువ మోతాదులో లభించే 17 రకాల రసాయన మూలకాల సమూహం. ఇవి అయస్కాంత శక్తిని, విపరీతమైన వేడిని తట్టుకునే గుణాన్ని కలిగి ఉంటాయి. ఆధునిక సాంకేతికతకు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అత్యంత కీలకం. సెల్‌ఫోన్ల చిప్స్, బ్యాటరీలు, శాటిలైట్లు, క్షిపణులు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఇవి లేనిదే పని జరగదు. వీటి వెలికితీత, శుద్ధి క్లిష్టమైన ప్రక్రియ అయినప్పటికీ... అంతర్జాతీయ మార్కెట్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో డిమాండ్ కారణంగా 2040 నాటికి వీటి అవసరం 300 నుంచి 700 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

4 వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయండి

- గీతం యాజమాన్యానికి సుప్రీంకోర్టు ఆదేశం
- గత టీ హైకోర్టు వ్యాఖ్యలు మధ్యంతర ఉత్తర్వులకే పరిమితం
- గీతం, టీఎస్ఎస్పీడీసీఎల్ వివాదంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)కు నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉభయ పక్షాల హక్కులకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వ్యాఖ్యానించింది. గీతం.. విద్యాసంస్థ అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నామని, అందుకే మధ్యంతర వెసులుబాటు కల్పిస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది. వీబీసీ ఫెర్రో అలాయ్స్ సంస్థ చెల్లించాల్సిన రూ.118 కోట్ల బకాయిలను ఆ సంస్థతో సంబంధం ఉన్న గీతం చెల్లించాలంటూ టీఎస్ఎస్పీడీసీఎల్ నోటీసులు జారీ చేసింది. దీనిపై గీతం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించగా.. మధ్యేమార్గంగా ఈ వివాదం ముగిసే వరకూ రూ.54 కోట్లు చెల్లించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ గీతంను ఆదేశించింది. ఈ తీర్పును ఈ నెల 5న గీతం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారించింది. "గతంలోనే వీబీసీ ఫెర్రో అలాయ్స్ కంపెనీని ఇతరులకు విక్రయించినా ఆ కంపెనీ విద్యుత్ బకాయిలను గీతం యాజమాన్యమే చెల్లించాలని విద్యుత్ సంస్థ నోటీసులు జారీ చేసింది. ఇది ముమ్మాటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే" అని గీతం యాజమాన్యం ధర్మాసనం ముందుకు తీసుకెళ్లింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సామరస్యతను పాటించాలనే ఉద్దేశంతో గీతంను రూ.15 కోట్లు విద్యుత్ సంస్థ వద్ద 4వారాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఈ కేసులో హైకోర్టు గతంలో చేసిన వ్యాఖ్యలు కేవలం మధ్యంతర ఉత్తర్వులకే పరిమితమని స్పష్టం చేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రధాన రిట్ పిటిషన్‌ను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. ఈ అంశానికి స్పెషల్ లీవ్ పిటిషన్‌తో సహా ఇతర అనుబంధ పిటిషన్లపై విచారణను ముగించింది.



కాకినాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

కుల గణన చేపట్టాలి

- బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి: ఈశ్వరయ్య
- జగన్‌ను నమ్మే పరిస్థితుల్లో జనం లేరు
- ఆయన మళ్లీ అధికారంలోకి రావడం కల్ల: నారాయణ

కాకినాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'జన గణనలో సమగ్రంగా కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి. రాజకీయ, సామాజిక ఆర్థిక సమానత్వం కోసం క్రియాశీలక పోరాటాలకు సన్నద్ధం కావాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం కాకినాడలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు అధ్యక్షతన రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సీనియర్ నేత నారాయణ పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడారు. 'గత స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వల్ల వేల సంఖ్యలో స్థానిక సంస్థల పదవులను బీసీలు కోల్పోయారు. తెలంగాణ ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్టి అందుకనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ చేపట్టి, కులాల ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలి. ఆ ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి. కుల వృత్తులకు సంబంధించి చిన్నచిన్న పరికరాలు అందించి ఓట్లు దండుకుంటున్నారు. ఇది ఆధునిక బానిసత్వం. ఓట్లు, సీట్లు పొందుతున్న రాజకీయ పార్టీలేవీ బీసీల అభివృద్ధి గురించి మాట్లావు. అన్ని రాజకీయ పార్టీలతో జన గణనలో, కుల గణన జరిపించాలని తీర్మానం చేయించి అందుకు కావలసిన కార్యాచరణ తీసుకొచ్చేలా ఆయా రాజకీయ పార్టీల బీసీ నేతలు ఒత్తిడి తీసుకురావాలి' అని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి నరేంద్ర మోదీ బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించాలి. రాష్ట్ర ఎంపీల మద్దతుతో కేంద్రంలో ఉన్న ఆయన అన్ని విధాలా ఏపీకి సహకరించాలి. పోలవరం పూర్తి చేయాలి. కోస్టల్ కారిడార్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి' అని కోరారు. నారాయణ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో ఇక ప్రజలు వైసీపీ అధినేత జగన్‌ను నమ్మే పరిస్థితిల్లో లేరు. ఇక ఆయన అధికారంలోకి రావడం కల్ల. కూటమి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా ఎదిగేలా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, పి.హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో తెలుగు సత్తా

(మొదటి పేజీ తరువాయి)

326 నగరాల్లో 658 కేంద్రాల్లో తొలివిడత జేఈఈ మెయిన్ పరీక్షలు నిర్వహించగా.. 13.04 లక్షల మంది హాజరయ్యారు. పేపర్-1 (బీఈ, బీటెక్) ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సోమవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 12 మంది పూర్తి మార్కులు (100 పర్సంటైల్) సాధించారు. వీరిలో అత్యధికంగా రాజస్థాన్ నుంచి ముగ్గురు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒకరు ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందుపురానికి చెందిన నరేంద్రబాబుగారి మహిత్, కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన పసల మోహిత్‌లు ఏపీ నుంచి 100 పర్సంటైల్ సాధించారు. హైదరాబాద్ విద్యార్థి వివాన్ శరద్ మహేశ్వరి 100 పర్సంటైల్ సాధించిన 12 మందిలో ఉన్నారు. దేశస్థాయిలో ఓబీసీ-ఎన్‌సీఎల్ కోటాలో వంద పర్సంటైల్ సాధించిన విద్యార్థిగా మహిత్ నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దేవ శ్రీవేశ్ 99.9992271 పర్సంటైల్‌తో ఎస్సీ విభాగంలో ఆలిండియా టాపర్‌గా నిలిచారు. జేఈఈ మెయిన్ పరీక్ష రాసిన వారిలో 8.87 లక్షలు అబ్బాయిలుండగా, 4.67 లక్షల మంది అమ్మాయిలున్నారు. టాపర్లలో అందరూ అబ్బాయిలే ఉండటం విశేషం. హరియాణాకు చెందిన ఆవీ గ్రేవాల్ 99.996 పర్సంటైల్‌తో అమ్మాయిల్లో అత్యధిక పర్సంటైల్ సాధించి టాపర్‌గా నిలిచారు. పేపర్-2 బి-ఆర్క్, బి-ప్లానింగ్ పరీక్షల ఫలితాలు త్వరలో విడుదల చేస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. ఏప్రిల్‌లో జేఈఈ మెయిన్స్ సెషన్-2 జరుగుతుంది. రెండు సెషన్లకు కలిపి ర్యాంకులు ప్రకటించిన తర్వాత జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరుగుతాయి.

చదువుల కోసం హిందూపురం నుంచి తిరుపతికి

నరేంద్రబాబుగారి మహిత్ తిరుపతిలోని నారాయణ ఐఐటీ అకాడమీలో చదివారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన మహిత్ చదువు నిమిత్తం అతని తల్లిదండ్రులు మూడేళ్ల కిందట తిరుపతికి వచ్చి స్థిరపడ్డారు. మహిత్ తండ్రి నరేంద్రబాబు తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తమ కుమారుడి తెలివితేటలపై నమ్మకంతో తిరుపతికి వచ్చి ఎంతో కష్టపడి చదివించినందుకు, ఫలితం దక్కిందని మహిత్ తల్లిదండ్రులు తెలిపారు. కాగా, మహిత్‌ను నారాయణ ఐఐటీ అకాడమీ డీజీఎం కొండలరావు, తదితరులు అభినందించారు. దేశంలో 12 మంది విద్యార్థులు నూటికి నూరు పర్సెంటైల్ సాధించగా.. వారిలో మహిత్ ఉండటం తమకు గర్వకారణమన్నారు.

తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులే

కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన పసల మోహిత్ 300 మార్కులకు 300 మార్కులు సాధించారు. మోహిత్ తండ్రి కిరణ్‌కుమార్ ప్రొద్దుటూరులో డాక్టర్‌గా, తల్లి సబిత జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో డెంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. మోహిత్ 10వ తరగతి గుడివాడ కేకేఆర్‌లో, ఇంటర్ విజయవాడలోని చైతన్య జూనియర్ కళాశాలలో చదివారు. తొలి ప్రయత్నంలోనే మోహిత్ సాధించిన ఈ విజయంతో కుటుంబసభ్యులు, గురువులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐ రంగంలో స్థిరపడతా

మా అమ్మా నాన్న మొదటి నుంచీ.. నాపై ఎంతో నమ్మకం పెట్టుకొని కష్టపడి చదివించారు. కళాశాలలో అధ్యాపకులు నిత్యం చెప్పే సూచనలను పాటిస్తూ కష్టపడి చదవడం వల్లే ఈ రోజు ఈ విజయం సాధ్యపడింది. ఇందుకోసం రోజూ దాదాపు 18 గంటలు చదివేవాడిని. ఆ కష్టానికి తగిన ప్రతిఫలం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో బాంబే ఐఐటీలో సీటు సాధించి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) రంగంలో స్థిరపడాలనేదే నా లక్ష్యం.

- నరేంద్రబాబుగారి మహిత్

బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవటం లక్ష్యం

జేఈఈ మెయిన్స్‌లో వందకు వంద మార్కులు రావడం చాలా అనందంగా ఉంది. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయడమే నా లక్ష్యం. ప్రతిరోజు నాలుగు గంటలు మాత్రమే చదువుతూ పరీక్షకు సన్నద్ధమయ్యేవాడిని. కుటుంబసభ్యుల నుంచి కానీ, చదివే సమయంలో కానీ ఎలాంటి ఒత్తిడి లేకపోవడంతోనే జేఈఈ మెయిన్స్‌లో టాప్ ర్యాంకు సాధించగలిగాను. మా అమ్మ, నాన్న ఇద్దరూ ప్రభుత్వాసుపత్రిలో వైద్యులుగా చేస్తున్నారు. వారి నుంచి ఎప్పుడూ చదువు విషయంలో, ర్యాంకు సాధించాలనే ఒత్తిడి లేదు.

- పసల మోహిత్

అమెరికా వద్దని ఐఐటీ ఎంచుకున్నా..

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా చదివాను. కళాశాల అధ్యాపకుల మార్గదర్శకంతో ఈ విజయం సాధ్యమైంది. నాన్న వ్యాపారవేత్త, అమ్మ సీఏ. స్వస్థలం ఢిల్లీ అయినా చిన్నప్పుడే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఇంటర్ తర్వాత గ్రాడ్యుయేషన్ కోసం అమెరికాకు పంపాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. తాను ఇక్కడే ఉండి ఐఐటి బాంబేలో ప్రవేశం పొందడం లక్ష్యంగా నిర్ణయించుకున్నాను. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్‌లో చేరాలనేది నా లక్ష్యం.

- వివాన్ శరద్‌మహేశ్వరి

చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ

- ఉమ్మడిగా పరిష్కరించే అంశాలపై చర్చ



అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వీరిరువురూ సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీరు, రైల్వే లైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తుమ్మల అభిప్రాయపడ్డారు. చంద్రబాబును కలిసిన అనంతరం తుమ్మల విలేకరులతో మట్లాడుతూ.. సరిహద్దులోని ఖమ్మం జిల్లాకు చెందిన రహదారులు, రైల్వేలకు సంబంధించిన ఉమ్మడి అంశాలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడానని తెలిపారు. పోలవరం కోసం ఏడు మండలాలు ఏపీకి బదిలీ చేశారని, ఇప్పుడు భద్రాచలం నుంచి తెలంగాణకు వెళ్లాలి అంటే ఐదు ఏపీ గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తోందని, వాటిని తెలంగాణలో తిరిగి కలపాలని కోరామని చెప్పారు. తిరుమలలో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం 5 ఎకరాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తన ప్రతిపాదనలు పరిశీలిస్తామని చంద్రబాబు చెప్పారన్నారు. అమరావతి ప్రతిష్ఠాత్మక రాజధానిగా నిలవాలని కోరుకుంటున్నామన్నారు.



ఆర్టీసీ హౌస్‌లో ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఈయూ నాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య తదితరులు

ద్వారకా తిరుమలరావుకు ఈయూ సత్కారం

విజయవాడ(బస్‌స్టేషన్), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీగా పదవీ విరమణ చేయనున్న ద్వారకా తిరుమలరావుకు ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ హౌస్‌లో వీడ్కోలు సత్కారం నిర్వహించారు. నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలలు పాటు ఆయన విశేష సేవలు అందించారని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి పెద్దపీట వేశారని.. ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్టీసిని ముందుకు నడిపించారని కొనియాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీ-శక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించి సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి ద్వారకా తిరుమల రావు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ యం.డి.ప్రసాద్ వీరితో పాటు యూనియన్ రాష్ట్ర, జోన్, జిల్లా నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఫలితాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. 38 పోస్టులకు 38 మందిని ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 24న సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. సర్టిఫికెట్లను ధ్రువీకరించిన తర్వాత ఉద్యోగం పొందినట్లు ప్రకటిస్తారు. సాధారణంగా అన్ని నోటిఫికేషన్లలో సర్టిఫికెట్ల పరిశీలనకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను పిలుస్తారు. వారిలో సగం మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అందుకు భిన్నంగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు ఒక పోస్టుకు ఒకరినే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు.

మంగళగిరిలో ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం

- పీఎం అభిమ్ పథకం కింద రూ.5 కోట్లతో ఏర్పాటు: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, అంటువ్యాధులు ప్రబలినప్పుడు, కొవిడ్ లాంటి అసాధారణ పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలకు ఆరోగ్యశాఖ సంసిద్ధమైందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మంగళగిరిలో "ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం" (పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ఏర్పాటైన ఈ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో ఆరోగ్యశాఖ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైరింగ్, పోలీసు, ఇతర శాఖల సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు వైద్య సేవలందించే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. పీఎం అభిమ్ (ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్) కింద రూ.5 కోట్ల నిధులతో ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

- రేపు సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెడికల్ పీజీకి సంబంధించి కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటాలో మిగిలిపోయిన సీట్లను మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సిద్ధమైంది. ఈ మేరకు హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయిసుధీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోలని సూచించారు. మరోవైపు ఇప్పటి వరకూ సీట్లు పొందిన అభ్యర్థులు వారి స్థానాల్లో కచ్చితంగా చేరాలన్నారు. మేనేజ్‌మెంట్ కోటా నుంచి కన్వీనర్ కోటా సీటు పొందిన అభ్యర్థులు ఎవరైనా ఉంటే వారి మేనేజ్‌మెంట్ కోటా సీటును ఖాళీగా పరిగణిస్తామని చెప్పారు.





ఏఐ సాంకేతికతతో నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రంలో అరటి చెట్టును స్కాన్ చేస్తున్న బిల్‌గేట్స్, రైతు అందజేసిన అరటిపళ్లను పరిశీలిస్తూ..

ఏఐతో 'ఇబ్బందే'!

నిరుద్యోగ సమస్య తలెత్తుతుంది

పనిలో 'హ్యూమన్ టచ్' పోతుంది: గేట్స్

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం కచ్చితంగా ఉందని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో జరిగిన భేటీలో ఆయన రాష్ట్ర మంత్రులు, అధికారులతో ముచ్చటించారు. ఏఐ గురించి వాణిజ్య పన్నుల కార్యదర్శి అహ్మద్ బాబు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... "ఏఐతో నిరుద్యోగ సమస్య వస్తుంది. ప్రతి పనిలో హ్యూమన్ టచ్ తగ్గుతుంది." అని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అప్పట్లో మైక్రోసాఫ్ట్ అమెరికా వెలుపల అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గుర్తు చేశారు. "ఔను. అమెరికాలోని మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో ఏపీకి చెందిన నిపుణుల సంఖ్య అధికం. వీరిలో చాలామంది సొంత గడ్డపై నుంచి పని చేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం ఏర్పాటు చేశాం" అని గేట్స్ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కడి నుంచైనా పని చేసుకునే వెసులుబాటు ఉందని మంత్రి సత్యకుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఏఐ అగ్రిసేవలు భేష్

- అద్భుతంగా చేస్తున్నారంటూ గేట్స్ ప్రశంస
- ఉండవల్లి వద్ద వ్యవసాయ క్షేత్రం సందర్శన
- ఏపీ-ఏఐఎంఎస్ యాప్ పనితీరు పరిశీలన
- క్షుణ్నంగా వివరించిన మహిళా రైతులు
- సీఎంతో కలసి స్థానిక రైతులతో ముఖాముఖి
- మహిళా రైతులు వండిన వంటలు రుచి

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఏఐ-అగ్రిటెక్ సేవలు అత్యద్భుతమని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ప్రశంసించారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సాంకేతికతను, ఏఐ ఆధారిత రైతు సేవలను సోమవారం సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని గేట్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రైతులు వినియోగిస్తున్న సాంకేతికత గురించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గేట్స్‌కు వివరించారు. వ్యవసాయం-అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలిపారు. నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డ్యాష్ బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీ-ఏఐఎంఎస్) యాప్ గురించి గేట్స్‌కు వివరించారు. ఇటీవలే ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి? సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును వివరించారు. బిల్ గేట్స్ సమక్షంలో రైతులు ఏఐ టూల్ ఉపయోగించి.. వ్యాధి సోకిన మొక్క ఫొటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ పురుగు మందును స్ప్రే చేసింది. ఈ మొత్తం విధానాన్ని స్వయంగా చూసిన బిల్ గేట్స్.. రైతులకు ఏఐ-అగ్రిటెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, చంద్రబాబును ప్రశంసించారు. అనంతరం స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు.

మహిళా రైతుల ఆత్మీయ స్వాగతం

తొలుత వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న సీఎం చంద్రబాబు, బిల్ గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళా రైతులు స్వయంగా వండి తీసుకువచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రీయ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అమరావతిలోని వ్యవసాయ క్షేత్రం వద్ద స్థానిక మహిళా రైతులు తయారు చేసిన పునుగులను రుచి చూస్తున్న బిల్‌గేట్స్

బిల్‌గేట్స్‌కు ఘన స్వాగతం

గన్నవరం/విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దక్షిణకొరియా నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన బిల్‌గేట్స్‌కు విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, సత్య కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఘనస్వాగతం పలికారు. దట్టమైన పొగమంచు వల్ల విజిబిలిటీ లేక ఆయన వచ్చిన విమానం కొద్దిసేపు గాలిలో చెక్కర్లు కొట్టింది. మంచు తగ్గిన తర్వాత విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. రాష్ట్ర పర్యటన అనంతరం బిల్‌గేట్స్ ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ముంబైకి పయనమయ్యారు. లోకేశ్ వీడ్కోలు పలికారు. కాగా.. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గుర్రపు డెక్క నారతో తయారుచేసిన బుట్టను గేట్స్‌కు బహూకరించి, సంప్రదాయ కలంకారి శాలువాతో సత్కరించారు. ఆ బుట్ట తయారు చేసిన విధానం గేట్స్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గుర్రపు డెక్క విరివిగా లభిస్తోందని, మచిలీపట్నం మండలం చిన్నాపురంలో డ్వాక్రా మహిళలతో సంఘాన్ని ఏర్పాటు చేసి, వారి ద్వారా ఈ హస్తకళా ఉత్పత్తులను తయారు చేయించి.. లేపాక్షి, టీటీడీ, ఇతర సంస్థలకు ఆర్డర్లు అందిస్తూ మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

చంద్రబాబు విజనరీ

ఆయన ఆలోచనలు విభిన్నం, వినూత్నం

తొలి సమావేశంలోనే ఈ విషయం గుర్తించా

ప్రపంచ దేశాల నాయకులను నేను ఎంతో మందిని కలిశాను. చాలా మంది నాయకుల కంటే చంద్రబాబు ఆలోచనలు విభిన్నంగా, వినూత్నంగా ఉంటాయి. ఆయనతో మొదటి సమావేశంలోనే నేను ఈ విషయాన్ని గుర్తించాను. ఇతర నాయకుల కంటే ఆయన ఆలోచనలు చాలా ముందుంటాయి. చంద్రబాబు సమకాలీనుల్లో సింగపూర్ ప్రధాని ఒక్కరే ఆయనలా భిన్నమైన, విజన్‌తో కూడిన ఆలోచనలున్న నేత. - బిల్ గేట్స్

- బాబు సమకాలీనుల్లో సింగపూర్ ప్రధాని ఒక్కరే ఆయనలా భిన్నమైన, విజన్ ఉన్న నేత
- ముఖ్యమంత్రిపై బిల్ గేట్స్ ప్రశంసల వర్షం
- సచివాలయంలో సీఎం ఎదురేగి స్వాగతం
- హలో ఫ్రెండ్.. హౌ ఆర్ యూ? అంటూ బిల్ గేట్స్ ఆత్మీయ పలకరింపు
- గేట్స్ ఫౌండేషన్ బృందంతో సీఎం బ్రేక్ ఫాస్ట్ మీటింగ్

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ అని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ప్రశంసించారు. చంద్రబాబు సమకాలీనుల్లో సింగపూర్ ప్రధాని ఒక్కరే ఆయనలా భిన్నమైన, విజన్ ఉన్న నాయకుడని అన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం అమరావతి వచ్చిన గేట్స్ పర్యటన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో గత అనుభవాలను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్ ప్రణాళికలను చర్చించుకుంటూ తన పర్యటన సాగించారు. అమరావతి వెలగపూడి సచివాలయం మొదటి బ్లాకు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదురేగి గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. చంద్రబాబును చూడగానే బిల్ గేట్స్. 'హలో ఫ్రెండ్.. హౌ ఆర్ యూ?' అంటూ ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులను బిల్ గేట్స్‌కు చంద్రబాబు పరిచయం చేశారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో చంద్రబాబు అంతకుముందు లోకేశ్ సహా నలుగురు మంత్రులను గన్నవరం విమానాశ్రయానికి పంపి స్వాగత ఏర్పాట్లు చేశారు. బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన చాంబర్‌లోకి వచ్చిన బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి తిరుమల వెంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పతనాన్ని గేట్స్‌కు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం వారిని సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. ఆ విభాగం పనితీరును, అమరావతి నిర్మాణం గురించి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు పురోగతిని తెలియజేశారు. అనంతరం మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి గేట్స్‌ను తీసుకువచ్చారు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడానికి దారితీసిన పరిస్థితులపై కొద్దిసేపు చర్చ జరిగింది. గేట్స్ కూడా నాటి ఢిల్లీ సమావేశం.. సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు, అమెరికా వెలుపల తొలి డెవలప్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం గురించి సమావేశంలో ఉన్న మంత్రులు, సెక్రటరీలకు వివరించారు. తొలి మీటింగ్‌లోనే చంద్రబాబు విజనరీ ఆలోచనలను తాను గుర్తించానని బిల్ గేట్స్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

మంత్రుల ప్రశ్నలకు జవాబులు

మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్‌బాబు బిల్‌గేట్స్‌ను వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి, ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన బిల్‌గేట్స్ బృందం సాగులో టెక్నాలజీ అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి ప్రశంసించారు. అనంతరం రాష్ట్ర పర్యటన ముగించుకుని బయలుదేరి వెళ్లారు.



చంద్రబాబు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్

డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజారిటీగా ఉన్నాయని చెప్పారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో విద్యాబోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి కృత్రిమమేధ-సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఏఐ అనుసంధానం చేయడాన్ని గేట్స్ అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐను అనుసంధానం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.



ఆర్టీజీఎస్ కేంద్రంలో రాజధాని అమరావతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను చూస్తున్న బిల్‌గేట్స్, చంద్రబాబు, లోకేశ్



నైస్.. గుడ్.. గ్రేట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విభాగాలన్నింటిని అనుసంధానం చేశామని చెప్పారు. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సాప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు డిస్‌ప్లే వాల్ ద్వారా గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి ప్రజలకు వేగంగా అందిస్తున్న విధానాన్ని వివరించారు. ప్రజలు, రైతులకు 42 రకాల సమాచారాన్ని ముందస్తుగా చేరవేయడం వల్ల ఆపత్కాలంలో తక్షణమే స్పందించేందుకు వీలు కలుగుతోందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు 921 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల తమ పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా పొందవచ్చని వివరించారు. ప్రజల చేతుల్లోని ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ల నుంచే ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు అందుకునే సులభతర విధానాన్ని పాలనలో తీసుకువచ్చామని గేట్స్‌కు అధికారులు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు, పాలసీలు వంటివాటి గురించి ప్రజాభిప్రాయ సేకరణపై గేట్స్ ఆరా తీశారు. రాష్ట్రంలో జీఎస్టీ పెరుగుదలను కూడా కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా తెలుసుకోవడం ద్వారా పన్నుల సేకరణ వేగవంతంగా, సులువుగా జరుగుతోందని చంద్రబాబు చెప్పారు. జీఎస్టీ విధానం వల్ల పన్నుల రాబడి బాగా పెరిగిందని చెప్పారు. బ్లాక్ చెయిన్ విధానంలో రెవెన్యూ, ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్నామని వివరించారు. భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ప్రభుత్వ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏపీ ఏఐ సెర్చ్ బార్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. డేటా లేక్‌తో ప్రభుత్వ శాఖలను అనుసంధానం చేస్తున్న తీరును సీఎం వివరించారు.

యువ అధికారుల ప్రజెంటేషన్

ఆర్టీజీఎస్‌లో బిల్ గేట్స్‌కు యువ ఐఏఎస్ అధికారులు సమగ్ర ప్రణాళికల అమలు తీరును క్షుణ్నంగా వివరించారు. ఈ సందర్భంగా వీడియోలు ప్రదర్శించారు. ఆర్టీజీఎస్ అధికారులు ధాత్రి రెడ్డి, మల్లికా గార్గ్, ప్రఖర్‌జైన్, సురేశ్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సాప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్‌సెప్షన్, ఏఐ పెర్ఫార్మెన్స్, ఏఐ సెర్చ్‌బార్, సంజీవని, అమరావతి గురించి గేట్స్‌కు వివరించారు.

గేట్స్ ప్రశంసల వర్షం

ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ ద్వారా అందిస్తున్న పాలన చాలా బాగుందని గేట్స్ అభినందించారు. అమరావతి నిర్మాణం గురించి గేట్స్ ఆరా తీశారు. రాజధాని నిర్మాణం తీరును ముఖ్యమంత్రి వివరించారు. 30 శాతం భూమి పచ్చదనం, నీటి వనరులు కోసం కేటాయించడం బాగుందని గేట్స్ ప్రశంసించారు. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్, బ్లూ గ్రీన్ కాన్సెప్ట్, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం 'గ్రేట్ వర్క్' అంటూ గేట్స్ ప్రశంసించారు.

సంజీవని చాలా బాగుంది

సంజీవని ప్రాజెక్టు 'వెరీ గ్రేట్' అని బిల్ గేట్స్ ప్రశంసించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని పథకంపై ఆయన ఆరా తీశారు. అధికారులు ప్రజెంటేషన్ ద్వారా గేట్స్‌కు వివరించారు. బీపీ, మధుమేహం వంటి వాటికి సంజీవని ద్వారా చేస్తున్న డిజిటల్ పరీక్షలు, వైద్య సేవల గురించి ఆయన తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేస్తున్న డిజిటల్ హెల్త్ రికార్డుల గురించి అధికారులు వివరించారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు ద్వారా వైద్య పరీక్షలు, సేవలు చక్కగా అందుతున్నాయని చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా 'దట్స్ నైస్' అంటూ గేట్స్ ప్రశంసించారు. ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని సీఎం చెప్పారు. ఏఐ ఉపయోగించి వైద్య సేవలను అందిస్తున్న తీరుపై గేట్స్ ఆసక్తి చూపారు. ఈ విధానం బాగుందన్నారు. బయో డిజైన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి గేట్స్ తెలుసుకున్నారు.

గేట్స్, సింధు బ్యాడ్మింటన్

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుతో బిల్‌గేట్స్ షటిల్ బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. గేట్స్ ఫౌండేషన్, పీవీ సింధు ఫౌండేషన్ కుదుర్చుకున్న ఎంవోయూలో భాగంగా విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో సోమవారం ఒక యాడ్‌ను చిత్రీకరించారు. గేట్స్, సింధు క్రీడాకారుల దుస్తులు ధరించి షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.

'గేట్స్' భాగస్వామ్యంతో..

రాష్ట్రానికి దశ-దిశ

ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నాం: సీఎం

- ఆర్టీజీఎస్‌లో చంద్రబాబుతో బిల్ గేట్స్ భేటీ
- పౌరసేవల్లో టెక్నాలజీ, విజన్‌పై వివరణ

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రానికి కొత్త దశ-దిశ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం వెలగపూడి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో సీఎంను ప్రత్యేకంగా కలిశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్, ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలు, లక్ష్యాలు, కార్యక్రమాలు, పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగం తదితర అంశాలను ఆయనకు చంద్రబాబు వివరించారు. 'జీరో పావర్టీ, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, రైతు-అగ్రిటెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ-ఫ్యూయల్, ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ వంటి పది సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరీ గవర్నెన్స్ రాష్ట్రప్రభుత్వ విధానం. దీనికి ఆధార్ ధ్రువీకరణ, వ్యక్తిగత కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సమగ్ర డేటా, అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్, డిజివెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం. టెక్నాలజీ ఆధారిత థీమాటిక్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటమ్ వ్యాలీ డిజైన్ ఫౌండ్రీగా అమరావతిని, డేటా ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం పది రంగాల్లో, 30 ప్రభుత్వ విభాగాల్లో కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగిస్తున్నాం. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు ఉన్నాయి' అని చెప్పారు.

2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్టీ..

2047 నాటికి 180 బిలియన్ డాలర్ల నుంచి 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీ సాధించాలని నిర్దేశించుకున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఎగుమతులను 20.7 బిలియన్ డాలర్ల నుంచి 4,450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను రెండు శాతానికి తగ్గించాలని టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. 'మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం నుంచి 80 శాతానికి పెంచుతాం. ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతం సాధిస్తాం. ఈ ఏడాది జూలైనాటికి రాష్ట్రమంతటికీ సంజీవని కార్యక్రమాన్ని విస్తరిస్తాం' అని వివరించారు.

గేట్స్‌తో మంత్రుల మాటామంతీ..

సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్ గేట్స్‌తో సంభాషించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం ఏర్పాటు ఆలోచనకు కారణమేమిటని పయ్యావుల ప్రశ్నించారు. చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని.. అదే సమయంలో ఆయన తనను కలిసి మైక్రోసాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించాలని ప్రతిపాదించారని గేట్స్ వెల్లడించారు. దీనిపై తమ సిబ్బంది అభిప్రాయం అడిగితే.. హైదరాబాద్‌లో కార్యాలయం పెడితే తాము అక్కడకు వెళ్లేందుకు సిద్ధమేనని వారు చెప్పారని తెలిపారు. ఏఐ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించవచ్చని, నాణ్యమైన నిపుణుల వైద్య సేవలు అందించవచ్చని గేట్స్ సత్యకుమార్‌కు చెప్పారు.

97లో తొలిసారి గేట్స్‌ను కలిశా..

గేట్స్‌తో తన అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన్ను 1997లో మొదటిసారి తాను కలిశానని, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని చెప్పారు. మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలిచిందన్నారు. ఏపీలో సహజ వనరులకు లోటు లేదన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని నంబరు వన్‌గా చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



సచివాలయంలో బిల్‌గేట్స్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ



అల్పాహార సమావేశంలో బిల్‌గేట్స్ బృందం, చంద్రబాబు, పవన్, లోకేశ్



తన చాంబర్ వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ప్రతిమ గురించి బిల్‌గేట్స్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు






1997లో బిల్‌గేట్స్‌తో బాబు

విశాఖలో నేవీ విన్యాసాలు



ఐఎఫ్ఆర్‌కు రెండు రోజుల ముందే పూర్తిస్థాయిలో ప్రాక్టీస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)కు సోమవారం పూర్తిస్థాయిలో రిహార్సల్స్ నిర్వహించారు. 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ ముగిసిన తరువాత 19వ తేదీన రామకృష్ణా బీచ్‌లో వైమానిక దళం ప్రదర్శించనున్న సాహస విన్యాసాలన్నీ ప్రాక్టీస్ చేశారు. ఆహూతుల ముందు నుంచి జాతీయ పతాకం, నౌకాదళం పతాకం రెపరెపలాడిస్తూ సాగిపోయే హెలికాప్టర్ల తరువాత.. ఒక దాని తరువాత ఒకటి దూసుకొచ్చే యుద్ధ విమానాల విన్యాసాలు కళ్లార్పకుండా చేశాయి. డార్నియర్, మిగ్-29కే యుద్ధ విమానాలు, నిఘా విమానం పీ8ఐ, సీ కింగ్, కమోవ్ హెలికాప్టర్లు విభాగాల వారీగా వచ్చి కనువిందు చేశాయి, సముద్రంలో చేతక్ హెలికాప్టర్ల రెస్క్యూ ఆపరేషన్, తీరంపై శత్రుమూకలపై దాడి వంటి అంశాలన్నీ కళ్ల ముందు యుద్ధం జరుగుతున్నట్టుగా ప్రదర్శించారు. ఇవి ముగిసిన తరువాత ఆహ్వానిత దేశాల ప్రతినిధులంతా వారి వారి సంస్కృతీ సంప్రదాయాలతో కవాతు చేస్తూ బీచ్ రోడ్డులో 'పరేడ్' నిర్వహించారు. ఇవన్నీ 19వ తేదీ సాయంత్రం ప్రదర్శిస్తారు.





'చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్'ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

లోకేశ్ ఢిల్లీ పర్యటన

▸▸ చార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్‌ను ప్రారంభించిన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ఎంపీలు కేశినేని చిన్ని, సానా సతీశ్ సాదరంగా స్వాగతం పలికారు. 'చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్'ను మంత్రి ప్రారంభించారు. యువ పైలట్ క్యాడెట్‌లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... 'నా అట్లాంటా పర్యటనలో ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నిజంగా రెక్కలు తొడుగుతోంది. భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగు. యువ పైలట్ క్యాడెట్లతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆనందాన్ని కలిగించింది. విమానయాన భవిష్యత్తుకు కొత్త ఉత్సాహం, దిశ కనిపించింది' అని పేర్కొన్నారు.

తంబళ్లపల్లె కోర్టుకు జోగి సోదరులు

ములకలచెరువు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులో విచారణకు వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో నిందితులైన జోగి సోదరులకు తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు గత నెల 23న బెయిల్ మంజూరు చేయడంతో విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలో సోమవారం కోర్టు వాయిదాకు హాజరుకావడానికి వారు తంబళ్లపల్లెకు వచ్చారు.

ప్రభుత్వ కార్యాలయం కడుతున్నాం..

చందాలివ్వండి!

మదనపల్లెలో భారీగా వసూళ్ల పర్వం

- ▸▸ 25 వేలతో మొదలై రూ.5లక్షల వరకూ..
- ▸▸ రూ.కోటికిపైగా వసూళ్లు!
- ▸▸ టార్గెట్లు పెట్టి మరీ దండుకున్న వైనం
- ▸▸ డబ్బులే కాదు నిర్మాణ సామగ్రి కూడా..
- ▸▸ చిన్న వ్యాపారులపై మోయలేని భారం
- ▸▸ రాష్ట్ర ప్రభుత్వానికి పలువురి ఫిర్యాదు..
- ▸▸ ఆ తర్వాతే ఆ శాఖ దందాకు బ్రేక్

(మదనపల్లె, ఆంధ్రజ్యోతి)

అన్నమయ్య జిల్లా పాత జిల్లా కేంద్రం రాయచోటి నుంచి కొత్త పాలనా కేంద్రం మదనపల్లెకు ప్రభుత్వ కార్యాలయాలు క్రమంగా చేరుకుంటున్నాయి. వాటికి కేటాయించిన భవనాలు, గదులు పాతవి కావడంతో మరమ్మతులు లేక రీమోడలింగ్ చేయించుకోవడం, వాటికి అదనంగా కొత్త భవనాల నిర్మాణంపై దృష్టి సారించాయి. ఈ పనులకు చేసిన ఖర్చులను బిల్లు పెడితే చెల్లిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అయితే, ఇందుకు భిన్నంగా ఓ శాఖ వసూళ్లకు తెర లేపింది. 'కార్యాలయం కడుతున్నాం.. చందాలివ్వండి' అంటూ భారీ ఎత్తున డబ్బులు దండుకునే కార్యక్రమం మొదలుపెట్టింది. తమకు కేటాయించిన భవనానికి ఆ శాఖ మరమ్మతులతో పాటు అదనపు నిర్మాణాలు చేపడుతోంది. అనుబంధంగా మైదానం ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ ప్రహరీ గోడ కట్టాల్సి ఉంది. ఈ 3 పనులు పూర్తి చేయాలంటే పెద్దమొత్తంలో నిధులు కావాల్సి ఉంది. 'మీకు కేటాయించిన గదులు, భవనాల్లో ఆయా విభాగాలకు సంబంధించిన పనులు చేసుకోండి. అందుకయ్యే ఖర్చుకు బిల్లులు చెల్లిస్తాం' అంటూ జిల్లా అధికారులు చెబుతున్నా, ఆ శాఖ మాత్రం వసూళ్లతో ముందుకెళ్లింది. ఇందులోభాగంగా మదనపల్లె, పుంగనూరు ప్రాంతాల్లో హడావుడి చేసింది.

చిరు వ్యాపారులకు పెద్ద కష్టం..

చిరు వ్యాపారుల నుంచి పెద్దస్థాయి వర్తకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వరకు ఎవరినీ వదిలిపెట్టడం లేదు. కనిష్ఠంగా రూ.25 వేల నుంచి మొదలై మధ్యస్థంగా రూ.లక్ష, గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఇక అసోసియేషన్ పరంగా తీసుకుంటే పెద్ద మొత్తాన్ని ప్రకటించి, ఆ మొత్తాన్ని కార్యాలయానికి లేదా ఆ అధికారికి చేర్చేలా ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కార్యాలయ నిర్మాణాలు, ఇతర ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు ఎవరైనా స్వచ్ఛందంగా ఇస్తే స్వీకరించవచ్చు. కానీ, టార్గెట్లు పెట్టి మరీ వసూలు చేయడం, చిన్నపాటి వ్యాపారులు, కుటీర పరిశ్రమలనూ వదిలిపెట్టకుండా చందాలు దండుకోవడమే తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అసలే వ్యాపారాలు లేక ఇబ్బంది పడుతున్న వారిని మరింత ఇబ్బంది పెట్టడం ఏమిటంటూ మదనపల్లె వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె టమోటా మార్కెట్ వ్యాపారులు మొదట్లో రూ.2.20లక్షలు వసూలు చేసి ఇవ్వగా, తక్కువగా ఉందని వెనక్కి పంపారు. ఆ తర్వాత మరింత వసూలు చేసి రూ.3లక్షలు ఆశాఖ ఉన్నతాధికారికి చేర్చినట్లు సమాచారం. ఇలాగే పుంగనూరు మార్కెట్ మార్కెట్ కమిటీ కూడా రూ.లక్ష చెక్కును డివిజన్‌స్థాయి అధికారికి చేర్చినట్లు చెబుతున్నారు.

సీఎంవో సీరియస్

భవనాలు, ఇతర నిర్మాణాలకు కావాల్సిన సామగ్రిని ఆయా వర్గాల నుంచి సమకూర్చుకున్నట్లు చెబుతున్నారు. మట్టి, ఇసుక, ఇటుకలు, కంకర, రాళ్లు, సిమెంటు, కమ్మి, పెయింట్స్, విద్యుత్తు సామగ్రి తదితర వస్తువులు ఆయా రంగాల వ్యక్తులు, వ్యాపారుల నుంచి వస్తు రూపేణ సమకూర్చుకున్నట్లు స్థానికంగా ఆశాఖలో చర్చ నడుస్తోంది. ఇక ట్రాక్టర్లు, టిప్పర్లు, ఎక్సకవేటర్ల యజమానుల నుంచి కూడా వారు ఏ పని చేస్తారో, ఏ వ్యాపారం నిర్వహిస్తారో ఆయా పనిని సేవల రూపంలో వినియోగించుకున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ చేస్తున్న అక్రమ వసూళ్ల వ్యవహారంపై కొందరు అధికార పార్టీ నేతలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం నిధులు ఇస్తామన్నా..ఇలా ప్రజలు, వ్యాపారులపై పడి వసూలు చేయడం ఏంటని వారు సీఎంవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి మదనపల్లెలోని సంబంధిత అధికారులకు అక్షింతలు పడినట్లు తెలిసింది. ఆ తర్వాతనుంచి ఈ వసూళ్లకు బ్రేక్ పడినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు కూడా తెలుస్తోంది.



సచివాలయానికి పూలదారి!

రాజధాని అమరావతిలో సచివాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా విరగపూసిన పింక్ ట్రంపెట్ చెట్లు. నిండా పచ్చదనం... గులాబి వర్ణంలో విరగబూసిన పూలతో ఆ రోడ్డుపై ప్రయాణం ఆహ్లాదం కలిగిస్తోంది

పశువులకూ ముఖ ఆధారిత గుర్తింపు!

▸▸ ముక్కు మీద చర్మం ముడతల వివరాల నమోదు

▸▸ అక్రమంగా రవాణా అయ్యేవాటిని గుర్తించే అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మనుషులకు ఆధార్ నంబరు, ఫింగర్ ప్రింట్, కంటి ఐరిస్ ఉన్నట్లే.. పశువులకూ ముఖ ఆధారిత (ముక్కు మీద చర్మం ముడతల ఆధారంగా) గుర్తింపు సంఖ్య ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'గో-ఆధార్' పేరుతో తిరుపతి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను పశుసంవర్ధక శాఖ ఇప్పటికే చేపట్టింది. ఆ జిల్లాలో దాదాపు 4లక్షల పశువులు ఉండగా, 1.02 లక్షల పశువులకు ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేశారు. అక్కడ ఈ విధానం సక్సెస్ కావడంతో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయాన్ని 2026-27 వ్యవసాయ బడ్జెట్ ప్రసంగంలో మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు కోటి పశువులు ఉండగా, ప్రతి పశువుకు ముఖ ఆధారిత గుర్తింపు నమోదు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మనుషుల మాదిరిగానే ఏ పశువుకైనా ముక్కు మీద చర్మపు ముడతలు ఒకేలా ఉండవని చెప్పారు. గతంలో పశువుల చెవులకు వేసే ట్యాగ్ నంబరునే పశువుకు ఆధార్‌గా పరిగణించారు. అయితే అక్రమ రవాణా సమయంలో ట్యాగ్‌ను పీకేస్తున్నారు. దీనివల్ల అక్రమ రవాణా జరిగే పశువుల్ని పట్టుకున్నా.. ఏ పశువు ఎవరిదో గుర్తించడం కష్టంగా ఉంటోంది. ముఖ ఆధారిత గుర్తింపు వల్ల పశువుని గుర్తించడం చాలా తేలికని అంటున్నారు. ఈ విధానాన్ని త్వరలో కుప్పంలోనూ ప్రవేశపెట్టడానికి పశు సంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇదే విధానాన్ని పశుసంవర్ధక శాఖ సహకారంతో ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ప్రముఖ బీమా కంపెనీ కూడా ముందుకొచ్చిందని అధికారులు తెలిపారు.



ప్రయాణికులను బస్సు నుంచి కిందకు దింపుతున్న తోటి ప్రయాణికులు

తప్పిన పెను ప్రమాదం

▸▸ సింగిల్ రోడ్డులో సడన్ బ్రేక్‌తో గుంతలోకి ఒరిగిన బస్సు

▸▸ బస్సులో 55 మంది ప్రయాణికులు.. అంతా సురక్షితం

శ్రీశైలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం నుంచి ప్రయాణికులతో డోన్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్, పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శిఖరేశ్వరం దోర్నాల ఘాట్ రోడ్డులోని.. చింతల ప్రాంతంలో సింగిల్ రోడ్డు, ఆపై మలుపులు ఉన్నాయి. ఈ క్రమంలో ముందు వెళ్తున్న వాహనం మరింత స్లోగా వెళ్తుండగా వెనుక బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. దీంతో బస్సు రోడ్డు పక్కన గుంతలోకి పూర్తిగా ఒరిగిపోయింది. బస్సు ఎడమ వైపునకు ఒరిగిపోవడంతో డోరు మూసుకుపోయి ప్రయాణికులు బయటికి రాలేకపోయారు. దీంతో.. వారు కేకలు వేస్తూ కుడివైపు కిటికీల గుండా తోటి ప్రయాణికుల సాయంతో బయటికి వచ్చారు. డ్రైవర్‌కు, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో 55 మంది ప్రయాణికులు ఉండగా, ప్రమాదం జరిగిన ప్రదేశంలో లోయ లేకపోవడం, రక్షణగోడ పక్కనే పెద్ద కొండ ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

రేపు విశాఖకు... 20న ఢిల్లీకి సీఎం

న్యూఢిల్లీ, విశాఖపట్నం, అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు బుధవారం విశాఖపట్నం పర్యటనకు వెళుతున్నారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. ఫ్లీట్ రివ్యూలో రాష్ట్రపతితో కలసి సీఎం పాల్గొంటారు. బుధవారం ఉదయం విశాఖ బయలుదేరి వెళ్లి, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ నెల 20న సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొంటారు. కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం విశాఖపట్నానికి రానున్నారు. నేవల్ బేస్‌లోని చోళ సూట్‌లో బస చేస్తారు. అదేరోజు రాత్రి ఆమె ప్రముఖులందరికీ తూర్పు నౌకాదళంలోని ఆఫీసర్స్ మెస్‌లో విందు ఇవ్వనున్నారు.

గోరంట్ల మాధవ్ కేసు విచారణ 16కు వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసు విచారణను విజయవాడ పోక్సో కోర్టు వచ్చే నెల 16కి వాయిదా వేసింది. కర్నూలులో బాలికపై అత్యాచారం ఘటనలో ఆమె పేరు, ఫొటోలను మీడియా సమావేశంలో వెల్లడించారు. దీనిపై మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ గతేడాది చేసిన ఫిర్యాదుపై ఆయనపై కేసు నమోదైంది.

'డ్రగ్స్‌పై దండయాత్ర' అభినందనీయం

▸▸ విజయవాడ పోలీసులపై పీవీ సింధు ప్రశంసలు

విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ నుంచి ఐదుగురు మహిళా పోలీసులు సైకిల్ యాత్ర చేయడం అభినందనీయమని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ప్రశంసించారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఎస్ఐ కడలి రేవతి, హెచ్‌సీ గుమ్మడి హైమావతి, కానిస్టేబుళ్లు చీపు త్రివేణి, షేక్ బీబీ శైలజ, వాయిబోయిన ఉషారాణి ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 510కి.మీ. సైకిల్ యాత్రను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, ఏడీసీపీ మురళీకృష్ణ, సెంట్రల్ ఏసీపీ దామోదరరావు సింధుకు వివరించారు.

498ఏ కేసులో 'లుకవుట్' ఉత్తర్వులా?

- ▸▸ పోలీసులు యాంత్రికంగా వ్యవహరిస్తున్నారు: హైకోర్టు
- ▸▸ తీవ్ర నేరాల్లోనే వాటిని జారీ చేయాలి
- ▸▸ ప్రస్తుత కేసులో పిటిషనర్ విచారణకు సహకరిస్తున్నారు
- ▸▸ విదేశాలకు అనుమతించకుంటే అతడి కెరీర్ దెబ్బతింటుంది
- ▸▸ న్యాయమూర్తి స్పష్టీకరణ.. ఎల్‌వోసీ కొట్టివేత



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త, అతడి బంధువులు క్రూరంగా ప్రవర్తించారనే ఆరోపణలతో నమోదయ్యే ఐపీసీ సెక్షన్ 498 (ఏ) కేసుల్లో సైతం పోలీసులు ఇష్టారీతిన లుకవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ)లు జారీచేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ విషయంలో పోలీసులు యాంత్రికంగా వ్యహరిస్తున్నారని ఆక్షేపించింది. నిందితుడు దర్యాప్తునకు సహకరిస్తున్నారా.. లేదా? అరెస్టు నుంచి తప్పించుకుంటున్నారా అనే అంశాలను పరిశీలించకుండా ప్రతి కేసులోనూ ఎల్‌వోసీ జారీ చేస్తున్నారని పేర్కొంది. తీవ్రమైన నేరాలు, ఆర్థిక అక్రమాలు, దేశ భద్రత, ప్రయోజనాలు ఇమిడి ఉన్న కేసులు.. దౌత్య సంబంధాలు, ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడం, ఉగ్రవాద చర్యలకు పాల్పడే తీవ్ర నేరస్థుల విషయంలో మాత్రమే లుకవుట్ ఉత్తర్వులు జారీ చేయాలని కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు సూచిస్తున్నాయని గుర్తుచేసింది. వ్యక్తులు స్వేచ్ఛగా సంచరించే ప్రాథమిక హక్కును ఎల్‌వోసీ హరిస్తుందని తెలిపింది. ప్రస్తుత కేసులో పిటిషనర్ ఎల్‌వీ అరుణ్‌కిరణ్‌పై నమోదైన 498ఏ కేసు తీవ్రమైనదేమీ కాదని.. వైవాహిక వివాదాలకు సంబంధించి నమోదయ్యే కేసుల్లో ఎక్కువ రాజీతో ముగుస్తాయని, కొన్ని సందర్భాల్లో కేసులు విచారణకు రావడానికే చాలా సమయం పడుతుందని పేర్కొంది. వ్యక్తిని నిర్బంధించడంతో పాటు దర్యాప్తునకు అతడు సహకరించేలా చూడడానికి మాత్రమే పోలీసులకు ఎల్‌వోసీ జారీచేసే అధికారం ఇచ్చారని తెలిపింది. ఈ కేసులో పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తున్నారని, అన్ని వాయిదాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారని, అతడిపై ఎటువంటి నాన్‌బెయిలబుల్ వారెంటూ పెండింగ్‌లో లేదని గుర్తుచేసింది. ఎల్‌వోసీ కారణంగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతించకుంటే పిటిషనర్ వృత్తిజీవితం దెబ్బతినడమే కాకుండా అతడికి పూడ్చుకోలేని నష్టం జరుగుతుందని తెలిపింది. భార్యాభర్తల గొడవ కారణంగా పిటిషనర్ కెరీర్ దెబ్బతినడం సరికాదని పేర్కొంటూ ఎల్‌వోసీని కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి ఇటీవల తీర్పు ఇచ్చారు. అబూధాబీలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న విశాఖకు చెందిన ఎల్‌వీ అరుణ్‌కిరణ్‌పై అతడి భార్య ఫిర్యాదు ఆధారంగా విశాఖ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ 85 (ఐపీసీ 498ఏ), వరకట్న వేధింపులు తదితర సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో నోటీసు అందుకున్న అరుణ్ కిరణ్ పోలీసుల ముందు హాజరై బెయిల్ పొందారు. పోలీసులు కేసు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటు కూడా దాఖలు చేశారు. కేసు విచారణ నిమిత్తం గత నెల 14న అబూధాబీ నుంచి విశాఖకు రాగా.. ఎల్‌వోసీ జారీ అయ్యిందని చెబుతూ పోలీసులు అరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఎల్‌వోసీ జారీని సవాల్ చేస్తూ అతడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి పిటిషనర్‌పై పోలీసులు జారీ చేసిన ఎల్‌వోసీని కొట్టివేశారు.

శిక్షణకు వచ్చి

రూ.1.65 కోట్ల బంగారం చోరీ

▸▸ హైదరాబాద్‌లోని పంజాగుట్ట జోయాలుక్కాస్ షోరూంలో ఘటన

▸▸ విజయవాడలో నిందితుడి అరెస్టు



కారంపూడి గోపాల కృష్ణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ జువెల్లరీ షోరూంలోని సేల్స్ విభాగంలో శిక్షణ కోసం వచ్చిన ఓ యువకుడు రూ.1.65 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు చోరీ చేసి పరారయ్యాడు. షోరూం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి 24గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని పంజాగుట్ట జోయాలుక్కాస్ జువెల్లరి షోరూంలో జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన కారంపూడి గోపాలకృష్ణ (25) జోయాలుక్కాస్ షోరూం ఆరు నెలల శిక్షణకు ఎంపికయ్యాడు. పంజాగుట్టలోని షోరూంలోని పైఅంతస్తులో వసతి కల్పించి అదే షోరూంలో శిక్షణ ఇస్తున్నారు. రెండు నెలలుగా దుకాణానికి సంబంధించిన అన్ని అంశాలను గమనించిన ఆ యువకుడు.. ఈ నెల 14న పథకం ప్రకారం బంగారు బిస్కెట్లు ఉన్న బాక్స్‌లో నుంచి వంద గ్రాముల బరువున్న పది బంగారు బిస్కెట్లను దొంగలించాడు. వాటిని షూ, సాక్సులలో పెట్టుకుని అప్పటికే షోరూం వెనుక భాగంలోని వీధిలో ఉంచిన తన బైక్ తీసుకుని విజయవాడకు పారిపోయాడు. షోరూం ప్రతినిధి సెబాస్టియన్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్‌ఫోన్, సాంకేతికత ఆధారంగా గోపాలకృష్ణను విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

▸▸ ఫిబ్రవరిలో ఏర్పడడం చాలా అరుదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని భూమధ్య రేఖ పరిసరాల్లో ఉన్న హిందూ మహాసముద్రంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. దీనిపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఈనెల 18నాటికి నైరుతి బంగాళాఖాతం/హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించే క్రమంలో మరింత బలపడుతుంది. ఆ తర్వాత ఉత్తర శ్రీలంక, దక్షిణ తమిళనాడు వైపు వచ్చే అవకాశం ఉంది. దీని ప్రభావం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమపై ఏ మేరకు ఉంటుందనేది రెండు రోజుల తరువాత స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. సాధారణంగా ఫిబ్రవరిలో బంగాళాఖాతంలో తుఫాన్‌లు/వాయుగుండాలు/అల్పపీడనాలు అరుదుగా వస్తుంటాయి. 1891 నుంచి 2024 వరకు కేవలం ఏడు తుఫాన్‌లు/వాయుగుండాలు (1944, 1947, 1950, 1961, 1999, 2011, 2022) వచ్చాయి.

కోస్తాలో దట్టంగా పొగమంచు

కోస్తాలోని అనేక ప్రాంతాల్లో సోమవారం దట్టంగా పొగమంచు కురిసింది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు పలు జిల్లాల్లో పొగమంచు ఎక్కువగా ఉంది. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయని పేర్కొంది. కర్నూలులో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్‌కు..

6 వేల మంది ప్రభుత్వ టీచర్లు

▸▸ ఎస్జీటీలకు పాఠశాల విద్యాశాఖ మినహాయింపు

▸▸ బడుల్లో బోధనకు ఇబ్బంది లేకుండా చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా వినియోగించనున్నారు. ఈ మేరకు ఇంటర్ పరీక్షల విధుల కోసం 6వేల మంది టీచర్లను పాఠశాల విద్యాశాఖ కేటాయించింది. ప్రాథమిక పాఠశాలల్లో 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం' కొనసాగుతున్నందున ఎస్జీటీలను ఈ విధుల నుంచి పూర్తిగా మినహాయించింది. వ్యాయామ విద్య టీచర్లు, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్లు, క్లస్టర్ టీచర్లలోని స్కూల్ అసిస్టెంట్లను ఇందుకోసం వినియోగించనున్నారు. కాగా, 1,537 కేంద్రాల్లో జరిగే ఇంటర్ పరీక్షలకు 15వేల మంది ఇన్విజిలేటర్లు అవసరమని ఇంటర్ బోర్డు అంచనా వేసింది. ఇందులో 6 వేల మంది ప్రభుత్వ టీచర్లు, 4 వేల మంది ప్రభుత్వ కాలేజీల్లోని జూనియర్ లెక్చరర్లకు బాధ్యతలు కేటాయిస్తారు. ప్రభుత్వ టీచర్లకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని పరీక్షా కేంద్రాల్లోనే బాధ్యతలు అప్పగిస్తారు. ఇన్విజిలేటర్లుగా ప్రైవేటు కాలేజీల జూనియర్ లెక్చరర్లను ఉపయోగించుకుంటారు. ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,31,275 మంది ఫస్టియర్ విద్యార్థులు, 5,26,264 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

25న టీచర్ల సీనియారిటీ జాబితాలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల విడుదలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జాబితాలు సిద్ధం చేయాలన్నారు. మొదటి విడత జాబితాలను ఈనెల 25న విడుదల చేస్తారు. వాటిపై అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించిన తర్వాత మార్చి 3న రెండో విడత జాబితాలు విడుదల చేస్తారు. మార్చి 15న మూడో విడత జాబితాలు, మార్చి 30న తుది జాబితాలు విడుదల చేసి, సీనియారిటీ ఖరారు చేస్తారు. ఆ సీనియారిటీ ఆధారంగా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతాయి.

పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల ఫలితాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులకు మిగిలిన సబ్జెక్టుల తుది ఫలితాలను ఏపీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఇటీవల కొన్ని సబ్జెక్టుల ఫలితాలు ప్రకటించగా, నాలుగు సబ్జెక్టుల్లో ఎనిమిది మందిని ఎంపిక చేస్తూ తాజాగా ఫలితాలు ఇచ్చింది. అలాగే కాలుష్య నియంత్రణ మండలిలో గ్రేడ్-2 అనలిస్ట్ పోస్టులకు నిర్వహించే పరీక్షల్లో పేపర్-2 సిలబస్ మార్చినట్లు తెలిపింది.

సౌదీలో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో ఉద్యోగాల కల్పనకు బుధవారం విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ డి.మనోహర్ తెలిపారు. సౌదీలో కేబుల్ స్ప్లైసర్, కేబుల్ జాయింటర్, టెస్టింగ్ అండ్ కమిషనింగ్ టెక్నీషియన్, మెకానికల్ టెక్నీషియన్, ప్లంబర్, స్కాఫోల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగావకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 22 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులని, జీతం నెలకు రూ.28,800 నుంచి రూ.72 వేల వరకు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు తాజా బయోడేటా, విద్యార్హత, ఉద్యోగానుభవం సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్‌తో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఇకపై వారు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌లు!

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాల్లోని జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్‌ల హోదాను మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ కోరిక మేరకు వారి హోదాను జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (జేవోఏ)గా మార్పునకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి జీవో 8లో సవరణ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హోదా మార్పుపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. వీరి హోదాను జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మార్చాలని రెవెన్యూ శాఖ గతేడాది డిసెంబరు 10న ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపించింది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,*
*RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.*